7th ANNIVERSARY 22nd October, 2025

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 143 | గురువారం | 13-11-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

డిసెంబర్ 6న భారీ ఉగ్రదాడికి ఉమర్ ప్లాన్

బాబ్రీమసీద్ కూల్చివేతకు ప్రతీకారంగా ప్రణాళిక

04

## ఎర్రకోట వద్ద పేలుడుకు జనవరిలోనే కుట్ర

- పలుమార్లు రెక్కీ నిర్వహించిన డాక్టర్ ముజమ్మిల్ గనై
- మొబైల్ ఫోన్ డేటాలో వెల్లడైన పలు కీలక విషయాలు
- ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు

పేలుడు ఘటన ఉగ్రవాదుల చర్యే
ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని
కేంద్ర కేబినెట్ నిర్ణయం




**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో తవ్వేకొద్దీ సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. జనవరిలోనే పేలుళ్లకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల పోలీసులు వైట్‌కాలర్ టెర్రర్ మాడ్యూల్‌ను ఛేదించిన తర్వాత అరెస్టు చేసిన డాక్టర్ ముజమ్మిల్ గనై మొబైల్ ఫోన్ నుండి సేకరించిన డంప్ డేటాను విశ్లేషించారు. దీంతో కుట్రకు సంబంధించి సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ సం వత్సరం జనవరిలో ఎర్రకోట ప్రాంతంలో గనై అనేక సార్లు రెక్కీ నిర్వహించినట్లు తేలింది. గణతంత్ర దినోత్సవం నాడు చారిత్రాత్మక స్మారక చిహ్నాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి జరిగిన పెద్ద కుట్రలో భాగంగా ఈ రెక్కీలు నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఆ సమయంలో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ తీవ్రతరం కావడంతో కుట్ర భగ్నమైనట్లు పోలీసులు తెలిపారు. జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్‌తో సంబంధాలున్న ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసులు ఛేదించి, ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, కొన్ని గంటల తర్వాత ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంతం సమీపంలో నెమ్మదిగా కదులుతున్న కారులో భారీ పేలుడు సంభవించి 12 మంది మృతి చెందగా, అనేక మంది గాయపడిన విషయం విదితమే. జమ్ముకశ్మీర్,

తరువాయి 2లో

### పూర్తిగా కేంద్ర వైఫల్యమే

ఢిల్లీలో పేలుడు ఘటనపై మల్లికార్జున ఖర్గే విమర్శ

05



### బాధితులకు మోదీ పరామర్శ

ఢిల్లీ పేలుడు వెనుకున్న కుట్రదారులకు ప్రధాని నరేంద్ర మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కుట్రదారులను వదిలిపెట్టే సమస్యే లేదని, వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. భూటాన్ పర్యటన ముగించుకుని ఢిల్లీకి వచ్చిన మోదీ, వెంటనే 'లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ (ఎల్ఎన్‌జెపి) ఆసుపత్రి'కి వెళ్లి బాధితులను పరామర్శించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ తరువాత ఢిల్లీ పేలుడు కుట్రదారులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సీనియర్ అధికారులు, వైద్యులు బాధితుల పరిస్థితిని, అందిస్తున్న చికిత్స వివరాలను ప్రధానికి వివరించారు.



### కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు

- ప్రజాధనంతో నిర్మించిన బ్యారేజీలను వినియోగంలోకి తెస్తాం
- కేంద్ర జలవనరుల సంఘంతో సమన్వయం చేసుకొని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరణకు సన్నాహాలు చేస్తున్నాం
- రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- కొత్త డిజైన్లు రూపొందించాలని నిపుణులకు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగాలైన మేడిగడ్డ,సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజాధనంతో నిర్మించిన ఈ బ్యారేజ్‌లను వినియోగంలోకి తెచ్చేందుకు , రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. కేంద్ర జలవనరుల సంఘంతో సమన్వయం చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల విషయమై రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, నీటిపారుదల ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర జలవనరుల సంఘం సూచనలను పరిగణనలోకి తీసుకుని కొత్త డిజైన్లను రూపొందించాలని నిపుణులను అదేశించినట్టు తెలిపారు. ప్రతిష్ఠాత్మక సంస్థలతో పాటు ఐఐటి అనుబంధ కంపెనీలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సిడబ్ల్యుపిఆర్ఎస్) ద్వారా జియో ఫిజికల్ ,హైడ్రాలిక్ టెస్ట్‌లు నిర్వహించి నష్టం విలువ అంచనా వేసి, పనుల పునరుద్ధరణకు అంకురార్పణ చుట్టబోతున్నట్లు ఉత్తమ్ వివరించారు. మేడిగడ్డ కూలిపోవడానికి ,సుందిళ్ళ, అన్నారం బ్యారేజ్ లలో లీకేజ్‌లకు తప్పుడు నిర్ణయాలు,సాంకేతిక లోపాలే ప్రధాన కారణమనే విషయాన్ని

తరువాయి 2లో



సామాజిక న్యాయం కోసం

### 18న సిపిఐ నిరసన ప్రదర్శనలు

దళితులు, మైనారిటీలపై దాడులను పాలకులే నివారించాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** దళితులు, గిరిజన మహిళలు, మైనారిటీలపై దురాగతాలు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోరుతూ నవంబరు 18 వ తేదీన నిరసన ప్రదర్శనలు జరపాలని పార్టీకి చెందిన అన్ని శాఖలకు భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పిలుపు ఇచ్చింది. సామాజిక న్యాయాన్ని అందించడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఈ ప్రదర్శనల సందర్భంగా తీవ్రంగా వ్యతిరేకించాలని బుధవారం

తరువాయి 12లో



నాగార్జున ఫ్యామిలీకి

### కొండా సురేఖ క్షమాపణ

నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నానని ట్వీట్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబానికి క్షమాపణలు తెలిపారు. గతంలో తాను వారిపై చేసిన వ్యాఖ్యల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మంగళవారం అర్ధరాత్రి ట్వీట్ చేశారు. నాగార్జున కుటుంబాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యల వల్ల వారు బాధపడి ఉంటే చింతిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్లు కొండా సురేఖ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే,

తరువాయి 12లో



### రూ.163 కోట్లు విడుదల చేయండి

ఎస్‌సి, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజన బకాయిలపై ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్‌సి, మైనారిటీ గురుకులాల డైట్, అద్దె బకాయిలు, మధ్యాహ్నం భోజనానికి సంబంధించిన బకాయిలు మొత్తం సుమారు రూ.163 కోట్లు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో బుధవారం ఆర్థిక శాఖ అధికారులు, గురుకులాల అధికారులతో డిప్యూటీ సిఎం సమీక్షా సమావేశం

తరువాయి 2లో

### అటవీ అధికారులపై దాడి

- దేవరకొండ మండలం గువ్వలగుట్ట అడవుల్లో ఉద్రిక్తత
- ఏడుగురు ఫారెస్ట్ సిబ్బందికి తీవ్ర గాయాలు
- ఆసుపత్రికి తరలింపు

ప్రజాపక్షం/దేవరకొండ



రాష్ట్రంలో పోడుభూముల సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. అటవీ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపణల నేపథ్యంలో కబ్జాలను తొలగించేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారుల బృందంపై గిరిజనులు

తరువాయి 12లో



మన్నించండి

### మరోసారి పొరపాటు చేయను

బెట్టింగ్ యాప్ ప్రచారం కేసులో సిట్ ఎదుట నటుడు ప్రకాష్ రాజ్ హాజరు

ప్రజాపక్షం/హైదరాబాద్

బెట్టింగ్ యాప్ ప్రచారం కేసులో నటుడు ప్రకాశ్‌రాజ్ ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లోని సిఐడి కార్యాలయానికి వెళ్లారు. గంటపాటు సిట్ అధికారులు ఆయనను పలు కోణాల్లో ప్రశ్నించినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్ స్కామ్ గురించి గతంలో ఇడి

తరువాయి 12లో

### అమెరికాలో ప్రతిభావంతులు లేరు

- నైపుణ్యంగల శ్రామికశక్తిని ప్రపంచ నలుమూలల నుంచి తెచ్చుకోవాల్సిందే
- మాట మార్చిన ట్రంప్
- హెచ్–1 బి వీసాలపై వైఖరికి సమర్థన



**న్యూయార్క్ :** ప్రపంచం నలుమూలలా ఉన్న ఉన్నతస్థాయి నైపుణ్యం, ప్రతిభను అమెరికాకు తీసుకురావాలని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. హెచ్–1 బి వీసాలపై ఆయన అనుసరిస్తున్న వైఖరిని సమర్థించుకుంటూనే కొన్ని రకాల నైపుణ్యం అమెరికాలో లేదని అన్నారు. హెచ్–1 బి వీసాలను టెక్ కంపెనీలు దుర్వినియోగం చేస్తూ స్థానిక అమెరికన్లకు ఉద్యోగాలు రాకుండా చేస్తున్నాయని, నైపుణ్యం లేని వారిని కూడా తెచ్చి పని చేయించుకుంటున్నారని ఆరోపణలు గుప్పించిన ట్రంప్ నైపుణ్యం పేరుతో మాట మార్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నైపుణ్యం అమెరికాలో కంపెనీల నిర్వహణకు ఎంతో

తరువాయి 12లో

### పక్షం ముందే పనులు పూర్తి

- గిరిజన పూజారుల సూచనల మేరకు పునరుద్ధరణ
- మేడారం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగనివ్వం
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



ప్రజాపక్షం/ములుగు

మేడారం మహా జాతర సందర్భంగా మేడారం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జాతరకు పక్షం రోజుల ముందుగానే అన్ని పనులను పూర్తి చేస్తామని, గిరిజన పూజారుల సూచనల మేరకే పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాష్ట్ర మంత్రులు సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతో కలిసి అభివృద్ధి పనులను మంత్రి శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలం పాటు నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని, 25 రోజుల క్రితం పనులు ప్రారంభం కాగా ఆయా పనులు వేగవంతంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకొని అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, 10 కోట్ల మంది భక్తులు వచ్చిన వారికి సరిపోయే విధంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. మేడారంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈ నెల 22న ముఖ్యమంత్రి సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఎంత డబ్బు ఖర్చు అయినా అభివృద్ధి కార్యక్రమాలను

తరువాయి 2లో

నేల కూలిన టర్కీ విమానం

హసీనా కేసులో నేడు కోర్టు తీర్పు

02

చిలీలో తుది ఘట్టానికి ఎన్నికల ప్రచారం

05

### కాప్–30 సదస్సులోకి దూసుకెళ్ళిన ఆదివాసీలు



నిరసన, ఘర్షణలో భద్రతా సిబ్బందికి గాయాలు

**బెలెం:** వాతావరణ నియంత్రణ సాధనకు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం ప్రారంభమైన కాప్–30 సదస్సు ప్రాంగణంలోకి దేశీయ జాతుల ప్రజలు దూసుకువచ్చారు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక దేశీయ ఆదివాసీలు నిరసన వ్యక్తం చేస్తూ భారీ భద్రతను అసాధారణ పద్ధతుల్లో ఛేదించుకుని లోనికి వచ్చారు. భద్రతా దళాలు వారికి అడ్డుకున్నాయి. దీంతో వారు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణల్లో పలువురు గాయపడ్డారు. అనేక పదుల సంఖ్యలో పురుషులు, స్త్రీలు ఆదివాసీ జాతుల దుస్తులలో మెడలో అటవీ ఆభరణాలతో,

తరువాయి 2లో

### తేమ తెచ్చిన తంటా

సిసిఐ నిబంధనలతో పత్తి రైతు చిత్తు

- ధరలో కోతలు.. ఎకరాకు ఏడు క్వింటాళ్ల నిబంధనతో ఇక్కట్లు
- అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలతో పరేషాన్
- చుక్కలు చూపిస్తున్న కపాస్ యాప్

ప్రజాపక్షం/హనుమకొండ



పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పెట్టిన నిబంధనలు పత్తి రైతుకు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. దీంతో ప్రకృతి విపత్తులను ఎదుర్కొని కాపాడుకున్న పంటను మార్కెట్లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. తేమ నిబంధనతో మద్దతు ధరను కోల్పోతున్న రైతులు కపాస్ యాప్‌తో మరిన్ని కష్టాలను ఎదుర్కొంటున్నారు. పత్తి సాగు వివ రాల నమోదుతో పాటు సిసిఐ కొత్తగా ఏడు క్వింటాళ్ల నిబంధనను తెరపైకి తెచ్చింది. రైతులు పండించిన పత్తిని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సిసిఐ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని షరతు పెట్టింది. దీంతో సరిహద్దు జిల్లాల్లోని రైతులకు సమస్యగా మారింది. అన్ని జిన్నింగ్ మిల్లులకు బేల్ కు ఒకే ధర చెల్లిస్తూ

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇరాక్ ఎన్నికల్లో 55 శాతం పోలింగ్

### ప్రభుత్వ ఏర్పాటు సంక్లిష్ట సమస్యే!

**బాగ్దాద్:** ఇరాక్ పార్లమెంటుకు ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఎన్నికల ఫలితాలు వెల్లడికావడానికి రంగం సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో సుదానీ బ్లాక్ అందరికంటే ఎక్కువగా 50 సీట్లు గెలుచుకుంటుందని ముందస్తు అంచనాలు ఉన్నాయి. ఎన్నికల్లో 55 శాతం మేరకు పోలింగ్ జరిగింది. 329 స్థానాలున్న చట్టసభలో సభ్యులను ఎన్నుకునేందుకు మంగళవారనాడు కోటీ 20 లక్షలమంది ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. 2003లో సద్దాం హుస్సేన్ పతనం తర్వాత ఈ దేశంలో వరుసగా ప్రస్తుతం ఆరోసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ప్రభావ వంతమైన మతాధికారి మొక్తదా అల్‌సదర్ ఎన్నికల బహిష్కరణకు పిలుపు ఇచ్చినప్పటికీ ప్రజలు భారీగానే ఓటింగ్‌లో పాల్గొన్నారు. 2021లో జరిగిన ఎన్నికల్లో 41 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఐతే ఏ ఒక్కపార్టీకీ ప్రభుత్వ ఏర్పాటు చేయడానికి మెజారిటీ రాదని భావిస్తున్నారు. గతంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి చర్చల ప్రక్రియకు ఏడాది సమయం పట్టింది.

# నేల కూలిన టర్కీ విమానం

### 20 మంది సైనికులు మృతి



**అంకారా:** టర్కీకి చెందిన కార్గో విమానం కూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న 20 మంది సైనికులు మరణించారు. జార్జియాలో ఈ సంఘటన జరిగిందని టర్కీ రక్షణమంత్రి యాసెర్ గులెర్ బుధవారం ప్రకటించారు. సి–130 విమానం టర్కీకి తిరిగి వెళ్ళేందుకు అజర్‌బైజాన్‌లోని గంజా నుండి బయలుదేరింది. దారిమధ్యలో జార్జియాలోని సింఘ్‌నాఘి మున్సిపాలిటీ పరిధిలో రెండు వైపుల నుండీ పొగలు వెదజల్లుతూ విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రాంతం అజర్ బైజాన్ సరిహద్దులకు చాలా దగ్గరగా ఉంటుంది. ఐతే విమానం ఎందుకు కుప్పకూలిపోయిందన్న విషయం తెలియరాలేదు. ఆ విషయం తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. టర్కీ ప్రమాదాల నియంత్రణ బృందం ఘటనాస్థలానికి చేరుకుని జార్జియా అధికారుల సహాయంతో దర్యాప్తు ప్రారంభించింది. విమాన శకలాలు అనేకచోట్ల చెల్లాచెదురుగా పడ్డాయి. కొన్ని శకలాలు వ్యవసాయ భూములో పడ్డాయి. "ఎంతో సాహసవంతులైన మా జవాన్ కామ్రేడ్స్ నవంబరు 11వ తేదీన ప్రాణత్యాగం చేశారు, సి– 130 విమానంలో వెళుతుండగా వారు మరణించారు, జార్జియా–అజర్‌బైజాన్ సరిహద్దుల్లో ఈ ప్రమాదం సంభవించింది'' అని టర్కీ రక్షణమంత్రి గులెర్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. తొలుత మంగళవారంనాడు టర్కీ ప్రభుత్వ రేడియో ఒక ప్రకటన చేస్తూ, టర్కీ కార్గో విమానంతో తమ కేంద్రం సంబంధాలు కోల్పోయిందని జార్జియా ఎవియేషన్ అథారిటీ చెప్పిందని వార్త ప్రకటించింది. సి–130 కార్గో విమానాన్ని టర్కీ సైనికులు ఎక్కువగా ఉపయోగిస్తారు. టర్కీ–అజర్‌బైజాన్ సైన్యాల మధ్య సన్నిహిత సహకార సంబంధాలు ఉన్నాయి. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్దోగాన్, ఇతర టర్కీ అధికారులూ అజర్‌బైజాన్ బాకులో ఈనెల 8వ తేదీన జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2020లో ఆర్మేనియాపై అజర్‌బైజాన్ సైన్యం గెలిచి విజయవంతంగా కరబాఖ్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంది. అంతర్జాతీయంగా ఈ ప్రాంతాన్ని నాగోర్నో–కరబాఖ్ సంఘర్షణగా పిలుస్తారు. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు ఈ ఘర్షణ కొనసాగింది. ఐతే ప్రమాదంలో మరణించిన సైనికులు ఈ విజయోత్సవంలో పాల్గొన్నారా? లేదా? అనే విషయం తెలియరాలేదు. అజర్‌బైజాన్, జార్జియా దేశాల అధ్యక్షులు, విదేశాంగమంత్రులు ఈ ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# హసీనా కేసులో నేడు కోర్టు తీర్పు

### బంగ్లాదేశ్‌లో హింస– హై అలర్ట్



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా కేసు విచారణ చేస్తున్న అంతర్జాతీయ క్రైమ్ ట్రైబ్యునల్ (ఐసిటి) గురువారం తీర్పు ప్రకటించనున్నది. ఆమెకు ఉరిశిక్ష విధించాలని విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో హసీనాకు వ్యతిరేకంగా తీర్పు వస్తే సహించేది లేదని అవామీ లీగ్ పార్టీ తీవ్ర హెచ్చరిక చేసింది. గురువారం దేశంలో లాక్‌డౌన్ పాటిస్తామని హెచ్చరించింది. ఈ ఉద్రిక్త పరిస్థితులమధ్య ఢాకాలో హై అలర్ట్ ప్రకటించారు. నగరాన్ని భద్రతా దళాలు పూర్తిగా తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. గడచిన రెండు రోజులుగా దేశంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. బుధవారం నాడు కూడా హింస చెలరేగింది. బస్సులను దహనం చేశారు. దీంతో భద్రతా దళాలు ప్రధాన వీధుల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. గస్తీని ముమ్మరం చేశాయి. సోమవారంనాడు పలుచోట్ల 17 నాటు బాంబు పేలుళ్ళు సంభవించాయి. దేశంలో అనేక చోట్ల హింస చెలరేగింది. తొమ్మిది వాహనాలు దగ్ధమయ్యాయి. ఢాకా శివారులోని గాజాపూర్, అశులియాలలో నాలుగు బస్సులను దుండగులు దగ్ధం చేశారు. అన్ని విమానాశ్రయాలలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు ఢాకా విశ్వవిద్యాలయంలోని అనేక గేట్లకు బుధవారం తెల్లవారుజామునే తాళాలు పడ్డాయి. గేట్లకు పెద్ద పెద్ద అక్షరాలతో "లాక్‌డౌన్'' అని బోర్డులు తగిలించారు. ఈ ఘటనలు జరిగే సమయంలో భద్రతా సిబ్బంది అందరూ వాష్‌రూమ్‌లలో ఉన్నట్లు సమాచారం. గేట్లకు తాళాలు వేసిన దృశ్యాలు ఫేస్‌బుక్‌లలో ప్రత్యక్షమయ్యాయి. కాగా బ్రాహ్మణ్ బారియా బిజోయ్‌నగర్ ఉపజిల్లాలోని చందుర ప్రాంతంలో గ్రామీణ బ్యాంకు భవనాన్ని కొందరు దహనం చేశారు. ఈ మంటల్లో ముఖ్యమైన పత్రాలన్నీ కాలి బూడిదయ్యాయి. ఇదిలా ఉండగా మరోవైపు తమ ఐదు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జమాతే ఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్ సహా ఆరు పార్టీలు ఉమ్మడిగా ఆందోళన చేపడుతున్నాయి.

**న్యాయబద్ధంగా ఎన్నికలు జరిపితే దేశానికి తిరిగొస్తా: హసీనా**

వచ్చే ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలను న్యాయబద్ధంగా నిర్వహిస్తే దేశానికి తాను తిరిగి వస్తానని, కోర్టు విచారణ ఎదుట కూడా హాజరవుతాననీ అజ్ఞాతంలో ఉన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా అన్నారు. పిటిఐకి ఈమెయిల్ ద్వారా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, అందరి భాగస్వామ్యం ఉండేలా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తే తాను దేశానికి తిరిగి వస్తానని, ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారని అన్నారు. ప్రస్తుత తాత్కాలిక దేశాధ్యక్షుడు ఉగ్రవాద శక్తులకు ఆశ్రయం ఇస్తున్నారని విమర్శించారు.

# 17 మిలియన్ డాలర్లు ఉక్రేన్‌కు జి–7 సహాయం

### గాజా స్థిరత్వం సహా కీలక సమస్యలపై చర్చ

**నయాగరా–ఆన్–ద–లేక్ :** యుద్ధం వల్ల తీవ్రంగా నష్టపోయిన ఉక్రేన్‌లోని ఇంధన వనరుల సంరక్షణకు, మరమ్మతులకు వీలుగా17 మిలియన్ డాలర్ల సహాయాన్ని జి–7 సమకూర్చనున్నది. బ్రిటన్ విదేశాంగమంత్రి కూపర్ సమావేశానికి ముందుగానే ఈ విషయం ప్రకటించారు. ప్రపంచంలో ఏడు పారిశ్రామిక ప్రజాస్వామ్య దేశాల గ్రూపునకు చెందిన ఉన్నతస్థాయి దౌత్యవేత్తల సమావేశం రెండు రోజులపాటు (మంగళ, బుధవారాలు) కెనడాలోని దక్షిణ అంటారియోలో జరిగింది. పలు ప్రపంచ వర్తమాన సమస్యలపై సంప్రదాయ మిత్రులుగా ఉన్న ఈ అగ్రదేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్న తరుణంలో ఈ కీలక సమావేశం జరుగుతున్నది. రక్షణ ఖర్చులు, వాణిజ్య సమస్యలతోపాటు గాజాలో డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 21 అంశాల ప్రాతిపదికపై కుదిరిన ఒప్పందంలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితులమధ్య కెనడా విదేశాంగమంత్రి అనితా ఆనంద్ అసోసియేటెడ్ ప్రెస్‌కు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. అనేక సమస్యల మధ్య సంబంధాలు కొనసాగుతాయన్నారు. అమెరికా నుండి వాణిజ్య పరమైన ఒత్తిడులు ఉన్నప్పటికీ ఈ సదస్సులో ఆయనకు కూడా ఆతిథ్యం ఇచ్చిన్నట్లు చెప్పారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోతోపాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాలకు చెందిన ఉన్నతస్థాయి దౌత్యవేత్తలు ఈ రెండు రోజుల సమావేశంలో పాల్గొన్నారు. "అనేక సంక్లిష్టమైన సమస్యలను తాము పరిష్కరిస్తున్నాం, అమెరికన్ల భద్రత, సంరక్షణ మొదటి ప్రాధాన్యత అనే ప్రాతిపదికపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి ప్రపంచంలో ఉన్న అనేక కీలక సమస్యలు పరిష్కరిస్తున్నామని మార్కో రుబియో సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెట్టారు. అదేవిధంగా అనితా ఆనంద్ కూడా ఆస్ట్రేలియా, బ్రెజిల్, భారత్, సౌదీఅరేబియా, మెక్సికో, దక్షిణ కొరియా, దక్షిణ ఆఫ్రికా,ఉక్రేన్ దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులను ఈ సమావేశాలకు ఆహ్వానం పలికారు. మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో కీలక సమస్యపై చర్చకు ప్రాధాన్యం




ఇచ్చినట్లు అనితా ఆనంద్ చెప్పారు. పశ్చిమ ఆసియాలో స్థిరత్వం గురించి ప్రధానంగా చర్చించామని ఆమె అన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను కొనసాగించాలని, దానికి గౌరవించి ముందుకు తీసుకువెళ్ళాలని ఆమె అన్నారు. బుధవారం ఉదయమే దౌత్యవేత్తలు ఉక్రేన్ విదేశీమంత్రితో సమావేశం జరిపారు. ఉక్రేన్ నష్టపోయిన ఇంధన మౌలిక వనరుల మరమ్మతులు, రక్షణకు వీలుగా 17 మిలియన్ డాలర్లు (13 మిలియన్ పౌండ్లు) సహాయం జి–7 పంపుతున్నట్లు చెప్పారు. కెనడా కూడా ఇటీవల ఇలాంటి ప్రకటనే చేసింది.

## గాజాకు 116.62 బిలియన్ యూరోలు ఫ్రాన్స్ ఆర్థిక సహాయం

**పారిస్:** పాలస్తినా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ ఫ్రాన్స్‌లో పర్యటించి ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. గాజాలో అభివృద్ధికి 116.62 బిలియన్ యూరోలు ఆర్థిక సహాయం అందజేస్తామని ఈ సందర్భంగా అబ్బాస్‌కు మేక్రాన్ భరోసా ఇచ్చారు. పాలస్తినాకు గుర్తింపు ఇస్తున్నట్లు పునరుద్ఘాటించారు. గడచిన సెప్టెంబరులోనే అనేక దేశాలు పాలస్తినాకు స్వతంత్రదేశంగా గుర్తింపు ఇచ్చాయి. అదేవిధంగా వెస్ట్‌బ్యాంక్‌ను ఆక్రమించడంపై ఇజ్రాయెల్‌కు ఒక హెచ్చరిక కూడా చేశారు. వెస్ట్ బ్యాంక్‌లో సెటిలర్స్, ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న హింస పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. సహనంగా ఉండాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని మేక్రాన్ కోరారు. వెస్ట్‌బ్యాంక్‌లో గడచిన రెండు సంవత్సరాలుగా సెటిలర్స్, ఇజ్రాయెల్ సైన్యం హింసలో 1,036 మందికి పైగా పాలస్తీనియన్లు హతులయ్యారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ వైఖరిపై ఐక్యరాజ్యసమితి మండిపడింది. కీలకమైన ఆహార, ఇతర సరఫరాలను గాజాలోకి వెళ్ళనివ్వకుండా ఇజ్రాయెల్ సైన్యం అడ్డుపడుతోందని విమర్శించింది. ఒకవైపు గాజాలో శాంతి ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ తన దాడులు కొనసాగిస్తూనే ఉంది. గాజాలో 2023 నుండి ఇప్పటివరకూ 69 వేల మంది పాలస్తీనియన్లు మరణించారు. తాజాగా బుధవారం జరిపిన దాడుల్లో ముగ్గురు పాలస్తీనియన్లు హతులయ్యారు.

## పనులు పూర్తి (మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తూనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గిరిజన సాంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల గద్దెల ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామని, అన్ని పనులను పూర్తి చేసి రానున్న మేడారం మహా జాతరను విజయవంతం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని, గతంలో జరగని అభివృద్ధి కార్యక్రమాలను నేటి ప్రజా ప్రభుత్వం చేస్తుందని వివరించారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రాష్ట్ర పండుగగా గుర్తించిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయకుండా అనుకున్న సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలోనే అమ్మవార్ల గద్దెల ప్రాంతం నుండి పాదయాత్ర ప్రారంభించారని, నేడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికి అమ్మవార్లను దర్శించుకొని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ దేవుళ్ళ ప్రాంతాలలో ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం తగదని, చిత్తశుద్ధితో పనులు చేస్తున్న తమపై ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు. తమ గిరిజనుల సాంప్రదాయ పద్ధతి ప్రకారమే గద్దెల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, గతంలోనే పాలకులు అభివృద్ధి కార్యక్రమాల పేరిట కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. గిరిజనుల అస్తిత్వం, ఆత్మగౌరవానికి విలువలు ఇస్తూనే పనులు కార్యక్రమాన్ని చేపట్టామని, మరో వారం రోజుల్లోగా గద్దెల ప్రాంతం ఒక రూపానికి వస్తుందని వివరించారు. భక్తులు విశ్వాసం నమ్మకంతో అమ్మవార్లను దర్శించుకోవడానికి వస్తున్నారని, వారి విశ్వాసం దెబ్బ తినకుండా ఆదివాసీల అస్తిత్వం కాపాడుకుంటు పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామన్, ఎండోమెంట్ కమిషనర్ హరీష్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి డాక్టర్ శబరీష్, డిఎఫ్ఓ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విడుదల చేయండి (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్‌సి, గురుకులాలు, హాస్టళ్లు ఇతర సంస్థలకు సంబంధించిన డైట్, అద్దె, కాస్మోటిక్స్ బకాయిలకు సంబంధించిన రూ.51.36 కోట్లు విడుదల చేయాలని డిప్యూటీ సిఎం ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. వీటితోపాటు రాష్ట్రంలోని అన్ని మైనారిటీ గురుకులాలు మైనారిటీ విద్యాసంస్థలకు సంబంధించిన డైట్, అద్దె బకాయిలు రూ.47.61 కోట్లు విడుదల చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.63.92 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో, వైవిధ్యంతో కూడిన ఆహారాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలు రూ.200 పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. నిర్వహకులు నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పూర్తిస్థాయిలో పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంస్థల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించేందుకు అధికారులు నిర్దేశిత క్యాలెండర్ ప్రకారం సందర్శించాలని సూచించారు.సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## అధికారులపై దాడి (మొదటి పేజీ తరువాయి)

తిరగబడి కర్రలు, రాళ్లతో దాడిచేశారు. ఈ ఘటన బుధవారం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలం గువ్వలగుట్ట అటవీ ప్రాంతంలో జరిగింది. ఈ ఘర్షణలో ఏడుగురు ఫారెస్ట్ సిబ్బంది తీవ్రంగా గాయపడగా వారిని దేవరకొండ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘర్షణ సమాచారం అందుకున్న చందంపేట పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన అధికారుల ఫిర్యాదు మేరకు గిరిజనులపై కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

## జనవరిలోనే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో విస్తరించి ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌ను పోలీసు లు ఛేదించిన తర్వాత సుమారు 2,500 కిలోగ్రాముల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం క్లోరేట్, సల్ఫర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండ గా, ఎర్రకోట సమీపంలో పేలుడు జరిగిన ప్రదేశం నుండి దాదాపు 40 నమూనాలను సేకరించిన ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), ప్రాథమిక విశ్లేషణ ప్రకారం పేలుడు నమూనాలలో అమ్మోనియం నైట్రేట్ ఉండవచ్చని భావిస్తున్నారు. వాటిలో రెండు గుళికలు, లైవ్ మందుగుండు సామ గ్రి, రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాల నమూనాలు ఉన్నాయి. గనై డంప్ డేటా విశ్లేషణలో జనవరి మొదటి వారంలోనే ఎర్రకోట, చుట్టుపక్కల ప్రాంతాల్లో ముజమ్మిల్ పదే పదే రెక్కీ నిర్వహించినట్లు తేలిందని ఓ సీనియ ర్ పోలీసులు అధికారి చెప్పారు. సోమవారం పేలిన కారును నడుపుతున్న అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమర్ నబీతో పాటు, భద్రతా ఏర్పాట్లు, జన సాంద్రత నమూనాలను అధ్యయనం చేయడానికి డాక్టర్ ముజమ్మిల్ ఎర్రకోటను అనేకసార్లు సందర్శించారన్నారు. టవర్ లొకేషన్ డేటా, సమీప ప్రాంతాల నుండి సేకరించిన సిసిటివి ఫుటేజ్ ద్వారా వారి కదలికలు ధృవీకరించబడ్డాయని చెప్పారు. ఫరీదాబాద్ నుండి 360 కిలోగ్రాముల అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం చేసుకున్న సోమవారం జరిగి న దర్యాప్తులో వెల్లడైంది. అక్కడ అల్‌ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్ట ర్ ముజమ్మిల్ గనై, డాక్టర్ షాహీన్ సయీద్‌లను అరెస్టు చేశారు. పేలుడు తర్వాత ఢిల్లీ పోలీసులు దేశ రాజధాని అంతటా భారీ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీలోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ పాయింట్ల వద్ద పోలీసు సిబ్బంది, పారామిలిటరీ దళాలను పెద్ద సంఖ్యలో మోహరించారు. భద్రతా చర్యలలో భాగంగా నగరంలోకి ప్రవేశించే, బయలుదేరే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఘాజీపూర్, సింఘు, తిక్రి, బదర్‌పూర్‌తో సహా అంతర్రాష్ట్ర సరిహద్దులలో భద్రతా తనిఖీలను సీనియర్ పోలీసు అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. మార్కెట్లు, మెట్రో స్టేషన్లు, రైల్వే టెర్మినల్స్, బస్టాండ్లలో వాహనాలను యాదృచ్ఛికంగా తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని జిల్లా యూనిట్లు, ప్రత్యేక విభాగాలు అప్రమత్తంగా ఉండాలని, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచాలని ఆదేశించినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. సున్నితమైన ప్రదేశాలలో స్నిఫర్ డాగ్‌లు, మెటల్ డిటెక్టర్లు, యాంటీసాబోటేజ్ బృందాలను రంగంలోకి దింపారు.

### ఎరుపురంగు కారు కోసం ముమ్మర గాలింపు

ఎర్రకోట పేలుడు కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును గుర్తించేందుకు ఢిల్లీ పోలీసులు దేశ రాజధానిలోని అన్ని పోలీస్ స్టేషన్లు, పోస్టులు, సరిహద్దు చెక్‌పోస్టులలో అలర్ట్ ప్రకటించారు. ఇప్పటికే పేలుడులో ఉపయోగించిన హ్యుందాయ్ ఐ 20 కారును గుర్తించగా, ఈ ఘటనలో సంబంధం ఉన్న ఇతర అనుమానితులు ఎరుపు రంగు కారును కలిగి ఉన్నారని దర్యాప్తులో వెల్లడైందని, దీంతో ఢిల్లీలో అలర్ట్ జారీ చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వాహనాన్ని గుర్తించడానికి ఢిల్లీ పోలీసుల కనీసం ఐదు బృందాలను నియమించగా, పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్, హర్యానా పోలీసులు కూడా నిఘాను కొనసాగించాలని, తనిఖీల్లో సాయం చేయాలని అప్రమత్తం చేశారు.

### కార్ డీలర్‌ను అదుపులోకి తీసుకున్న స్పెషల్ సెల్

ఎర్రకోట పేలుడు కేసుకు సంబంధించి ఫరీదాబాద్‌కు చెందిన కార్ డీలర్‌ను స్పెషల్ సెల్ అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ, పరిసర రాష్ట్రాలలోని అన్ని సెకండ్ హ్యాండ్ కార్ డీలర్‌లను ఇటీవలి వాహన అమ్మకాల వివరాలను తెలియజేయాలని ఆదేశించినట్లు అధికారులు బుధవారం తెలిపారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఫరీదాబాద్ సెక్టార్ 37లోని రాయల్ కార్ ప్లాజా యజమాని అమిత్‌ను సోమవారం రాత్రి ఫరీదాబాద్ పోలీసుల సహాయంతో అదుపులోకి తీసుకున్నారు. ఎర్రకోట సమీపంలో సోమవారం జరిగిన శక్తివంతమైన పేలుడులో ఉపయోగించిన హ్యుందాయ్ ఐ20 అమ్మకానికి అతను సహకరించాడని ఆరోపణలు ఉన్నాయి.

## పునరుద్ధరణ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ,న్యాయ కమిషన్‌లు స్పష్టం చేశాయని గుర్తు చేశారు. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ పై కుడా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అర్హత కలిగిన స్వతంత్ర సాంకేతిక సంస్థలను నియమించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.తాజాగా కురిసిన భారీ వర్షాలతో నీరు చేరుకుందని,15 నుండి 20 రోజులలో నీరు తగ్గిన వెంటనే పరీక్షలు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా మొదట ఐదు సంస్థలను ఎంపిక చేసి అందులో మూడింటిని ఫైనల్ చేస్తామని, డ్యామ్ సేఫ్టీ రంగంలో అనుభవం కలిగి ఉండడంతో పాటు సాంకేతిక సంస్థలతో అనుభందం కలిగి ఉన్న సంస్థలనే ఫైనల్ చేస్తామని అన్నారు.

### పునరుద్ధరణ వ్యయం ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలదే

పునరుద్ధరణ వ్యయం మొత్తం ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆయా సంస్థలే భరించాల్సి ఉంటుందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన అనుభవాల దృష్ట్యా ప్రజా ఆస్తుల పరిరక్షణ నిమిత్తం నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పునరుద్ధరణ పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు. డిజైన్ లోపాలు, పనుల నిర్లక్ష్యం ,ఆర్థికంగా జరిగిన అవకతవకలను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో స్పష్టం చేసిందన్నారు. ఇదే విషయంలో విచారణ నిర్వహించిన విజిలెన్స్ శాఖ, సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిందని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సమ్మక్కసారక్క, సీతమ్మ సాగర్,సీతారామ సాగర్,చనకాకోరాట, దేవాదుల,చిన్న కాళేశ్వరం, ఎస్.ఎల్.బి.సి హెలిబోర్న్ సర్వే, డిండిలతో పాటు జూరాల వద్ద నిర్మించ తల పెట్టిన ప్రత్యామ్యాయ బ్రిడ్జి సింగూర్ కాలువ లైనింగ్ పనులను ఉత్తమ్ సమీక్షించారు.

# తేమ తెచ్చిన తంటా

(మొదటి పేజీ తరువాయి)

ఎల్1, ఎల్2, ఎల్ 3 విదానాన్ని ప్రవేశ పెట్టడంపై జిన్నింగ్ మిల్లర్లు సీసీఐపై మండిపడుతున్నారు. పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని హెచ్చరికలకు దిగుతున్నారు. సీసీఐ నింబంధనల తీరుతో రైతుల పంట విక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఆరుగాలం శ్రమించిన పంటను మార్కెట్లో స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు కూడా లేదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్లో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అష్టకష్టాలు పడి పత్తిని కాపాడుకున్న రైతులపై అక్టోబరు చివ రలో వచ్చిన తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పత్తి తీసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో వచ్చిన తుఫాన్ రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. ఈ ప్రకృతి విపత్తును సైతం కొందరు రైతులు నిలదొక్కుకుని మిగిలిన పత్తిని అమ్ముకుందామంటే మార్కెట్లో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా సీసీఐ పూటకో నిబంధనను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. 8 నుంచి 12శాతం కంటే తేమ మించితే మద్దతు ధర ఇవ్వటం లేదు. ప్రస్తుతం తుఫాన్‌తోపత్తి పంట మొత్తం నీట మునిగింది. ఇళ్లలో ఆరబెట్టినప్పటికీ పత్తికి కూడా వరుస వర్షాలతో నిమ్ము చేరింది. పత్తిని ఎండలో ఆరబెడతామంటే మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ నిబంధన రైతులకు శాపంగా మారింది. వాతావరణంలోనే తేమ పెరిగి ఉందని, అలాంటప్పుడు 12శాతం లోపు తేమతో పత్తిని మార్కెట్కు తీసుకరావటం ఎలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తేమ పేరుతో సీసీఐ అధికారులు మద్దతు ధరలో కోత పెడుతుండటంతో రైతులు ఇబ్బం ది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తేమ శాతాన్ని 18 నుం చి 30 శాతానికి పెంచాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని సీసీఐ పట్టించుకోవ టం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

### జిన్నింగ్ మిల్లర్లతో కొర్రీలు

పత్తి విక్రయానికి వచ్చినప్పటి నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండి యా(సీసీఐ) తీసుకువస్తున్న నిబంధనలు రైతుకు గుదిబండగా మారుతు న్నాయి. పత్తి కొనుగోలు ప్రక్రియకు ముందే జిన్నింగ్ మిల్లులతో సీసీఐ పంచాయితీకి దిగింది. పాత నిబంధనలను మార్చటంతో మిల్లులను సీసీఐకి అద్దెకు ఇచ్చేందుకు జిన్నింగ్ మిల్లుల యాజయాన్యాలు నిరాకరించా యి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రత్యేక చొరవ తో జిన్నింగ్ మిల్లుల పంచాయితీ ఓ కొలిక్కివచ్చినట్టే వచ్చినా.. మళ్లీ సీసీఐ కొర్రీలతో మొదటికి వస్తోంది. తెలంగాణాలో మొత్తం 322 జిన్నింగ్ మిల్లు లు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 మిల్లులను గుర్తించారు. ఒక పత్తి బేల్కు రూ.1,440లు చెల్లించేందుకు మిల్లు యాజమానులతో సీసీఐ. ఒప్పందం చేసుకుంది. అక్టోబరు చివరివారంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే జిన్నింగ్ మిల్లులను సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 పేరిట వర్గీకరించింది. కపాస్ యాప్లో తొలుత ఎల్1 మిల్లుల జాబితానే సీసీఐ ప్రదర్శిస్తోంది. ఆ మిల్లుల్లో సామర్థ్యం పూర్తయితే ఎల్2కు, ఆ తరు వాత ఎల్3 మిల్లులకు అవకాశం ఇస్తోంది ఈ విధానంపై జిన్నింగ్ మిల్ల ర్లు అభ్యంతరం చెప్పుతున్నారు. రైతులు తమ ప్రాంతంలో ఉన్న సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశాన్ని చేజార్చుకుంటున్నారని మిల్లర్లు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి జాబ్ వర్క్ టెండర్లు ఇవ్వలేదని, అన్ని మిల్లుల్లో బేల్కు ఒకటే ధర చెల్లిస్తు న్నారని, అలాంటప్పుడు మిల్లుల వర్గీకరణ ఎందుకని, అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు ఒకేసారి చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియే షన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్రెడ్డి డిమాండ్ చేశారు.

### అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలు

రైతులపై సీసీఐ మరో నిబంధన బాంబు పేల్చింది. గతంలో రైతులు తమ పంటలను విక్రయించుకునేవారు. అయితే సీసీఐ కొత్త నిబంధన ప్రకారం రైతులు తమ ఉమ్మడి జిల్లా పరిధిలోనే పత్తి పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఆ విధంగా కపాస్ యాప్లో నిబంధనలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు పక్కనే ఉన్న కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో పత్తిని అమ్ము కునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సరిహద్దులో ఉన్న మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు ఏటా పత్తిని 25కిలో మీటర్ల దూరంలో ఉన్న కరీంన గర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు తీసుకెళ్లి విక్ర యిస్తారు. సీసీఐ కొత్త నిబంధనతో ఈసారి జమ్మికుంటలో మొగుళ్లపల్లి రైతులు పత్తిని విక్రయించే అవకాశం లేకుండా పోతోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కూడా పత్తి అమ్మకానికి వస్తుంది. కొత్త నిబంధన రైతులకు శాపంగా మారిందనే విమర్శలున్నాయి. అలాగే సీసీఐ చర్యలతో పత్తి కొనుగోళ్లపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం జిల్లాలో 7లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 8జిన్నింగ్ మిల్లులే ఉన్నాయి. వరంగ ల్లో 10లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 56 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఖమ్మంలో జిన్నింగ్ మిల్లులు ఫుల్ అయితే సీసీఐ 7 కొనుగోళ్లపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కొను గోళ్లు నిలిచిపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని జిన్నింగ్ మిల్లర్లు పేర్కొం టున్నారు. అంతర్ జిల్లాల్లో పత్తి అమ్మకాలపై సీసీఐ అంక్షల పెట్టడంపై రైతులు తీవ్ర నిర సన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని.. అరుగాలం శ్రమించి సాగు చేసిన పత్తిని తమకు నచ్చిన చోట అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతు న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ నిబంధనలపై దృష్టి పెట్టి రైతులపై భారం పడకుండా స్వేచ్ఛగా తమ పంటను అమ్ముకునేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### చుక్కలు చూపిస్తోన్న కపాస్ యాప్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ యాప్ కూడా రైతులకు చుక్కలు చూపిస్తోంది. వ్యవసాయ అధికా రులు ముందస్తుగా రైతులకు ఈ యాప్పై అవగాహన కల్పించలేదు. దీంతో నేరుగా స్మార్ట్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని, పంట వివరాలను నమోదు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య నుంచి బయటపడే లోపే మొన్నటివరకు ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసే నిబంధనకు సీసీఐ ఆంక్షలు విధించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా దిగుబడి తగ్గిందనే సాకుతో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతులు విక్రయించుకునే విధంగా కపాస్ యాప్ లో నిబంధనలను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కౌలు రైతులు, పట్టాబుక్కులు లేని రైతులు సీసీఐకి పత్తిని అమ్ముకోవటంలో సమస్యలు ఎదురవుతున్నాయి.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హైదరాబాద్‌లో విదేశీయుల వ్యభిచార ముఠా గుట్టురట్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చదువు పేరుతో విదేశాల నుంచి వచ్చిన యువతులతో హైదరాబాద్‌లో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు ప్రధాన నిందితుడు డేరియస్‌తో పాటు నలుగురు విదేశీ మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హాఫీజ్‌పేట్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో రహస్యంగా వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసు లు ఆ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేపట్టగా, అక్కడ విదేశీ మహిళలతో వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ రాకెట్‌ను లైబేరియా దేశానికి చెం దిన డేరియస్(28) నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇతడు 2021లో స్టూడెం ట్ వీసాపై భారత్‌కు వచ్చి, స్థానికంగా ఓ కళాశాలలో ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నాడు. కెన్యా, ఉగాండా దేశాలకు చెందిన మహిళలతో ఇతడు ఈ దందాను నడిపిస్తున్నట్లు విచారణలో తేలింది.




- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- వరంగల్‌లో జిల్లాస్థాయి జనసేవాదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

## పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

**ప్రజాపక్షం/ వరంగల్ :** కమ్యూనిస్టులే పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వరంగల్ నగరంలోని ఓ సిటీ మైదానములో జిల్లాస్థాయి జనసేవదళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా శిబిరాలను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి వ్యవస్థకు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, దానికి ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు నిలబడుతున్నారన్నారు. భారత దేశంలో రానున్న కాలంలో మతోన్మాద, పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లనుందన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం పోరాడిన చరిత్ర సిపిఐది అని, భారత దేశ గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నదని, ఈ ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటు వంటి పార్టీగా సిపిఐ ప్రజల హృదయాలలో నిలిచిపోయిందన్నారు. స్వాతంత్య్రం అనంతరం అంతరా లు లేని సమాజం కోసం, భూ సంస్కరణలు అమ లు కోసం, పీడిత, తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐదన్నారు. అధికారం లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారికోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి జనసేవాదళ్ కార్యకర్త వాటి విజయవంతానికి విధిగా పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈనెల 18,19 తేదీలలో సిపిఐ బస్ జాతా జరుగనుందని, ఈ బస్ జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, సంగీ ఏలేందర్, కందిక చెన్నకేశవులు, ఐయిత యాకుబ్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, ఎండి అక్బర్ పాషా, దామెర కృష్ణ, పరికరాల రమేష్, భవాని తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపిలు ఒక్కటైతే దేశానికి నష్టం

మరణంలేని సిద్ధాంతమే కమ్యూనిజం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బిఆర్ఎస్, బిజెపి ఒకటైతే దేశానికే నష్టమని, కమ్యూనిస్టులను అంతంచేయడం ఎవరితరంకాదని , మరణంలేని సిద్ధాంతమే కమ్యూనిజం అని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మ ణచారి భవనంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశానికి సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడు తూ సర్వమానవులు సమానంగా ఉండాలన్నదే సిపిఐ సిద్దాంతమని, భారతగడ్డపై కార్మికుల పక్షా న పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తిచేసుకోవడం గర్వకారణమన్నారు. బిజెపి పెరిగితే ధనికులు పేదవారు అనే తారతమ్యభేదాలు పెరుగుతాయని, భారత్‌మాతాకి జై అంటే నే హిందువులని , క్రిస్టియన్స్, ముస్లింలు హిందువులుకాదని ఆరోపణలు చేయడం ఆర్ఎస్ఎస్ ని నాదం అన్నారు. దేశంలో మోదీ, మన్మోహన్‌సిం గ్, ఇందిరాగాంధీ దేశ పునాదులు రాజకీయ పునాదులను సర్వమత సమ్మేళనం ఉండటం భారతదేశానికి దక్కుతుందని ఆయన గుర్తు చేశారు. భారతదేశం మోదీ హయాంలోని అభివృద్ధి చెందిందని ప్రగల్భాలు పలుకుతున్న ఆర్ఎస్ఎస్ నాయకులు




స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి ఎలాంటి పునాది లేకుండానే అభివృ ద్ధి ఎలా సాధ్యమని ఆయన విమర్శించారు. సిపిఐ భావజాలాలని రాజ్యాంగంలో పొందుపర్చారని ప్రస్తుతం దేశంలో దున్నేవాడిదే భూమి, మహిళల కు 33శాతం రిజర్వేషన్లు వంటి అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది సిపిఐ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల్‌నర్సింహ్మ మా ట్లాడుతూ వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేస్తున్న బహిరంగసభను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా సమితి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వహయాంలో పేదలు ఇండ్లకోసం అనేక ఇబ్బందులుపడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా పేదలకు ఇల్లు కేటాయించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇతర పథకాల సబ్సిడిలు కూడా అందడంలేదని ఆయన గుర్తుచేశారు. మొంథా తు ఫాన్‌వల్ల జిల్లాలో పత్తిరైతులు తీవ్రంగా నష్టపోయారని ఎకరాకు రూ.50వేల రూపాయలు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్‌చేశారు. సిసిఐ తేమపేరుతో రైతులను ఇబ్బందిపెడుతున్నారని, అధికారులు మార్పు చెందకపోతే రైతులపక్షా న సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, మహబూబ్‌నగర్ జిల్లాకార్యదర్శి బాలకిషన్, గద్వాలజిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నర్సింహ్మ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, వార్లవెంకటయ్య, ఎఐటియూసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మ, దళితహక్కుల పోరాటసమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, పాల్గొన్నారు.




## తేమ, తరుగు, తాలు వంటి విషయాలతో రైతులను సతాయించొద్దు

రాత్రి, పగలు పనిచేసి ధాన్యం కొనుగోలును సవ్యంగా పూర్తిచేయాలి
మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** అకాల వర్షాలు ,తుఫాన్ వల్ల ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున అవసరమైతే లైట్లు ఏర్పాటు చేసి అధికారులు, రైస్ మిల్లర్లు రాత్రి, పగలు పనిచేసి ధాన్యం కొనుగోలును సవ్యంగా పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. బుధవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం, పత్తి సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు దాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ధాన్యం సేకరణను పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని, మిల్లర్లు రైతులను ఏలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం అన్లోడ్ చేసుకోవాలని,ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తేమ, తరుగు, తాలు వంటి విషయాలతో రైతులను సతాయించవద్దని ఆయన కోరారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లులలో నైట్ షిప్టు ఏర్పాటు చేసి హమాలీలు పనిచేసే విధంగా చూడాలని, రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ధాన్యం సేకరణలో రెండవ స్థానం పొందినదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కొనుగోలును సవ్యంగా చేయాల్సిందిగా కోరారు. పత్తి కొనుగోలపై మంత్రి సమీక్షిస్తూ సిసిఐ నిబంధనల సడలింపుకు సంబంధించి ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయం తీసుకోవాల్సిన అంశాలు ఉన్నాయని, పత్తి కొనుగోలు విషయంలో ఇదివరకే మిల్లర్లతో మాట్లాడటం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఈ వానాకాలంలో జిల్లాలో 6,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదని ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతున్నాయని,తుఫాను వల్ల ధాన్యం సేకరణకు ఇబ్బంది కలిగిందని,అయినప్పటికీ 40 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేయడం జరిగిందని, ఈ సీజన్‌లో ఒక్కరోజు రూ.36 కోట్లు చెల్లించిన దాఖలాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో తుఫాను వల్ల తడిసిన 4600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరిగిందని, జిల్లాలో గోదాం సమస్యను దృష్టిలో ఉంచుకొని పెద్ద వేర్ హౌస్ గోదాం నిర్మాణం అవసరమని, సైలో సిస్టంలో గోదాము ఏర్పాటు చేయాల్సి ఉందని మంత్రికి విజ్ఞప్తి చేశారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేష్, జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి, డిసిఓ పత్యా నాయక్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి ఛాయా దేవి, రైస్ మిల్లర్లు నారాయణ, భద్రం, ఇంద్రసేనా రెడ్డితదితరులు పాల్గొన్నారు.

## సమయపాలనను కఠినంగా అమలు చేయాలి

మంత్రి తు మ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమయానికి విధులకు హాజరుకాని అధికారుల పట్ల వ్యవసాయ, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అసహనం వ్యక్తం చేశారు. సమయపాలనను కఠినంగా అమలు చేయాలని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని హాకా, సీడ్ సర్టిఫికెట్ కార్పొరేషన్ ,సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హ్యాండ్లూమ్‌టెక్స్‌టైల్ ప్రధాన కార్యాలయాలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం ఆకస్మీకంగాతనికీ చేశారు. సమయపాలన పాటించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమయపాలన పాటిస్తుండగా, రెగ్యులర్ ఉద్యోగులలో ముఖ్యంగా జనరల్ మేనేజర్, మేనేజర్ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విధులకు హాజరుకాని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల కమిషనర్లు, ఎండీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఉన్నత స్థాయి అధికారులు నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ సమయపాలన పాటిస్తూ, ప్రజాసేవలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని తుమ్మల సూచించారు.



## సివిల్స్ మెయిన్స్‌లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటాలి

- మెయిన్స్‌కు ఎంపికైన 43 మంది తెలంగాణ అభ్యర్థులకు భట్టి అభినందనలు
- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం కింద 342 అభ్యర్థులకు రూ.3.61 కోట్ల ఆర్థిక సాయం

**ప్రజాపక్షంట/హైదరాబాద్:** సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం ద్వారా లబ్ధి పొందిన 43 మంది మెయిన్స్‌కు ఎంపిక కావడం అభినందనీయమని, వారు ఇంటర్వ్యూలలోనూ సత్తా చాటి తెలంగాణ ప్రతిష్టను దేశవ్యాప్తం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గత ఏడాది ఈ పథకాన్ని ప్రారంభించగా ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 342 మంది తెలంగాణ యువత రూ.3.62 కోట్ల ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ ద్వారా పొందారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడంలో భాగంగా సివిల్స్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంపికైన వారికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించి ప్రతి దశలో లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని అందులో 43 మంది విద్యార్థులు సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికకయ్యారని, వారికి మరో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు ఢిల్లీలో వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గొప్ప సంకల్పంతో 2024 లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయాసం పథకాన్ని ప్రారంభించగా మొదటి ఏడాది 140 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా అందులో ఏడుగురు సివిల్ సర్వీసెస్ సాధించి వివిధ హోదాల్లో స్థిరపడడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక సహకారం అందించిన సింగరేణికి గర్వకారణమన్నారు.

### అభ్యర్థులకు సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు

తెలంగాణ రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యుపిఎస్‌సి మెయిన్స్ 2025 ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్రం నుంచి సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. సివిల్స్ సాధించే లక్ష్యంతో సన్నద్ధమయ్యేందుకు పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు గత ఏడాది రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది కూడా ఈ పథకం కింద సింగరేణి సంస్థ అధ్వర్యంలో 202 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 43 మంది తాజాగా యుపిఎస్‌సి మెయిన్స్ ఫలితాల్లోనూ విజేతలుగా నిలిచారు. రాష్ట్రం నుంచి మెయిన్స్ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ గతేడాది మాదిరిగా ఈసారి కూడా ఇంటర్వ్యూలకు సన్నద్ధం అయ్యేందుకు మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందించనున్నట్లు సిఎం కార్యాలయం తెలియజేసింది.

## రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతం చేస్తున్నాం

రాష్ట్ర గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్



**ప్రజాపక్షం/జైపూర్ :** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల గదులను కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసి సకల సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగించుకుని ఏకాగ్రతతో విద్య అభ్యసించి ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో మంచి నైపుణ్యం పొందాలని, ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన విద్య అందించేందుకు 51వేల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. రెండు కోట్ల 5 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో అదనపు గదులు నిర్మించడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు 15రోజులలో ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. రెండు కోట్ల 5 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన జూనియర్ కళాశాల అదనపు గదులలో తరగతి గదులు, పరిపాలనా విభాగం, ల్యాబ్ ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో 6 వేల నుండి 7 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా 41 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పొన్నంకు తెలంగాణ గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటు న్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హైదరాబాద్ లోని సచివాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ ప్రతినిధి బృందంలో తెలంగాణ గీత పని వారల సంఘం కేంద్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని నాగభూష ణం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవిఎల్, రాష్ట్ర కార్యదర్శి ఎం.ప్రవీణ్ కు మార్ గౌడ్ ఉన్నారు. 'గీతా కార్మికుల సమస్యల' పరిష్కారానికి తె లంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న రాష్ట్ర సదస్సుకు మంత్రి పొన్నంను బొమ్మగాని ప్రభాకర్ ప్రతినిధి బృందం ఆ హ్వానించింది. ఇందుకు మంత్రి అంగీకరించినట్టు ఆయన తెలిపారు.

## నియంతగా వ్యవహరిస్తున్న ఒయు విసి

- ప్రశ్నిస్తున్న విద్యార్థులపైన కేసులను నమోదు చేసి, ఒయును ఒక నిర్బంధ కేంద్రంగా మార్చారు
- 'పిహెచ్‌డి- 2025' సంబంధించిన సమస్యలు పరిష్కరించకుండా ఏకపక్షంగా అడ్మిషన్ల ప్రక్రియ
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మ ణ్ మండిపాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలో ప్రజాస్వామ్య చర్చలకు, సమా వేశాలకు, సభలను నిర్వహించుకునేందుకు 'హాల్స్'కు అనుమతి ఇవ్వకుండా ఒయు విసి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టలక్ష్మ ణ్ మండిపడ్డారు. ప్రశ్నిస్తున్న విద్యార్థులపైన కేసులను నమోదు చేసి, ఒయును ఒక నిర్బంధ కేంద్రంగా మార్చారని మండిపడ్డారు. ఒయు విసి పాలన ఒక నియంతృత్వ, అహంకారపూరిత ధోరణితో కొనసాగుతోందన్నారు. ఎఐఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ సమావేశం ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ఒయు విసి నిషేధాజ్ఞలతో విద్యార్థుల హక్కులకు చరమగీతం పాడారన్నారు. 'పిహెచ్‌డి2025' అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన సమస్యలను పరిష్కరించకుండా ఏకపక్షంగా కేవలం కొంతమంది విద్యార్థులకు లబ్ధి చేకూరే విధంగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో గత విసి ప్రొఫెసర్ రవీందర్ అవలంభించిన విద్యార్థి వ్యతిరేక విధానాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒయు విసి ప్రొఫెసర్ కుమార్ మొలగరం సరిదిద్దుతారని అందరూ ఆశిస్తే, అందుకు భిన్నంగా విద్యార్థులను, ప్రొఫెసర్లను, ఉద్యోగులను పరస్పరం కలవకుండా, ఒయులో గడిల పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్రలో భాగంగా పిజి, పిహెచ్‌డి, ఇంజనీరింగ్, ఎల్.ఎల్.బి ఎల్ఎల్ఎం ఇతర కోర్సుల ఫీజులను పెంచారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన ఫీజులను తగ్గించలేదని మండిపడ్డారు. తాజా అసిస్టెంట్లు ప్రొఫెసర్ల పదోన్నతులలో ఉద్దేశపూర్వకంగా కొంతమందికి పదోన్నతులు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. విసి ఇప్పటికైనా నియంతృత్వ విధానాలు విడనాడి, ఉస్మానియా యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని పుట్ట లక్ష్మ ణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఒయు కౌన్సిల్ అధ్యక్షులు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శులు ఉప్పల ఉదయ్ కుమార్, సాయి భగత్ నాయకులు అశ్వన్,మధు,రమేష్, సుమన్, గోండి రామ్ గణేష్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

**నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: U40109TG2000SGC034119
టెండర్ నోటీసు నం. 15/2025-26
(i) ఖమ్మం సర్కిల్, సత్తుపల్లి డివిజన్‌లోని కిష్టారం (V) వద్ద ఉన్న SCCL నివాస కాలనీకి సెమీ టర్న్‌కీ ప్రాతిపదికన సరఫరా పొడిగింపు.
పనుల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.tgnpdcl.com నుండి పొందవచ్చు
సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGNPDCL, వరంగల్.
DIPR R.O. No. : 10504-PP/CL/ADVT/1/2025-26, Date: 12-11-2025

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
NIT No. 40, పని పేరు: జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో నీటి స్తబ్దతను తొలగించడానికి క్రాసింగ్ అందించడం మరియు ఉపరితల రాతి కట్టింగ్‌తో crs మెట్లతో cc రోడ్డు వేయడం వంటి 2 పనుల కోసం. **అంచనా విలువ / ఇసివి:** రూ.9.30లక్షలు, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం:** 13.11.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 17.11.2025న మ.2.45గం.ల వరకు. **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్ నెం.9989930608. ఇ-మెయిల్ ఐడి: eec11.ghmc2@gmail.com.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 10520-PP/CL/ADVT/1/2025-26, Date: 12-11-2025




# జనరల్
STATE & REGIONAL NEWS

## కెటిఆర్‌పై చర్యలు తీసుకుంటాం : ఐపిఎస్ అధికారుల సంఘం

ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసు శాఖ పరువు తీసే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ఐపిఎస్ అఫీసర్స్ అసోసియేషన్ (టిఐఒఎ)హెచ్చరించింది. ఇటీవల బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కె.టి.రామారావు ఓ న్యూస్ టివి ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డిజిపి శివధర్‌రెడ్డిపై అసమంజసమైన, అవమానకరమైన వ్యాఖ్యలను టిఐఒఎ తీవ్రంగా ఖండించింది. ఈ ఇంటర్వ్యూలో కెటిఆర్.. డిజిపితో పాటు మొత్తం తెలంగాణ రాష్ట్ర పోలీసులను లక్ష్యంగా చేసుకుని నిరాధారమైన వ్యాఖ్యలు చేశారని అసోసియేషన్ ఆరోపించింది. ఏదైనా నిజమైన ఆందోళనలు ఉంటే, వాటిని చట్టబద్ధమైన మార్గాల ద్వారా లేవనెత్తాలి, ప్రజాదూషణ ద్వారా కాదని హితవు చెప్పింది. ఇటువంటి ప్రకటనలు ప్రజలను తప్పుదారి పట్టిస్తాయని, వృత్తిపరమైన, నిష్పాక్షికమైన పోలీసు దళానికి అన్యాయంగా హాని కలిగిస్తాయని అసోసియేషన్ నేతలు హెచ్చరించారు.

## ‘జ్యువెల్స్ ఆఫ్ అసఫ్‌జాహీస్ ది గ్లోరీ ఆఫ్ వరంగల్’ ఆవిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకట రమణ రచించిన ‘జ్యువెల్స్ ఆఫ్ అసఫ్‌జాహీస్ ది గ్లోరీ ఆఫ్ వరంగల్’ కాఫీ టేబుల్ బుక్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక హాజరయ్యారు. వరంగల్ నగరంలో అసఫ్‌జాహీల హయాంలో నిర్మితమైన అద్భుత కట్టడాలు, వరంగల్ కేంద్రంగా పరిపాలించిన సుబేదారుల వివరాలతో పాటు వారి చరిత్రతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్ చరిత్ర పరిశోధకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉపయోగపడుతుందని సిఎస్ అన్నారు. పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వర్తిస్తూనే చారిత్రక అంశాలతో కూడిన ఈ కాఫీ టేబుల్ బుక్‌ను వెలువరించడం అభినందనీయమన్నారు. వరంగల్ అనగానే కాకతీయుల పాలన, వేయ్యి స్థంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయంతో పాటు వరంగల్ నగరంలో అడుగు పెట్టగానే కాజీపేట నుండి మామునూర్ వరకు నిజాం నవాబులు నిర్మించిన అద్భుతమైన భవనాలు, కాజీపేట రైల్వే స్టేషన్, ప్రస్తుత మిషన్ భగీరథ పథకమైన ఇంటింటికి తాగునీరందించే ధర్మసాగర్ ఫిల్టర్ బెడ్ ఇలా ఎన్నో ఉన్నాయని వివరించారు. వీటితోపాటు వరంగల్ కేంద్రంగా వరంగల్ సుబాహ్‌గా అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలోని కొన్నిప్రాంతాలు ఉండేవని, వరంగల్ సుబేదారులుగా ఎవరెవరు ఉన్నారు, వారి ప్రత్యేకతలేమిటి, ఈ విషయమై కొన్ని అరుదైన విశేషాలతో కూడిన సమాచారంతో పాటు నిజాం నిర్మిత హెరిటేజ్ కట్టడాల ఫోటోలతో కలిపి రూపొందించిన జ్యువెల్స్ ఆఫ్ అసఫ్‌జాహీస్ ది గ్లోరీ ఆఫ్ వరంగల్ కాఫీ టేబుల్ బుక్ ఉపయోగపడుతుందని సిఎస్ అన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### రవాణ శాఖలో నిరంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉండేలా కార్యాచరణ : మంత్రి పొన్నం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలతో పాటు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకొనేందుకు రవాణ శాఖలో నిరంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉండే విధంగా కార్యాచరణను రూపొందించినట్టు రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణశాఖ ముఖ్య అధికారులతో మంత్రి పొన్నం బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను కఠినతరం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో 33 బృందాలు, రాష్ట్ర స్థాయిలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రతి రోజు విధిగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, దీనికి సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు ఉదయం ఆరు గంటలకు రవాణ శాఖ ఉన్నతాధికారులు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా ఓవర్ లోడింగ్ లారీలు, బస్సులు, మినరల్ ట్రాన్స్‌పోర్ట్‌లో సాండ్, ఫ్లైయాష్, స్టోన్, బిల్డింగ్ మెటీరియల్స్, వాహనాల ఫిట్‌నేస్, పొల్యూషన్, చలానాలపై ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ప్రత్యేక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు అదనపు పెనాల్టీ తో పాటు వాహనాలు సీజ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో బృందంలో డిటిసి, ఎంవిఐ, ఎఎంవిఐ తదితర సిబ్బంది ఉంటారని మంత్రి వివరించారు. గత నెలలో రద్దు చేసిన చెక్ పోస్ట్‌ల్లో పని చేసిన సిబ్బందిని కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో చేర్చాలని ఆదేశాలను జారీ చేశారు.

### ప్రయాణికులు వెళ్లే వాహనాలను వేధించొద్దు

ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు, వ్యవసాయ సంబంధిత ట్రాక్టర్‌లపై వేధింపులకు గురి చేయవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మార్గదర్శకాల్లో ప్రధానంగా గడువు ముగిసిన వాహనాలు, భారీ వస్తువులను తరలించే వాహనాలు, బస్సులను సీజ్ చేస్తామన్నారు. ముఖ్యంగా సిసి బస్సులు, బహుళ పెండింగ్ చలాన్లు/ విసిఆర్‌లు ఉన్న భారీ వస్తువుల వాహనాలను స్వాధీనం చేసుకుంటారని హెచ్చరించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరిగే వాహనాలు, ముఖ్యంగా భారీ, మధ్య తరహా వస్తువుల వాహనాలు ప్రయాణీకుల వాహనాలతో పాటు విద్యా సంస్థ బస్సులు సీజ్ చేయనున్నాట్టు తెలిపారు.

### ‘ఓవర్ లోడ్ వాహనాల’ పైన ఆరా

గత వారం చేవెళ్ల బస్సు ప్రమాదం అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల పై తీసుకున్న చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీశారు. వారం రోజుల వ్యవధిలో 2576 వాహనాల పై కేసులు నమోదు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 352 లారీలు, 43 బస్సులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి మహిళా ఆటో అనుమతులు ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.
వచ్చే రహదారుల భద్రత మాసంలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఇన్నోవేటివ్ కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. పిల్లల అవగాహణ కోసం ‘అవేర్‌నెస్ పార్క్’ను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసేలా చర్య లు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రవాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణ శాఖ కమిషనర్ ఇలంబర్తి, జెటిసిలు రమేష్, చంద్రశేఖర్, శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 14 నుంచి కార్తిక మహోత్సవాలు




ప్రజాపక్షం / ఖైరతాబాద్ : కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 14 నుంచి 16 వరకు హైదరాబాద్ అమీర్‌పేట ఎంసిహెచ్ మైదానంలో కార్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్టు హైబిజ్ వన్ ఫౌండర్, ఎండి డాక్టర్ జె. సంధ్యారాణి, పాండురంగరావు తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ హైబిజ్ వన్ ఆధ్వర్యంలో జరిగే ఈ మహోత్సవాలలో పూజలు, హోమాలు, వ్రతాలు, పారాయణాలు నిర్వహిస్తామన్నారు. మొదటిరోజు గణపతి హోమంతో కార్యక్రమం ప్రారంభమై, చివరి రోజు రాత్రి కార్తిక పురాణ విశిష్ఠత ప్రవచనంతో మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని వారు కోరారు.

## 21న తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవం



ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవాన్ని, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నవంబర్ 21న ఘనంగా నిర్వహించనున్నట్టు తెలంగాన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాసభ ఉపాధ్యక్షులు వెంకట్ నర్సయ్య, బల్ల సత్తయ్య, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాలు, జిల్లా కేంద్రాల్లో 21న ముదిరాజ్ జెండాలను ఎగురవేసి, ర్యాలీలు నిర్వహించాలని కోరారు. ముదిరాజ్ మహాసభ 11 ఏళ్ల పోరాట ఫలితంగా హైదరాబాద్ కోకాపేటలో ముదిరాజ్ భవనం కోసం 300 ఎకరాల స్థలాన్ని సాధించామని, అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ముదిరాజ్‌లకు విద్యా, ఉద్యోగరంగంలో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్ల నిధులివ్వాలన్నారు., ముదిరాజ్‌లను బిసి ‘డి’ నుంచి బిసి ‘ఎ’లోకి మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహాసభ నేతలు తాటికొండ స్వరూప, గుమ్మల స్వామి, వరుణ్‌రాజు బి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సుధాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు టిఎస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.వి.సుధాకర్ ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా ఎస్‌టియు కార్యాలయంలోని సంఘం భవనంలో జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో ఆయనను అసోసియేట్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన రాజేంద్రనగర్ మండలం మైలార్ దేవ్ పల్లి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సుధాకర్ జిఒల పట్ల స్పష్టమైన అవగాహనతో, రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సర్వీసు అంశాల పట్ల కలిగే సందేహాలను నివృత్తి చేస్తున్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం తనపై ఉంచిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, ఉపాధ్యాయులకు సర్వీసు చేయడానికి మరో రెండేళ్ల పాటు తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సదానందం గౌడ్, జుట్టు గజేందర్‌లకు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుట్టపాక ప్రవీణ్ కుమార్, సత్తు పాండు రంగారెడ్డి లకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## త్వరలో ఇందిరాపార్కు వద్ద ఆప్ ధర్నా

### ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : ‘ఆసరా’ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వయోవృద్ధులు, దివ్యాంగులతో కలిసి త్వరలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా నిర్వహించున్నట్టు ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆప్ రాష్ట్ర నేత బుర్ర రాము గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచి, చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలా జిల్లాల్లో వృద్దులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రభుత్వం బకాయిల్లేకుండా పింఛన్లు అందజేయాలని, లేనిపక్షంలో ఆప్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**నమూనా 10-1**
**బహిరంగ ప్రకటన**

PUB/1425

ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో రైల్వే లైను పనులు పూర్తయినవి. ఈ రైల్వే లైన్లను, రైల్వే ప్రాంగణాలను ఉపయోగించే వినియోగదారులకు తెలియజేసే ప్రకటన ఈ క్రింది విధంగా ఉంది.
సెక్షన్: హైదరాబాద్: అంకై(ఎఎన్‌కె)–ఔరంగాబాద్ (ఎడబ్ల్యుబి) సెక్షన్ మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన 2x25 కెవి కొత్త బ్రాడ్ గేజ్ డబుల్ లైను నిర్మాణం. అంకై(ఎఎన్‌కె)-ఔరంగాబాద్ (ఎడబ్ల్యుబి) మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన 2x25 కెవి డబుల్ లైన్ బ్రాడ్ గేజ్ కొత్త లైను ప్రారంభం. పైన పేర్కొన్న స్టేషన్ల మధ్య ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 16/01 కి.మీ/సిహెచ్:16/000(ఎఎన్‌కె) ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 114/10 కి.మీ/సిహెచ్: 114/489.50 (ఎడబ్ల్యుబి) వరకూ ప్రభుత్వ రవాణా ద్వారా ప్రయాణికులు రాకపోకలు చేయడానికి-రిజిస్టర్డ్

****

**అంకై(ఎఎన్‌కె)–ఔరంగాబాద్ (ఎడబ్ల్యుబి) స్టేషన్ల మధ్య స్టేషన్స్ మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన 2x25 కెవి డబుల్ బ్రాడ్ గేజ్ కొత్త లైను** ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 16/01 కి.మీ/సిహెచ్:16/000(ఎఎన్‌కె) నుంఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 114/10 కి.మీ/సిహెచ్:114/489.50 (ఎడబ్ల్యుబి) దక్షిణ మధ్య రైల్వే స్టేషన్లు వరకూ, 25000 వోల్టులు,50 ఫ్రీక్వెన్సీ యూనిట్లు., ఎసి ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లను **30/11/2025 తేదీ నాటికి లేదా ఆ తర్వాత** సంపూర్ణమైన విద్యుత్ శక్తి సామర్థ్యంతో నింపబడి ఉండును. ఇక అప్పటినుండీ ఈ విద్యుత్ వైర్లు ఎల్లవేళలా సంపూర్ణమైన విద్యుత్ శక్తి సామర్థ్యంతో నిరంతరం రైళ్ళ రాకపోకల అవసరాలనిమిత్తం పనిచేస్తూ ఉండును. అనధికార వ్యక్తులు వీటిని సమీపంలోకి రాకూడదు. లేదా ఈ ఓవర్‌హెడ్‌లైన్స్ సమీపంలో ఎలాంటి పనులు చేయకూడదు.

**నమూనా 10-2**
**(ఎసిటిఎం పేరా 21020, సంపుటి II, ఒకటవ భాగం: దిద్దుబాటు చీటీ నెం.32, తేదీ: 09.10.2020)**
**ఎసి 25 కెవి ట్రాక్షన్ ప్రవేశిక**
**“రహదారి వినియోగదారులకు హెచ్చరిక”**

ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో 25 కెవి ఎసి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ పనిచేయడం ప్రారంభం కానున్నది. దీనికి సంబంధించి ప్రజలకు సమాచారం తెలియజేయడానికి ఈ ప్రకటన జారీ చేయడమైనది.:
సెక్షన్: హైదరాబాద్: అంకై(ఎఎన్‌కె)–ఔరంగాబాద్ (ఎడబ్ల్యుబి) సెక్షన్ మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన 2x25 కెవి కొత్త బ్రాడ్ గేజ్ డబుల్ లైను నిర్మాణం. అంకై(ఎఎన్‌కె)-ఔరంగాబాద్ (ఎడబ్ల్యుబి) స్టేషన్ల మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన 2x25 కెవి డబుల్ లైన్ బ్రాడ్ గేజ్ కొత్త లైను ప్రారంభం. పైన పేర్కొన్న స్టేషన్ల మధ్య ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 16/01 కి.మీ/సిహెచ్:16/000(ఎఎన్‌కె) నుండి ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 114/10 కి.మీ/సిహెచ్:114/489.50 (ఎడబ్ల్యుబి) వరకూ ప్రభుత్వ రవాణా ద్వారా ప్రయాణికులు రాకపోకలు చేయడానికి-రిజిస్టర్డ్

****

**అంకై(ఎఎన్‌కె)-ఔరంగాబాద్ (ఎడబ్ల్యుబి) స్టేషన్ల మధ్య ఎలక్ట్రిఫికేషన్ చేయబడిన 2x25 కెవి కొత్త బ్రాడ్ గేజ్ డబుల్ లైనులో** ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 16/01 కి.మీ/సిహెచ్:16/000(ఎఎన్‌కె) నుండి ఓహెచ్‌ఇ మాస్ట్ లొకేషన్ 114/10 కి.మీ/సిహెచ్:114/489.50 (ఎడబ్ల్యుబి) **దక్షిణ మధ్య రైల్వే స్టేషన్లు వరకూ అన్ని లెవెల్ క్రాసింగ్‌ల వద్దా ఎత్తైన స్తంభాలను నిర్మించడమైనది. ఈ ఎత్తైన స్తంభాలను రోడ్డు మట్టానికి చాలా 4.78 మీటర్ల ఖచ్చితమైన గరిష్ట ఎత్తులో నిర్మించడమైనది.** ఎందుకంటే చాలా ప్రమాదకరమైన, విద్యుత్ ప్రవహించే తీగలు సమీపంలో ఉన్నందువల్ల ఆ గరిష్ట ఎత్తుకంటే ఎక్కువ ఎత్తులో సరుకులను మోసుకొచ్చే వాహనాలను అడ్డుకోవడంకోసం, వాటికి తగలకుండా నివారించడానికి హెచ్చరికగా ఈ ఎత్తైన స్తంభాలు నిర్మించడమైనది. అందువల్ల పైన పేర్కొన్న ఎత్తును పరిశీలించి గుర్తించవలసిందిగా ప్రజలు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఆ రోడ్డులోప్రయాణించే వాహనాలు నిర్దేశించిన ఎత్తుకు మించినస్థాయిలో సరుకు లోడును తీసుకువెళ్ళకూడదు. పైన పేర్కొన్న నిర్దేశిత ఎత్తును ఎట్టి పరిస్థితులలోనూ ఉల్లంఘించరాదు.
దానివల్ల కలిగే ప్రమాదాలు ఈ క్రింది విధంగా ఉండును.
i) ఎత్తైన స్తంభాలకు ప్రమాదం వాటిల్లును మరియు తత్ఫలితంగా రహదారికి దాంతోపాటు రైల్వే లైనుకు కూడా ఆటంకం కలుగును.
ii) వస్తు సామాగ్రికి లేదా ఉపకరణాలకు లేదా సరుకులకు లేదా వాటిన మోసుకువెళ్ళే వాహనానికి ప్రమాదం వాటిల్లును.
iii) ఆ విద్యుత్ వాహకాలకు సమీపంగా రావడంవల్ల లేదా వాటిని తగులుకోవడంవల్ల మంటలు చెలరేగడం మరియు ప్రాణాలకు అపాయం కలగే ప్రమాదం సంభవించును.

**డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరు, (డిప్యూటీ సిఇఇ-II/C/SC)**
A1818 సికింద్రాబాద్


## డిసెంబరు 6న భారీ ఉగ్రదాడికి ఉమర్ ప్లాన్

### బాబ్రీ మసీద్ కూల్చివేతకు ప్రతీకారంగా ప్రణాళిక




న్యూఢిల్లీ : ఢిల్లీ ఎర్ర కోట సమీపంలో పేలుడుపై ముమ్మర దర్యాప్తు చేస్తున్న భద్రతా సంస్థలు.. అనేక కోణాల్లో సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో మరో కీలక విషయం వెల్లడైంది. డిసెంబర్ 6న (బాబ్రీ మసీదు కూల్చివేత రోజు) భారీ పేలుళ్లకు ఉమర్ నబీ ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఫరీదాబాద్ కేంద్రంగా జైషే ఉగ్రవాద కార్యకలాపాలు నడిపిస్తున్నారన్న అనుమానాలతో అరెస్టు చేసిన ఎనిమిది మందిని విచారించడంతో పాటు, వారి కుటుంబీకులు, స్నేహితులు, పొరుగు వారి నుంచి సేకరించిన వివరాలతో ఈ కుట్ర బహిర్గతం అయినట్లు పేర్కొన్నారు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడే ఉమర్.. చదువులో మాత్రం చురుకుగా ఉండేవాడట. ముజమ్మిల్‌తో కలిసి 2021లో తుర్కియేలో పర్యటించాడు. అదే అతడిలో తీవ్ర మార్పు తెచ్చిందని, ఉగ్ర కార్యకలాపాలవైపు మళ్లడానికి దారితీసిందని తెలిసింది. ఆ పర్యటన సమయంలోనే నిషేధిత జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ ప్రతినిధులతో వీరిద్దరు సమావేశమైనట్లు అధికారులు భావిస్తున్నారు. భారత్‌కు వచ్చిన అనంతరం ముజమ్మిల్‌తో కలిసి ఉమర్ పేలుడు పదార్థాలను సేకరించడం మొదలుపెట్టాడు. వాటిని అల్ ఫలాహ్ క్యాంపస్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో నిల్వ చేశాడు. ఈ క్రమంలో డిసెంబర్ పేలుళ్ల ప్రణాళికను మిగతావారితో పంచుకున్న అతడు.. పేలుడు పదార్థాలను ఐ20 కారులోకి తీసుకువచ్చాడు. ఇంటర్నెట్‌లో చూసి వెహికల్ ఆధారిత ఐఇడిని (విబిఐఇడి) రూపొందించేందుకు ప్రయత్నాలు చేశాడు. అయితే, పేలుడు పదార్థం తయారీ పూర్తికాక ముందే అది పేలిపోయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఫరీదాబాద్‌తో సహా పలు ప్రాంతాల్లో 2900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఉగ్రవాద కుట్రను బహిర్గతం చేసినట్లు మీడియాలో చెప్పడాన్ని చూసి ఉమర్ భయపడిపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, అక్టోబర్ 26న కశ్మీర్‌కు వెళ్లిన ఉమర్.. స్నేహితులు, బంధువులతో కొంత సమయం గడిపాడు. ఆ సమయంలో వచ్చే మూడు నెలలపాటు తాను అందుబాటులో ఉండనని వారితో చెప్పినట్లు తెలిసింది. దీన్నిబట్టి చూస్తే వీబీఐఈడీని నిర్దేశిత ప్రదేశంలో పెట్టిన తర్వాత కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్లాలని ఉమర్ ప్రణాళిక వేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## ఢిల్లీ పేలుడు ఘటన ఉగ్రవాదుల చర్యే : కేంద్రం



న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో జరిగిన పేలుడు ఘటనను ఉగ్రవాద ఘటనగా కేంద్రం పేర్కొంది. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా సహించేది లేదని పునరుద్ఘాటించింది. పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలియజేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన 7 లోక్‌కల్యాణ్ మార్గ్‌లో బుధవారం సాయంత్రం 7 గంటలకు కేంద్ర కేబినెట్ ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సుమారు రెండు గంటల సేపు ఈ సమావేశం జరిగింది. అనంతరం సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఢిల్లీ పేలుడు ఘటన అత్యంత కిరాతక ఉగ్రవాద చర్యగా క్యాబినెట్ పేర్కొందని, ఉగ్రవాదంపై పోరు కొనసాగించాలని నిర్ణయించిందని ఆయన చెప్పారు. ఘటనపై శీఘ్రగతిన, పూర్తి వృత్తినిబద్ధతతో విచారణకు కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. తద్వారా దాడికి పాల్పడిన వారిని, వారికి సహకరించిన వారిని, స్పాన్సరర్లను గుర్తించి వారిని చట్టం ముందుకు తీసుకురావచ్చని సమావేశం అభిప్రాయపడిందన్నారు. ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని కేంద్ర క్యాబినెట్ ఆమోదించినట్టు వెల్లడించారు. కాగా, ఈ సమావేశానికి ముందు ప్రధాని నివాసంలో భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) సమావేశమైంది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా సిసిఎస్ సభ్యులు పాల్గొన్నారు. ఢిల్లీ పేలుళ్ల మృతులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యం: కడియం కావ్య

ప్రజాపక్షం/భూపాలపల్లి: పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డా కడియం కావ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రం లోని వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ, తాను కూడా వైద్య విద్యనభ్యసించి 8 సంవత్సరాలు పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ వైద్య సేవలకు మీ దగ్గరకు వచ్చే ప్రజలకు ప్రేమతో వైద్య సేవలు అందించాలని తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా నిలబడాలంటే ఎన్నో ఆటుపోట్లను, సవాళ్ళను ఎదుర్కొవాల్సి వస్తుందని ధైర్యంగా ఎదుర్కొని మంచి వైద్యులుగా స్థిర పడాలని సూచించారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ వైద్య వృత్తిలో మంచి అనుభవాన్ని పొంది ప్రత్యేక వైద్యులుగా నిలవాలని తెలిపారు. సింగరేణి, కెటిపిపి సిఎస్ఆర్ నిధులు ఈ ప్రాంత విద్య, వైద్య రంగాలకు కేటాయించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థికి వైట్ కోర్టు రావడం అనేది ఒక మధురమైన అనుభూతి అన్నారు. బాగా చదివి మంచి వైద్యులుగా తయారై పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వరావు, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి, కెటిపిపిసిఇశ్రీ ప్రకాష్, వైద్య కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# 27 మండలాలు... 12 మంది సర్వేయర్లు

### 2,258 దరఖాస్తులు పెండింగ్.. సర్వే కోసం తప్పని నిరీక్ష




ప్రజాపక్షం/రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లాలో సర్వేయర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది.ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న 215 మంది లైసెన్డ్ సర్వేయర్ల విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించక పోవడంతో పెండింగ్ దరఖాస్తుల సంఖ్య మరింత పేరుక పోతోంది.దీని ఫలితంగా ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2,258 దరఖాస్తులు పెండింగ్ వున్నాయి. దీంతో సరిహద్దు వివాదాలు తేలక పోవడంతో బాధితులు తరచూ ఘర్షణలకు దిగుతున్నారు. అప్పటివరకు ఉన్న సివిల్ కేసులు కాస్తా..ఆ తర్వాత క్రిమినల్ కేసులుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### ఒక్కో సర్వేయర్‌కు రెండు మూడు మండలాలు

జిల్లాలో 27 మండలాలు.. 558 గ్రామ పంచాయతీలు, 12 లక్షల ఎకరాలకుపైగా భూములు వున్నాయి. ప్రభుత్వ భూముల పక్కనే \ప్రైవేటు భూములు ఉండటం, ఆక్రమణలకు గురి కావడం,సర్వే నంబర్లకు భిన్నంగా పొజిషన్లు ఉండటం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సరిహద్దు సమస్యలు ఉండటంతో బాధితులు ఎడి సర్వే కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా 2016 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 77,940 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 17532 దరఖాస్తులను ఆమోదించి, ఆయా వివాదాస్పద భూములకు హద్దులు నిర్ధారించారు. వివిధ కారణాలతో మరో 58,155 దరఖాస్తులను తిరస్కరించారు.ప్రస్తుతం పోర్టల్‌లో 2,253 దరఖాస్తులు పెండింగ్‌లో వున్నాయి. జిల్లాలో 14 మంది సర్వేయర్లు ఉండగా, గండిపేట సర్వేయర్ ఎసిబి కేసులో అరెస్ట్ అయి సస్పెండ్‌కు గురైనారు.అదే విధంగా ఆమనగల్ సర్వేయర్ సైతం ఇదే కేసులో సస్పెండ్ అయ్యారు.కాగా ప్రస్తుతం 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.ఒక్కో సర్వేయర్‌కు రెండు నుంచి మూడు మండలాలు చూడాల్సి వస్తుండటం తోపాటు వివిధ ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణ పనులు సైతం వీరికి భారంగా మారుతున్నాయి.

### 12 మంది సర్వేయర్లు.. అనేక ప్రభుత్వ ప్రాజెక్టులు

మూసీ ఆక్రమణల తొలగింపులో భాగంగా గండిపేట నుంచి అత్తాపూర్ వరకు ఎ డి సర్వేనే కీలకంగా మారింది. నదికి రెండు వైపులా హద్దులు నిర్ధారణ. అదే విధంగా మరో మూడు నియోజకవర్గాలు,ఏడు మండలాలు, 56 గ్రామ పంచాయతీలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 30 వేల ఎకరాల్లో నిర్మించతలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ భూ సేకరణ పనులు.వీటికి తోడు యాచారం,మహేశ్వరం, కందుకూరు మండలాలలో వివిధ ఇండస్ట్రియల్,ఐటీ పార్కుల కోసం భూ సేకరణ ప్రక్రియ.. కొనసాగుతుండగా శంకర్ పల్లి మండల పరిధిలోని మోకిలలో హెచ్‌ఎండిఏ చేపట్టిన ల్యాండ్ పూలింగ్ పనులు,రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి ఆమనగల్ వరకు 41 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూ సేకరణ పనులు., మంచాల నుంచి మాడ్గుల, ఆమనగల్, తలకొండపల్లి, కేశంపేట్,షాద్‌నగర్,కొందుర్గ్ మండలాల మీదుగా వెళ్లే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ ఆర్ ఆర్ )పనులకు భూ సేకరణకు సర్వే.వీటికి అధనంగా \ప్రైవేటు వ్యక్తుల మధ్య నెలకొన్న సరిహద్దు వివాదాలను తేల్చాల్సిన బాధ్యతను కూడా ఎడి సర్వేకు భారంగా తయారైంది.ఇప్పటికైనా ఇప్పటికైనా జిల్లాకు సరిపడా సర్వేయర్లను కేటాయించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీ పేలుడు అంశంపై చర్చకు పార్లమెంటరీ ప్యానల్ నో

**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో పేలుడు అంశం బుధవారం నాడిక్కడ జరిగిన హోం వ్యవహారాలపై పార్లమెంటరీ స్థాయీ కమిటీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే దీనిపై చర్చించేందుకు చైర్‌పర్సన్ నిరాకరించారు. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, ఢిల్లీ పేలుడు ఘటనలో 12 మంది మృతి చెందిన అంశాన్ని లేవనెత్తేందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపి ఒకరు ప్రయత్నించారు. ఇంటెలిజెన్స్ వైఫల్యంపై ఆందోళన వ్యక్తం చేసారు. అయితే అంశంపై చర్చ చేపట్టేందుకు కమిటీ చైర్‌పర్సన్ రాధా మోహన్ దాస్ నిరాకరించారు. దీనిపై సుమోటో ప్రకటన చేసేందుకు కూడా నిరాకరించారు. విపత్తు నిర్వహణ ఎజెండాపై పార్లమెంటరీ కమిటీ బుధవారం నాడు సమావేశమైంది. దీనిపై తమ అభిప్రాయాలు చెప్పేందుకు హోం మంత్రిత్వ శాఖ, నేషనల్ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజిమెంట్ (ఎన్‌ఐడిఎం), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్) ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ క్యాంప్, హోం గార్డ్స్ డిజిలు హాజరయ్యారు.

## ఢిల్లీ పేలుళ్ల మృతులకు.. ఐక్యరాజ్యసమితి అధిపతి గుటెర్రెస్ సంతాపం



**న్యూయార్క్:** ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు విస్ఫోటనంలో మృతులకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ తీవ్ర సంతాపం తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడివారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఆయన కోరారు. "ఎర్రకోటవద్ద జరిగిన తీవ్రమైన ఘటనపై మేం కూడా సంతాపాలు భారత ప్రభుత్వానికి, ప్రజలకు తెలియజేస్తాం, కానీ ఈ కేసులో పూర్తి విచారణ జరపాలి" గుటెర్రెస్ తరపున ఆయన అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ పేర్కొన్నారు. న్యూయార్క్‌లో ఆయన మీడియాతో మాట్లాడినప్పుడు పాత్రికేయులు పాకిస్థాన్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడి గురించి కూడా ప్రశ్నించారు. "నన్ను ఏం చెప్పమంటారు? ఆత్మాహుతి దాడి వార్త విన్న తర్వాత ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఇప్పటికే చాలా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు, వారి కుటుంబ సభ్యులకు, గాయపడిన వారికి కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు" అంటూ సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. "ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి చాలా కఠినమైన పదజాలంతో ఈ బాంబుదాడులను తీవ్రంగా ఖండించారు, ఉగ్రవాదులు, వారికి దన్నుగా ఉన్నవారిని జవాబుదారీ చేయాలి, ఈ కేసులలో పూర్తి దర్యాప్తు జరపాలి" అని చెప్పారు.

## ఉగ్రదాడికి కారణం చెప్పాలి



కేంద్రాన్ని డిమాండ్ చేసిన కర్నాటక సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు :** దేశంలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఉగ్రదాడులు జరగడంపై కారణాలు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కర్నాటక సిఎం సిద్ధ రామయ్య డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలపై ప్రతిపక్ష బిజెపి నుంచి విమర్శలు రావడంతో సిద్ధరామయ్య స్పందించారు. ఉగ్రదాడులకు కారణాలు ఏమిటో చెప్పాల్సిందేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఢిల్లీ పేలుడు ఘటనపై మీడియాలో వచ్చిన తన వ్యాఖ్యలను కూడా ఆయన పోస్టు చేశారు. మంగళవారం బిహార్‌లో రెండవ, చివరి దశ పోలింగ్ పూర్తయిన తర్వాత ఓటింగ్‌కు ముందు రోజు ఢిల్లీలో జరిగిన పేలుడుపై సిద్ధరామయ్య వ్యాఖ్య చేశారు. బిజెపి కర్ణాటక విభాగం అధ్యక్షుడు బి వై విజయేంద్ర సిఎం సిద్ధరామయ్య, ఇతర కాంగ్రెస్ నాయకుల ప్రకటనలను బాధ్యతా రహితమైనవి, అసహనకరమైనవి, దిగజారుడు రాజకీయాలని అభివర్ణించారు. మంగళవారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దేశంలో పేలుళ్ల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, దేశంలో బాంబు పేలుళ్లు జరగకుండా చూడాలని, పేలుడులో అమాయకులు చనిపోయారని అన్నారు. ఎన్నికల సమయంలో దాడి జరిగిదని, దీనిని పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పేలుడు బిహార్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని సిద్ధరామయ్య అన్నారు. కాగా, మంత్రి ప్రియాంక్ ఖర్గే స్వతంత్ర భారతదేశంలో అత్యంత అసమర్థ హోంమంత్రి అమిత్ షా అని, ఆయన రాజీనామా తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. పేలుడుకు నిఘా వైఫల్యమే అని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి వెంటనే తన ప్రకటనను ఉపసంహరించుకోవాలని బిజెపినేత డిమాండ్ చేశారు.

## కశ్మీర్‌లో ఉగ్ర వ్యవస్థ అణచివేత చర్యలు ముమ్మరం

జెఇఐ అనుబంధ వ్యక్తులకు సంబంధించి 300కిపైగా ప్రదేశాలలో దాడులు



**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యవస్థ అణిచివేతపై చర్యలను పోలీసులు ముమ్మరం చేశారు. నిషేధిత జమాతే–ఇ–ఇస్లామి (జెఇఐ)తో అనుబంధంగా ఉన్న వ్యక్తులతో సంబంధం ఉన్న 300కి పైగా ప్రదేశాలపై దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జెఇఐతో సంబంధాలు కలిగి వివిధ రంగాలలో తమ కార్యకలాపాలను పునరుద్ధరించడానికి ప్రయత్నించాయని సూచించే విశ్వసనీయ నిఘా సమాచారం ఆధారంగా ఈ దాడులు నిర్వహించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కుల్గాం, పుల్వామా, షోపియన్, బారాముల్లా, గండేర్బల్ జిల్లాల అంతటా అనేక ప్రదేశాలలో దాడులు నిర్వహించినట్లు వారు తెలిపారు. జెఇఐ సభ్యులు, వారి సహచరుల నివాసాలు, ప్రాంగణాలలో సోదాలు జరిగాయి. ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను, దాని మద్దతుగల వ్యవస్థలను అట్టడుగు స్థాయిలో కూల్చివేసే నిరంతర ప్రయత్నాలలో భాగంగా ఈ అణిచివేత జరిగిందని వారు తెలిపారు. భారీ ఆపరేషన్‌కు సంబంధించిన వివారాలను అధికారులు వెల్లడించారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా అంతటా 200కి పైగా ప్రదేశాలలో దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. గత నాలుగు రోజుల్లో, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఒజిడబ్ల్యుల ప్రాంగణంలో జమ్ముకశ్మీర్‌కు చెందిన జమ్ముకశ్మీర్ నేషనల్స్ ఆపరేటింగ్ ఫ్రమ్ పాకిస్తాన్ (జెకెఎన్‌ఒపి) ప్రాంగణంలో 400కి పైగా కార్డన్, సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు వారు తెలిపారు. గతంలో ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రదేశాలు, ఉగ్రవాదుల దాక్కున్న ప్రదేశాలు ఈ ఆపరేషన్లలో ఉన్నాయి. ఈ ఆపరేషన్లలో జెకెఎన్ ఒపిలు, ఇతర నిషేధిత సంస్థలతో అనుబంధంగా ఉన్న సుమారు 500 మంది వ్యక్తులను విచారించారు. వీరిలో చాలా మందిని అదుపులోకి తీసుకుని అనంతనాగ్‌లోని జిల్లా జైలు మట్టన్‌కు తరలించారు. దాడుల సమయంలో నేరారోపణ చేసే పదార్థాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అనేక మంది జెఇఐ సభ్యులను విచారించి, ఉగ్రవాదానికి సహాయపడే నెట్‌వర్క్‌లను మరింతగా గుర్తించారు. ఉత్తరకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో, సోపోర్‌లోని పోలీసులు ఒక ప్రధాన సమన్వయ ఆపరేషన్‌ను ప్రారంభించి, ఇతర భద్రతా దళాల సహాయంతో సోపోర్, జైంగిర్, రఫియాబాద్ ప్రాంతాలలో 30కి పైగా ప్రదేశాలలో ఏకకాలంలో దాడులు నిర్వహించడం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉగ్రవాద నిరోధక, వేర్పాటువాద పర్యావరణ వ్యవస్థ చర్యను చేపట్టారని వారు తెలిపారు. ఈ ఆపరేషన్ల సమయంలో పత్రాలు, డిజిటల్ గాడ్జెట్లు, నిషేధిత సంస్థతో సంబంధాలున్న ముద్రిత కంటెంట్‌తో సహా గణనీయమైన మొత్తంలో నేరారోపణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో వారి ప్రమేయాన్ని నిర్ధారించడానికి అనేక మంది వ్యక్తులను ప్రశ్నిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. నిషేధిత సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తులు, ప్రాంగణాలను లక్ష్యంగా చేసుకుని, మధ్య కశ్మీర్‌లోని గందర్‌బాల్ అంతటా అనేక ప్రదేశాలలో విస్తృతమైన సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

## ఢిల్లీ పేలుడు నిందితులతో మాకు సంబంధం లేదు




అల్ ఫలాహ యూనివర్సిటీ

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన పేలుడుకు సంబంధించిన కేసులో అరెస్టయిన నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ యూనివర్సిటీ స్పష్టంచేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పేలుడు ఘటన తమను కలిచివేసిందని, ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేరిట ప్రకటన విడుదల చేశారు. తాము 1997 నుంచి వివిధ విద్యాసంస్థలు నడుపుతున్నామని, హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు పొందామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 నుంచి తాము ఎంబిబిఎస్ కోర్సులు నిర్వహిస్తున్నామని, తమ దగ్గర వైద్య పట్టా అందుకున్న చాలామంది ప్రస్తుతం ప్రముఖ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారని తెలిపారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి కలుగాలని తాము కోరుకుంటున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పేలుడు కేసులో మా యూనివర్సిటీలో పనిచేసే ఇద్దరు డాక్టర్లను దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసిందని, వాళ్లు తమవద్ద కేవలం అధ్యాపకులుగా పనిచేస్తున్నారని, అంతకుమించి వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## ముందస్తు బెయిల్‌పై విచారణ త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ

దరఖాస్తులను కేరళ హైకోర్టు నేరుగా స్వీకరించడంపై 'బెంచ్' అసహనం



**న్యూఢిల్లీ :** ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించడం 'పార్టీ ఎంపికనా'? లేదా, సెషన్స్ కోర్టును ఆశ్రయించడం తప్పనిసరినా? అనే అంశాన్ని అత్యున్నత న్యాయస్థానం బుధవారం ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి బదిలీ చేసింది. ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పడే వరకూ విచారణను వాయిదా వేయనున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. 'ఈ అంశాన్ని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారించాల్సిన అవసరం ఉన్నది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.ఇంతకుముందు ఈ అంశంలో సహాయం చేసేందుకు సుప్రీం కోర్టు ఇంతకుముందు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను నియమించింది. సెప్టెంబరు 8న సుప్రీంకోర్టు కేరళ కోర్టు ముందస్తు బెయిల్ దరఖాస్తులను నేరుగా సెషన్స్ కోరుకు తరలించకుండానే స్వీకరించే 'సాధారణ పద్ధతి'ని గమనించింది. కేరళ హైకోర్టులో ఒక అంశం మమ్మల్ని ఇబ్బంది పెట్టేదిగా కనిపిస్తోంది. 'న్యాయవాది సెషన్స్ కోర్టును ఆశ్రయించకుండానే ముందస్తు బెయిల్ దరఖాస్తులను నేరుగా హైకోర్టు స్వీకరించే అలవాటు ఉంది. అది అలా ఎందుకు జరుగుతోంది' అని ధర్మాసనం అడిగింది. మునుపటి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, భారత్ నాగరిక్ సురక్ష్ సంహిత2023లో ఒక సోపాన క్రమం అందించబడిందని అది తెలిపింది. బిఎన్‌ఎస్ఎస్ లోని సెక్షన్ 482 అరెస్ట్ చేయబడిన ఒక వ్యక్తికి బెయిల్ మంజూరు చేయడానికి మార్గనిర్దేశం చేస్తుంది. ఇది మరే ఇతర రాష్ట్రంలోనూ జరగడంలేదు. కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే జరుగుతోంది. రెగ్యులర్ దరఖాస్తులను (ముందస్తు బెయిల్ కోసం) స్వీకరించడం మేం గమనించాం అని ధర్మాసం వ్యాఖ్యానించింది. ముందస్తు బెయిల్ కోసం తమ అభ్యర్థనను తిరస్కరిస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్లు ముందస్తు బెయిల్ కోసం మొదట సెషన్స్ కోర్టుకు వెళ్లకుండా హైకోర్టుకు నేరుగా వెళ్లడాన్ని ధర్మాసనం పేర్కొంది. దరఖాస్తుదారుడు సెషన్స్ కోర్టును సంప్రదించకుండానే హైకోర్టు అటువంటి దరఖాస్తులను నేరుగా స్వీకరించిందని గమనించబడింది. దీనిఫలితంగా సెషన్స్ కోర్టు ముందుకు వచ్చే తగిన వాస్తవాలు సరైన రికార్డులో ఉంచబడకపోవచ్చు. 'ఈ అంశాన్ని పరిగణనలోనికి తీసుకుని హైకోర్టును ఆశ్రయించే ఎంపిక పార్టీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందా లేదా నిందితుడు ముందుగా సెషన్స్‌కోర్టును ఆశ్రయించడం తప్పనిసరి కాదా? అనే అంశాన్ని నిర్ణయించడానికి మేం మొగ్గు చూపుతున్నాం' అని ద్విసభ్య ధర్మాసనం జోడించింది. ఈ అంశంపై కేరళ హైకోర్టుకు దాని రిజిస్ట్రార్ జనరల్ ద్వారా నోటీస్ జారీ చేసింది.

## మోదీ డిగ్రీపై అప్పీళ్ల దాఖలులో ఆలస్యం 3 వారాల్లో అభ్యంతరాలు తెలపండి

ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని కోరిన ఢిల్లీ హైకోర్టు

ఈ అంశంపై విచారణ జనవరి 16కు వాయిదా




**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్యాచిలర్ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీళ్లు దాఖలు చేయడంలో జాప్యాన్ని క్షమించాలని దాఖలు చేసిన పిటిషన్లపై అభ్యంతరాలు దాఖలు చేయాలని ఢిల్లీ హైకోర్టు బుధవారం ఢిల్లీ విశ్వవిద్యాలయాన్ని (డియు) కోరింది. అప్పీల్ దాఖలు చేయడంలో జాప్యాన్ని క్షమించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తులపై సమాధానం దాఖలు చేయడానికి ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గెదెలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీ విశ్వవిద్యాలయానికి మూడు వారాల గడువు ఇచ్చింది. సింగిల్ జడ్జి ఆగస్టునెలలో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీళ్ళు దాఖలు చేయడంలో జాప్యం జరుగుతోందని ధర్మాసనానికి తెలియజేసింది. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఐ) తుషార్ మెహ్‌తా ఆలస్యాన్ని క్షమించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తులపై అభ్యంతరాలను మూడు వారాలలో దాఖలు చేయవచ్చు. అభ్యంతరాలకు సంబంధించినవి ఏవైనా ఉంటే అప్పీల్ దారులు ఆ తర్వాత రెండు వారాలలోగా ప్రతిస్పందనలను తెలియజేయాలి' అని ధర్మాసనం పేర్కొంది. కాగా అత్యున్నత న్యాయస్థానం ఈ అంశంపై విచారణను 2026 జనవరి 16కు వాయిదా వేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ డిగ్రీని బహిర్గతం చేయాలని ఆదేశిస్తూ కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) తీసుకున్న నిర్ణయాన్ని ఏకసభ్య ధర్మాసనం పక్కకు పెట్టడాన్ని సవాల్ చేస్తూ నాలుగు అప్పీళ్లు దాఖలు చేయబడ్డాయి. సమాచార హక్కు కార్యకర్త నీరజ్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సంజయ్‌సింగ్, న్యాయవాది మోహమ్మద్ ఇర్షాద్ దాఖలు చేసిన అప్పీళ్లను ద్విసభ్య ధర్మాసనం విచారించింది. విచారణ సమయంలో పిటిషనర్ల తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులలో ప్రాథమిక లోపాలు ఉన్నాయని ధర్మాసనానికి విన్నవించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం తరపున హాజరవుతున్న సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా మాట్లాడుతూ ఈ దశలో అప్పీళ్లలో నోటీసులు జారీచేయవద్దని కోర్టును అభ్యర్థించారు. ఎందుకంటే తాను దానికి తగిన సమాధానం కూడా దాఖలు చేయబోతున్నానని మెహ్‌తా కోర్టుకు వివరించారు. అప్పీళ్లు దాఖలు చేయడంలో జాప్యం జరిగిందని గమనించిన కోర్టు క్షమాపణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తుపై అభ్యంతరాలు దాఖలు చేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తాను కోరింది. దీనిపై న్యాయ అధికారి తుషార్ మెహ్‌తా మాట్లాడుతూ 'ఈ విషయంలో ఆలస్యం జరిగిందని నాకు తెలియదు. ఈ విషయాన్ని నేను పరిశీలిస్తాను. ఈ ప్రధాన అంశంపై వాదించేందుకు నాకు ఎలాంటి సంకోచం లేదు' అని అన్నారు. ఆగస్టు 25న కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాన్ని సింగిల్ జడ్జి పక్కన పెట్టారు. ప్రధానమంత్రి మోదీ ఒక ప్రభుత్వ పదవిలో ఉన్నందున ఆయన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగంగా బహిర్గతం చేయడానికి పరిమితం చేయలేదని చెప్పారు. కోరిన సమాచారంలో ప్రజా ప్రయోజనానికి ఎటువంటి సంబంధం లేదని సింగిల్ జడ్జి ధర్మాసనం తోసిపుచ్చింది. సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను ప్రోత్సహించడానికి రూపొందించబడిందని, సంచలనాత్మకతకు మేతగా ఉండటానికి కాదు అని సింగిల్ జడ్జి అన్నారు. ఏదైనా ప్రజాప్రతినిధిఅధికారిక బాధ్యతలను నిర్వర్తించడానికి విద్యార్హత ఎటువంటి చట్టబద్ధమైన అవసరం యొక్క సమాచారంలో లేదని సింగిల్ జడ్జి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ 10 మరియు 12 తరగతుల రికార్డు ల కాపీలను అందించాలని సిబిఎస్‌ఇని ఆదేశించిన కేంద్ర సమాచార కమిషన్ ఉత్తర్వును కూడా హైకోర్టు పక్కన పెట్టింది.

## 'కవచ్'తో రైలు ప్రమాదాలకు చెక్



అనుభవ సంస్థలతో రైల్వే శాఖ ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు ప్రమాదాల నివారణ కోసం కవచ్ వ్యవస్థ నిర్మాణాన్ని సమర్థవంతంగా అమలు పరిచేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు అనుభవం కలిగిన సంస్థలతో బుధవారం ఒప్పందం చేసుకున్నాయి. ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే కవచ్ వ్యవస్థను అమలు పరచ్చడంలో నోడెల్ ఎజెన్సీగా నిలిచింది. 1600 కిమీ రైల్వే లైన్లు ఇప్పటికే కవచ్ వ్యవస్థ కిందకు వచ్చాయి. కవచ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు దక్షిణ మధ్య రైల్వే, ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ యొక్క సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ మధ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంపై దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ పి.వి మురళీ కృష్ణ, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్ మూర్తి సమక్షంలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సిగ్నల్, టెలికాం ఇంజనీర్ తేజ్ ప్రకాష్ అగర్వాల్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సిగ్నల్ డెవలప్‌మెంట్) విజయ్ సెర్వాల్, ఐఐటి హైదరాబాద్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి. నరహరి శాస్త్రి సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం యొక్క ప్రాథమిక లక్ష్యం భారతీయ రైల్వేల స్వదేశీ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఎటిపి) వ్యవస్థ అయిన కవచ్ వ్యవస్థ కోసం మాడ్యులర్ హార్డ్‌వేర్ స్థాయిలో ఇంటర్‌ఆపరేబిలిటీని అభివృద్ధి చేయడం. ఈ చొరవ హార్డ్‌వేర్ ఇంటర్‌ఫేస్‌లను ప్రామాణీకరించడం మరియు ఇన్‌పుట్ అవుట్‌పుట్ మాడ్యూల్స్, ఆర్. ఎఫ్. మాడ్యూల్స్, కమ్యూనికేషన్ ఇంటర్‌ఫేస్‌లు, ప్రాసెసింగ్ యూనిట్‌లతో సహా కవాచ్ వ్యవస్థ యొక్క వివిధ ఫంక్షనల్ మాడ్యూళ్ల మధ్య ప్లగ్ అండ్ ప్లే అనుకూలతను ప్రారంభించడం లక్ష్యంగా పెట్టుకుంది అసలు పరికరాల తయారీదారు (ఒఇఎం)తో సంబంధం లేకుండా ఈ సాంకేతిక పురోగతి కవాచ్ పర్యావరణ వ్యవస్థలో నిర్వహణ, అప్‌గ్రేడబిలిటీ మరియు బహుళవిక్రేతల వశ్యతను గణనీయంగా పెంచుతుంది, భారతీయ రైల్వే నెట్‌వర్క్ అంతటా స్కేలబుల్ మరియు సమర్థవంతమైన అమలుకు మార్గం సుగమం చేస్తుంది. ఈ ఒప్పందం కింద, ఐఐటి హైదరాబాద్ ప్రామాణిక కవచ్ సిస్టమ్ ఆర్కిటెక్చర్ యొక్క పూర్తి కార్యాచరణ, పరస్పర చర్యను ప్రదర్శించే ఒక నమూనాను అభివృద్ధి చేస్తుంది.



గౌహతిలోని మాలిగావ్‌లో ఈ నెల 3నుంచి 11 వరకు జరిగిన 48వ మహిళా ఆల్ ఇండియా ఇంటర్ రైల్వే ఛాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే మహిళల బాస్కెట్ జట్టు ఛాంపియన్‌షిప్ కొట్టిన సందర్భంగా క్రీడాకారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అభినందించారు.

## విమానాలకు బాంబు బెదిరింపులు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా కొన్ని ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బుధవారం గురుగ్రామ్‌లోని ఇండిగో ప్రధాన కార్యాలయానికి గుర్తుతెలియని వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిల్స్ పంపించారు. అందులో ఢిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం నుంచి నడుస్తున్న పలు ఇండిగో విమానా ల్లో బాంబులు అమర్చినట్లు పేర్కొన్నారు. దీనితో అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఆయా విమానాశ్రయాల అధికారులను అలర్ట్ చేశారు. మొదట కోల్‌కతా నుంచి ముంబయికి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరింపులు వచ్చాయి. దీంతో అందులోని 186 మంది ప్రయాణికులను కిందకు దించేసి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాదు ఢిల్లీ, తిరువనంతపురం విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. బాంబు స్క్వాడ్ బృందాలతో ఇండిగో విమానాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. దేశరాజధాని ఢిల్లీలో పేలుడు సంభవించడంతో ఢిల్లీ విమానాశ్రయంలో భారీ భద్రతను ఏర్పా టు చేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. బెదిరింపు మెయిళ్లు పంపిన దుండగులను గుర్తించడానికి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

**హైదరాబాద్ విమానాశ్రయానికి కూడా..**

దేశంలో ఢిల్లీ, ముంబయి సహా ఐదు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు వచ్చాయని ఇండిగో బుధవారం తెలిపింది. ఢిల్లీ, ముంబయి సహా హైదరాబాద్, చెన్నై, తిరువనంతపురం అనే ఐదు విమానాశ్రయాలపై 24 గంటల్లోగా దాడి చేస్తామని ఇండిగో ఎయిర్‌లైన్‌కు సందేశం వచ్చినట్లు పేర్కొంది.

## రష్యాతో యుద్ధానికి సిద్ధపడుతున్న యూరప్!



**బెల్‌గ్రేడ్:** యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యాతో యుద్ధానికి సిద్ధమవుతున్నాయని సెర్బియా దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్ అన్నారు. "వాస్తవాలను విశ్లేషించినప్పుడు యూరప్–రష్యా మధ్య యుద్ధం మరింత స్పష్టంగా కనిపిస్తోందని నేను నిర్ధారణకు వచ్చాను, ఇది ఏమీ తోచక కాలక్షేపం కోసం చేసే వ్యాఖ్యలు కాదు, అందరూ దీనికి సిద్ధం అవుతున్నారు" అని పింక్ టీవీ ప్రసారం చేసిన ఒక కార్యక్రమంలో ఆయన చెప్పారు. రాబోయే మూడు నుండి నాలుగు సంవత్సరాల కాలం లో రష్యాతో యుద్ధానికి సిద్ధంగా ఉండాలని ఫ్రెంచ్ సాయుధ దళాల చీఫ్ జనరల్ స్టాఫ్ ఫాబియన్ మాండన్ చేసిన వ్యాఖ్యలపై ఉసిక్ పైవిధంగా స్పందించారు. అటు పాశ్చాత్యదేశాలు, ఇటు రష్యా అనుసరిస్తున్న పరస్పర విరుద్ధమైన విధానాలమధ్య ఎటూకాకుండా బండరాయిలా నిలబడి ఉన్న సెర్బియా ఆత్మరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.దేశ రక్షణకోసం తమ సాయుధ బలగాలను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇటీవలికాలంలో రష్యా పై యూరోపియన్ యూనియన్ ఆంక్షల తీవ్రవతను మరింతగా పెంచడంతోపాటు రష్యా చమురు దిగుమతుల రద్దుకు రెండేళ్ళకాలాన్ని గడువుగా నిర్దేశించుకోవడం, యూరోపియన్ యూనియన్ సైన్యాన్ని బలోపే తం చేసుకోవడానికి నిధులు తమ తమ జిడిపిల ద్వారా కష్టంగానైనాసరే కేటాయించాలనే అలవికాని లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, ఉక్రేన్‌పై దాడుల సందర్భంగా ఇటీవల కొన్ని యూరప్ దేశాలు తమ సరిహద్దులను రష్యా విమానాలు, డ్రోన్లు ఉల్లంఘించాయన్న ఆరోపణలు, ట్రంప్ మధ్యవర్తిత్వ వైఫల్యం వంటి అనేక పరిణామాల నేపథ్యంలో సెర్బియా అధ్యక్షుడు పైవిధంగా స్వీయ విశ్లేషణ చేశారు.

## చిలీలో తుది ఘట్టానికి ఎన్నికల ప్రచారం

**శాంటియాగో:** కమ్యూనిస్టు కూటమి అధికారంలో ఉన్న చిలీలో దేశాధ్యక్ష పదవికి అభ్యర్థుల మధ్య హోరాహోరీగా ప్రచార పోరాటం కొనసాగుతోంది. నవంబరు 16వ తేదీన దేశంలో ఎన్నికలు జరుగుతాయి. దేశాధ్యక్షుణ్ణి ఎన్నుకోవడంతోపాటు ప్రజలు 155 మంది సభ్యులున్న ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌ను కూడా ఎన్నుకుంటారు. అధికారం సంపాదించాలంటే ఏ పార్టీ లేదా కూటమి అయినా 78 సీట్లు గెలుచుకోవాలి. అదేవిధంగా 50 మంది సభ్యులుండే సెనేట్‌లో 43 మందిని ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ఈ సెనేట్ సభ్యులు ఎనిమిది సంవత్సరాలు అధికారంలో ఉంటారు. ఐతే ప్రతి నాలుగు సంవత్సరాలకూ ఒకసారి సెనేట్ ఎన్నికలు జరుగుతాయి. ఈ విధంగా సగం మంది సెనేట్ సభ్యులను కూడా ఈ విడత ఎన్నికల్లో ప్రజలు ఎన్నుకుంటారు. ప్రస్తుతం ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో, రీజినల్ గవర్నర్స్‌లో, రీజినల్ కౌన్సిలర్స్‌లో, మేయర్లలో కమ్యూనిస్టులదే ఆధిపత్యం ఉంది. ప్రస్తుతం కమ్యూనిస్టు కూటమి తరపున మహిళా నాయకురాలు జెన్నెట్ అలెజాండ్రా జారా రోమన్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ప్రస్తుతం గాబ్రియేల్ బోరిక్ అధ్యక్షుడుగా ఉన్నారు. గతంలో కమ్యూనిస్టుల చేతిలో పరాజయం పాలైన రిపబ్లికన్ పార్టీకి చెందిన జోస్ ఆంటోనియో కాస్ట్ ఈసారి కూడా మళ్ళీ అధ్యక్ష పదవికి పోటీలో ఉన్నారు. ఆయన ఇప్పుడు చాలా గట్టి పోటీ ఇస్తున్నారు. దేశానికి కఠినమైన, అణచివేతకు గురిచేసే నాయకుడు కావాలని ఆయన ఎన్నికల ప్రచారంలో వాదిస్తున్నారు. మరోవైపు నేషనల్ రెన్యూవల్ (ఆర్ఎన్)పార్టీకి చెందిన నాయకురాలు ఎవెలిన్ రోజ్ మాథీ ఫోర్నెట్ కూడా భారీగా ప్రచారం చేస్తున్నారు.

ప్రజాపక్షం
గురువారం, 13 నవంబరు

## చర్చలు మాత్రమే.. చర్యలు శూన్యం

ప్రతి సంవత్సరం ప్రభావిత దేశాల సదస్సు (కాప్) రూపంలో భూమి నిట్టూర్పులు వినిపిస్తునే ఉంటాయి. వెలుగుల వేదికపై దేశాధినేతలు చేరతారు. సుదీర్ఘ చర్చలు జరుపుతారు. 'భూమిని రక్షిస్తాం' అంటూ మరోసారి గొప్పగా ప్రకటిస్తారు. అంతకు మించి జరిగేదీ.. ఒరిగేదీ ఏమీ ఉండదు. పర్యావరణ సమస్యలు, వాతావరణ పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి బ్రెజిల్ వేదికగా నిర్వహిస్తున్న సదస్సులోనూ ఇవే దృశ్యాలు. చర్చలపై భరోసాలేని చర్చలు, ప్రసంగాలు పొంగి పోతున్నాయి. భూమి గుండె మాత్రం మళ్లీమళ్లీ గాయపడుతునే ఉంది. అసలు పరిణామాల పారిశ్రామికీకరణ తెచ్చిపెడుతున్న అనర్థం అక్కడ అందరికీ తెలుసు. కానీ, తెలియనట్టు నటన. వారి మాటల వెనక చమురు కంపెనీల నీడలు. కర్బన స్వప్నాల మబ్బులు.. అందుకే, అక్కడ చేసే ప్రతిజ్ఞలు కాగితాలపై మాత్రమే బలికి ఉంటాయి. ఆ తీర్మానాలతోపాటు మంచు పర్వతాలు కూడా కరుగుతున్నాయి. సముద్రాలు ఎగసిపడుతున్నాయి. ప్రకృతి విరుచుకుపడుతున్నది. కానీ, ఇవేవీ కాప్ సదస్సుల్లో పాల్గొంటున్న ఎవరికీ పట్టదు. వారి చెవులకు డాలర్ల గలగలలే తప్ప, ప్రకృతి విలవిల వినిపించదు. తాజా సదస్సులో ఇప్పటికే సగం గడిచిపోయింది. అవే సమస్యలు.. అవే చర్చలు.. ఎప్పటి మాదిరిగానే నామమాత్రపు తీర్మానాలు. గతంలో మాదిరిగానే మరోసారి ఒక మార్పును ప్రచారం చేసుకోవడం. ఈ సదస్సులు అంతటితో ముగుస్తాయి. కర్బన సౌఖ్యం.. జతకలుపుతునే ఉంది. అభ్యాసాలు తప్ప ఆచరణ ఏమీ లేదు. వచ్చే వారంలో అదృశ్యాలు జరుగుతాయనే ఆశ ఎవరికీ లేదు. పర్యావరణ సమస్యలు ప్రపంచ దేశాలను అల్లాడిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండోరోజు కూడా వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతున్నది. నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణం. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జరిగే సమావేశాలు, సదస్సుల్లో తీసుకునే నిర్ణయాలు అమలైవుంటే, భూగోళానికి ఈ దుస్థితి దాపురించేది కాదు. ప్రతిసారీ ఒక కొత్త నినాదంతో ముందుకు రావడం, ఏదో ఒక మార్పును ప్రచారం చేసుకోవడం.. ఈ సదస్సులు అంతకుమించి పరిమితమవుతున్నాయి. 'స్థానికులకు 'పెద్దపీట' అంటూ అమెజాన్ అటవీ ప్రాంతానికి అత్యంత సమీపంలోని బెలెంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకునే చెప్పింది. ప్రపంచ జీవ వైవిధ్యాన్ని రక్షించే బాధ్యతలో పెద్ద భాగం స్థానిక ప్రజలదే. పర్యావరణ పరిరక్షణకు వారి ప్రత్యక్ష, పరోక్ష కృషి ఎంతో ఉంది. కానీ, 'అధునాతన నాగరికత' ప్రభావాలతో అత్యధికంగా నష్టపోతున్నది వారే. భారత స్థానిక గిరిజనులను సదస్సుకు ఆహ్వానించడం, వారి సమస్యలు చర్చించడం హర్షణీయమే. కానీ, వారి సమస్యలు వినే ఓపిక.. తీరిక అక్కడ ఎవరికీ లేవు. కనీసం, సాంప్రదాయ విధానాల్లో వారు పర్యావరణాన్ని చేస్తున్న మేలును గుర్తించేప్రయత్నం కూడా జరగడంలేదు. షరామామూలుగానే ప్రతి సదస్సు ఒక కొత్త హామీని మోసుకొస్తుంది. పాత నిర్లక్ష్యానికి కొత్త దుస్తులు తొడుగుతుంది. పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతునే ఉంది. సదస్సులు జరుగుతునే ఉన్నాయి. ప్రతి నిధులు పాత అంశాలనే కొత్తగా ప్రస్తావిస్తారు. గత తీర్మానాలను మరచి, కొత్త హామీలు గుప్పిస్తారు. 'నన్ను పట్టించుకోండి' అంటూ ప్రకృతి ఎన్నో రీతుల్లో చేస్తున్నహెచ్చరికలను ఎవరూ లక్ష్యపెట్టరు. వాణిజ్య ప్రయోజనాలను విడిచిపెట్టరు. భూగోళం మనుగడకంటే ఆర్థిక లావాదేవీలు.. స్వార్థ ప్రయోజనాలే వారికి కీలకం. అందుకే, అమలుకాని నిర్ణయాలను తిరిగి కొత్తగా తీసుకుంటారు. వట్టిపుడు కాని ఒప్పందాలు చేసుకుంటారు.

అభివృద్ధి చెందిన దేశాలు చారిత్రక బాధ్యత నుంచి తప్పించుకుంటూనే ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు నిధుల లోపంతో దీనంగా చూస్తుంటాయి. పేరుకే పర్యావరణ సదస్సులు.. కానీ, అక్కడ వాణిజ్య ప్రయోజనాలే ప్రతిధ్వనిస్తాయి. కాప్ సదస్సుల్లో తీసుకున్న నిర్ణయాలు సక్రమంగా అమలైతే దాఖలాలు ఇప్పటి వరకూ లేనేలేవు. అభివృద్ధి చెందిన దేశాలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న వైనం అసలేలేదు. అంతా ఒక ప్రహసనం. అభివృద్ధి చెందుతున్న దేశాలను మభ్యపెట్టే ప్రయత్నం. తమ వాణిజ్య లక్ష్యాలను చేరుకోవడానికి, లాభాల బాటను పెంచుకోవడానికే ప్రాధాన్యం. పరిస్థితి రోజురోజుకూ విషమిస్తున్నది. మారుతున్న పర్యావరణ పరిస్థితులు... పెరుగుతున్న వాయు, జల కాలుష్యాలు అత్యంత ప్రమాద స్థాయిని దాటాయి. కాబట్టి, ఇప్పుడు మాటలు కాదు... చేతలు అవసరం. సంతకాలు కాదు.. సంకల్పం కావాలి. ప్రతిజ్ఞలకంటే, ప్రయత్నాలు జరగాలి. బ్రెజిల్ సదస్సు గొప్పగా ఏదో సాధిస్తుందని చెప్పలేకపోయినా, కనీసం వాస్తవ పరిస్థితులైనా గుర్తించాలి. ప్రతి నిర్ణయాన్ని అమలు చేయలేకపోయినా, కనీసం ఆ దిశగా అడుగు ముందుకు పడాలి. భూగోళాన్ని పరిరక్షించుకోవడానికి అన్ని రకాల చర్యలు చేపట్టాలి. లేకపోతే, ఎన్ని కాప్ సదస్సులు నిర్వహించినా, ఎన్ని తీర్మానాలు ఆమోదించినా ప్రయోజనం శూన్యం.

# పెరుగుతున్న అసమానత, ఉద్యోగ అభద్రత

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

పని ప్రస్తుతం ప్రపంచం చౌరస్తాలో ఉంది. పని ప్రపంచాన్ని ప్రపంచ ఆర్థిక, సామాజిక, సాంకేతిక, పర్యావరణ పరివర్తనలు వేగంగా పునర్నిర్వచిస్తూ, అసమానతలు, ఉద్యోగ అభద్రతను తీవ్ర తరం చేస్తున్నాయి. ఇలాంటి అస్థిరపరిచే మార్పు లక్షలాది మందికి స్థిరమైన జీవనోపాధి లేదా ప్రాథమిక రక్షణ లేకుండా చేస్తుంది.

ఇటీవల అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) విడుదల చేసిన నివేదికలోని కొత్త అంచనాలో ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక వ్యవస్థలు తిరిగి పుంజుకోవటాన్ని పరీక్షిస్తున్నాయని హెచ్చరించింది. కొత్త సవాళ్లను అధిగమించడానికి కొత్త సామాజిక ఒప్పందానికి పిలుపునిచ్చింది. చర్య తీసుకోకపోతే, ఇప్పటికే ఉన్న అసమానతలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా అనధికారిక, తాత్కాలిక లేదా తక్కువ వేతన ఉద్యోగాలలో పనిచేసే కార్మికులకు, ఐఎల్ఓ హెచ్చరిస్తుంది.

'నాణ్యమైన ఉద్యోగాలు, భాగస్వామ్య శ్రేయస్సులో ప్రతి ఒక్కరూ సమాన అవకాశానికి అర్హులు. ప్రతిచోటా ప్రజలకు న్యాయమైన, సమ్మిళిత, శాశ్వత ప్రగతిని అందించడానికి మనం మళ్ళీ కలిసి పని చేద్దాం' అని ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ ఎఫ్.హౌంగ్‌బోహ్‌స్ అన్నారు. అందుకు ప్రభుత్వాలు ఆశయం, ఐక్యతతో వ్యవహరించాలని కోరారు.

'నూతన సామాజిక ఒప్పందం : సామాజిక అభివృద్ధిపై ద్వితీయ సమావేశం' పేరుతో రూపొందించిన అంచనా నివేదిక గౌరవప్రదమైన పనిలో నిరంతర లోటు, ఉపాధి అభద్రత, పెరుగుతున్న వేతన అంతరాలు, కార్మిక హక్కుల వేటు, వాతావరణ మార్పు, వేగవంతమైన సాంకేతిక పరివర్తన, జనాభా మార్పు వంటివి బహుళపాక్షిక సహకారం బలహీనపడుతుండడంతో మరింత తీవ్రమవుతున్నాయని నొక్కి చెప్పింది. తత్ఫలితంగా, కార్మికులను రక్షించడంలో లేదా వారి ప్రజలకు సామాజిక న్యాయం అందించడంలో అనేక దేశాలలో అమలులో ఉన్న ప్రస్తుత సామాజిక ఒప్పందాలు క్రమంగా విఫలమవుతున్నాయి.

ప్రపంచ కార్మికుల అభద్రత ఎక్కువగానే ఉందని నివేదిక పేర్కొంది. 2024లో, ప్రపంచం 402.4 మిలియన్ల ఉద్యోగాల నిరంతర లోటును ఎదుర్కొంది. 58.2 శాతం మంది కార్మికులు అసంఘటిత ఉపాధిలో ఉన్నారు. పని పేదరికం పెరుగుతోంది. సామాజిక రక్షణ వ్యవస్థలు పరిమితంగా ఉన్నాయి. ప్రపంచ జనాభాలో 47 శాతం మందికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. పరిధి, సమర్థత రెండింటిలోనూ పెద్ద అసమానతలు ఉన్నాయి, దీని కారణంగా నాలుగు వందల కోట్లకు పైగా ప్రజలు ఎటువంటి సామాజిక రక్షణలు లేకుండా పోతున్నారు. అదనంగా, లక్షల మంది కార్మికులు కనీస వేతనాల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు. అలాగే ప్రస్తుత కనీస వేతనాలు మనుగడ కోసం ప్రాథమిక అవసరాలను తీర్చడంలో విఫలమవుతున్నాయి. 2024 – 2025ల నడుమ ఐఎల్ఓ బ్యూరో ఫర్ వర్కర్స్ యాక్టివిటీస్ (ఆక్ట్రావ్) నిర్వహించిన ప్రాంతీయ, ప్రపంచ సమావేశాల శ్రేణిలో వ్యక్తీకరించబడిన ప్రపంచవ్యాప్త ట్రేడ్ యూనియన్ల దృక్పథా లు, అనుభవాలు, పరిష్కారాలను నివేదిక అందిస్తుంది. రెండవ ప్రపంచ సామాజిక అభివృద్ధి శిఖరాగ్ర సమావేశానికి సన్నాహకంగా ఇదంతా జరిగింది. వేగవంతమైన, సంక్లిష్టమైన సామాజిక పరివర్తనలను అధిగమించేందుకు అవసరమైన చురుకుదనాన్ని నిర్ధారిస్తూ, సామాజిక ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి, మంచి పని, హక్కులు, కేంద్రంగా ఉంచడానికి, కార్మికుల ప్రతినిధుల సమగ్ర పిలుపును ఈ నివేదిక అందిస్తుంది.

కోపెన్‌హాగెన్‌లో జరిగిన మొదటి ప్రపంచ సామాజిక అభివృద్ధి సదస్సు ముప్పై సంవత్సరాల తర్వాత, దోహాలో జరిగిన రెండవ శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో, 1995లో చేసిన నిబద్ధతలపై పురోగతి, ఎదురుదెబ్బలను ట్రేడ్ యూనియన్లు సమీక్షించాయి : పేదరికాన్ని నిర్మూలించడం, పూర్తి ,ఉత్పాదక ఉపాధిని సాధించడం, అందరికీ గౌరవప్రదమైన పని, సమ్మిళిత సామాజిక అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం. తిరస్కరించలేని పురోగతి సాధించినప్పటికీ, ప్రపంచం ఈ లక్ష్యాలకు దూరంగా ఉంది. 2024లో దాదాపు 70 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ తీవ్ర పేదరికంలో నివసిస్తున్నారు, ముఖ్యంగా సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో, అనియుత, వెలివేత కార్మిక మార్కెట్లలో ఆధిపత్యం చెలాయిస్తూనే ఉన్నాయి. దేశాల లోపల, దేశాల మధ్య అసమానతలు విస్తరిస్తున్నాయి.

సాంకేతిక అంతరాయాలు, వాతావరణ మార్పు, జనాభా మార్పులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, బలహీనపడే బహుళపాక్షికత కారణంగా ప్రస్తుత ప్రపంచ బహుళసంక్షోభం మన సామాజిక, ఆర్థిక వ్యవస్థల దుర్బలత్వాన్ని మరింత బహిర్గతం చేసింది. గౌరవప్రదమైన పని లోటు కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్య పరిధి కుంచించుకుపోతోంది. చాలా తరచుగా ఉపాధిని దాని చోదక శక్తిగా కాకుండా వృద్ధి ఉపఉత్పత్తిగా పరిగణిస్తారు. కాబట్టి నేడు అవసరమైనది కేవలం సంస్కరణ మాత్రమే కాదని, పునరుద్ధరణ, హక్కులు, న్యాయం ఆధారిత, ప్రజలపై కేంద్రీకృతమైన పునరుద్ధరించబడిన సామాజిక ఒప్పందం అని కార్మిక సంఘాలు పునరుద్ఘాటిస్తున్నాయి.

గౌరవప్రద పనికి కార్మిక హక్కులు పునాది అని నివేదిక చెబుతోంది. సంఘం స్వేచ్ఛ, సామూహిక బేరసారాలు, వివక్షతకు వ్యతిరేకంగా రక్షణ, బాల కార్మికులు, బలవంతపు శ్రమ అనేవి సామాజిక న్యాయం చర్చించలేని స్తంభాలు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులను పరిరక్షించడానికి బలహీనమైన అమలు, చట్టపరమైన అంతరాలను పరిష్కరించాలి. ఆర్థిక పాలన అనేది ప్రజలకు సేవ చేయాలని నివేదిక నొక్కిచెప్పింది. ప్రస్తుత ఆర్థిక విధానాలు తరచుగా ఉపాధిని ఆర్థిక వృద్ధి ఉప ఉత్పత్తిగా పరిగణిస్తాయి. ఉపాధి అనుకూల స్థూల ఆర్థిక చట్రాలు, స్థిరమైన వాణిజ్య విధానాలు, బాధ్యతాయుతమైన అంతర్జాతీయ ఆర్థిక జోక్యాలు, ఐఎల్ఓ గౌరవప్రదమైన పని అజెండాకు అనుగుణంగా అభివృద్ధి సహకారం వైపు మారాలని కార్మిక సంఘాలు పిలుపునిస్తున్నాయి. ఇంకా, సామాజిక రక్షణ, న్యాయమైన పన్ను, కార్పొరేట్ జవాబుదారీతనం స్థిరమైన సామాజిక పెట్టుబడికి నిధులు సమకూర్చడానికి చాలా అవసరం.

సాంకేతిక, వాతావరణ పరివర్తనలకు న్యాయమైన, సమగ్ర వ్యూహాలు అవసరమని నివేదిక పేర్కొంది. వేగవంతమైన డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పు అటు ప్రమాదాలు, ఇటు అవకాశాలను కలిగిస్తాయి. పరివర్తనలు మానవ కేంద్రంగా ఉండాలని, ఎవరూ వెనుకబడి ఉండకుండా చూసుకోవడానికి పునఃనైపుణ్యం, సామాజిక రక్షణ, కార్మికుల భాగస్వామ్యాన్ని కలపాలని, అలాగే బలహీన వర్గాలు, ముఖ్యంగా మహిళలు, యువత, వలస కార్మికులు, అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో ఉన్నవారు ఈ పరివర్తనల నుండి ప్రయోజనం పొందాలని కార్మిక సంఘాలు నొక్కి చెబుతున్నాయి.

> పరిధి, సమర్థత రెండింటిలోనూ పెద్ద అసమానతలు ఉన్నాయి, దీని కారణంగా నాలుగు వందల కోట్లకు పైగా ప్రజలు ఎటువంటి సామాజిక రక్షణలు లేకుండా పోతున్నారు. అదనంగా, లక్షల మంది కార్మికులు కనీస వేతనాల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు. అలాగే ప్రస్తుత కనీస వేతనాలు మనుగడ కోసం ప్రాథమిక అవసరాలను తీర్చడంలో విఫలమవుతున్నాయి.

స్థానిక వాస్తవాలకు అనుగుణంగా పరిష్కారాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది. బాల కార్మికులు, అసంఘటిత పని, అసురక్షిత ఉపాధి, వేతన అభద్రత, లింగ వివక్ష, వ్యవస్థాగత మినహాయింపు విస్తృతంగా ఉన్నాయి. ఆఫ్రికా నుండి ఆసియా, పసిఫిక్, లాటిన్ అమెరికా, అరబ్ రాష్ట్రాలు, యూరప్ వరకు ఉన్న ప్రాంతీయ ఉదాహరణలు, రంగాలవారీ ఒప్పందాలు, కనీస, జీవన వేతనాలు, అనియుత పనిని సంఘటితం చేయడం వంటి సందర్భోచిత పరిష్కారాలు కార్మికులను రక్షించగలవని, సామాజిక ఐక్యతను ప్రోత్సహించగలవని వివరిస్తాయి. కార్మిక సంఘాలు ప్రాసంగికత ఉండేలా రూపాంతరం చెందుతున్నాయని గమనించబడింది. ఇముడ్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆర్థిక నైపుణ్యాన్ని నిర్మించడం, కూటములు ఏర్పరచుకోవడం, డిజిటల్ సాధనాలను స్వీకరించడం ద్వారా యూనియన్లు విధానాలను బాగా రూపొందించగలవు, హక్కులను రక్షించగలవు, సరిహద్దుల గుండా సామాజిక పురోగతిని నడిపించగలవని నివేదిక నొక్కి చెప్పింది.ఐఎల్ఓకు చెందిన బ్యూరో ఫర్ వర్కర్స్ యాక్టివిటీస్ డైరెక్టర్ మరియా హెలెనా ఆంద్రే మాట్లాడుతూ 2030, ఆపైన సమ్మిట్ ఫలితాలను, అభివృద్ధి ఎజెండాను రూపొందించడంలో కార్మికుల గొంతులు, అనుభవాలు, పరిష్కారాలను తెలియజేయడం ఈ నివేదిక లక్ష్యం అని పేర్కొన్నారు.

భవిష్యత్తు కోసం కొత్త దృక్పథాన్ని అందిస్తూ, సామాజిక ఒప్పందాన్ని పునరుద్ధరించడం కేవలం సంస్కరణవాద ప్రయత్నం కాదని నివేదిక పేర్కొంది. ఆర్థిక, సామాజిక విధానాలలో గౌరవప్రదమైన పని, కార్మిక హక్కులను ముందంజలో ఉంచడం, సంక్లిష్టమైన ప్రపంచ పరివర్తనల యుగాన్ని అధిగమించడం, సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ఆ విధానాలు సమాజంలోని అందరికీ చేరేలా చూసుకోవడం అవసరం. ఈ ప్రక్రియలో కార్మిక సంఘాలు అనివార్యమైన పాత్రధారులు అని, మానవులు కేంద్రంగా, న్యాయమైన, స్థితిస్థాపక పని ప్రపంచం కోసం వాదిస్తున్నాయని నివేదిక పేర్కొంది.

(ఐపిఎ సర్వీస్)

# భారత విదేశీ వ్యవహారాల బలహీనత బహిర్గతం

సుమారు రెండు దశాబ్దాలుగా భారతదేశం నిర్వహించిన తజికిస్తాన్ ఆయ్నా ఎయిర్‌బేస్‌ను ఆ దేశం తిరిగి స్వాధీనం చేసుకోవడం, భారత విదేశాంగ వ్యూహంలో పెరుగుతున్న బలహీనతలను బహిర్గతం చేసిన కీలక పరిణామంగా భావించబడుతోంది. ఈ పరిణామంతో మధ్య ఆసియా ప్రాంతంలో రష్యా, చైనా ప్రభావం మరింత బలోపేతమవుతుండగా, భారతం మాత్రం వ్యూహాత్మకంగా ఒంటరితనాన్ని ఎదుర్కొంటుందనే వ్యాఖ్యలు వెలువడుతున్నాయి. దుషాంబే నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆయ్నా ఎయిర్‌బేస్ భారతదేశం నిర్వహించిన ఏకైక విదేశీ సైనిక స్థావరం. ఇది పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్ భద్రతా పరిణామాలను పరిశీలించేందుకు భారత్‌కు అరుదైన నిఘా మరియు వ్యూహాత్మక స్థానాన్ని కల్పించింది.

2000ల ప్రారంభంలో భారత్ ఈ స్థావరాన్ని ఆధునికీకరించేందుకు సుమారు 70 నుంచి 100 మిలియన్ అమెరికా డాలర్లు ఖర్చు చేసింది. రన్‌వే విస్తరణ, రాడార్ వ్యవస్థలు, హ్యాంగర్లు, భద్రతా కంచెలు వంటి సదుపాయాలు ఇందులో భాగం. ఆఫ్ఘానిస్థాన్లో తాలిబాన్‌కు వ్యతిరేకంగా ఉన్న నార్తర్న్ అలయన్‌కు వైద్య, లాజిస్టిక్ మద్దతు అందించడంలో కూడా ఇది ఉపయోగపడింది.

అయితే, ఈ స్థావరం పూర్తిగా భారత సార్వభౌమ ఆధీనంలో కాకుండా, ద్వైపాక్షిక అంగీకారాలపై ఆధారపడటంతో, రాజకీయ సమీకరణలు మారినప్పుడే భారత్ ప్రభావం తగ్గే పరిస్థితి ఏర్పడింది.

**రష్యా, చైనా ఒత్తిడి**

తజికిస్తాన్ ఈ నిర్ణయం స్వతంత్రంగా తీసుకోలేదు అని విశ్లేషకులు సూచిస్తున్నారు. మధ్య ఆసియా భద్రత, రక్షణ వ్యవస్థల్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలనుకునే రష్యా, ఆర్థిక మరియు వ్యూహాత్మక పెట్టుబడులు పెంచుతున్న చైనా కలిసి తజికిస్థాన్‌పై ఒత్తిడి తీసుకొచ్చినట్టు భావించబడుతోంది. రష్యాకు, సమిష్టి భద్రతా ఒప్పంద సంస్థ బయట భారత్ స్వతంత్ర స్థావరం నిర్వహించడం వ్యూహాత్మకంగా అసౌకర్యంగా అనిపించింది. మరోవైపు చైనా, ఆ ప్రాంతంలో తన సరిహద్దు భద్రత మరియు బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుల ప్రభావాన్ని పెంచుకోవడంలో భారత్‌ను ప్రధాన పోటీదారుగా చూస్తోంది. 2021లో ఆఫ్ఘానిస్థాన్‌లో తాలిబాన్ తిరిగి అధికారంలోకి రావడంతో, నార్తర్న్ అలయన్స్ బలహీనపడటం కూడా భారత వ్యూహాత్మక అవసరాన్ని తగ్గించినట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

ఈ పరిణామం భారత విదేశీ వ్యవహారాలలో ఉన్న ప్రధాన బలహీనతలను సూచిస్తుంది. దీర్ఘకాల సైనిక ఒప్పందాలు కుదుర్చుకునే దృఢ సంకల్పం లోపం, ఆర్థిక, మౌలిక వనరుల పెట్టుబడుల్లో చైనా స్థాయిలో పోటీ చేయలేకపోవడం. పాకిస్థాన్ కారణంగా మధ్య ఆసియాకు భూభాగ మార్గం లేకపోవడం వల్ల వ్యూహాత్మక ప్రాప్యత తగ్గిపోవడం. భారత్ 'కనెక్ట్ సెంట్రల్ ఏషియా' విధానాన్ని ప్రకటించినా, అది అమలులో అంతగా పురోగమించలేదు.

ఆయ్నా ఎయిర్‌బేస్ నుండి భారత్ నిష్క్రమణ, ఒక స్థావరం కోల్పోవడమే కాకుండా, భారత్ మధ్య ఆసియాలో తన స్థిరమైన వ్యూహాత్మక ప్రభావాన్ని కోల్పోయిన సంకేతంగానే చూడబడుతోంది. రష్యా, చైనా ప్రభావం పెరుగుతున్న ఈ కొత్త భౌగోళిక సమీకరణల్లో, భారత విదేశాంగ విధానం మరింత బలమైన ఒప్పందాలు, మౌలిక పెట్టుబడి, స్పష్టమైన వ్యూహా లక్ష్యాలతో పునర్నిర్మించాల్సిన అవసరం స్పష్టమవుతోంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

# భాషా పరిరక్షణ - దేశ సార్వభౌమత్వం

*దేశ భక్తి అంటే మాతృభాష మీద అభిమానమే –*
*గిడుగు వేంకటరామమూర్తి*

అమెరికా సుంకాల సంకట వాతావరణ నేపథ్యంలో, వచ్చిన వార్తల్లో అమెరికా ట్రెజరీ సెక్రెటరీ మరియు ప్రెసిడెంట్ ట్రంప్ వర్తక సలహాదారు పేలిన అవాకులు చవాకులని టూకీగా గమనిస్తే The tax payers lose because we (americans) have got to fund Modi's war. Mr.Navaarro (Trade Advisor) told the Bloomberg news agency, accusing India of getting in bed with the authoritarians like Russia and China. U.S.Treasury Secretary Scott Bessent called India U.S.ties a complicated relationship, despite good ties between Mr.Trump and Mr.Modi and said the issue was not just Russian oil purchases but India's failure to make a deal with the U.S.on trade. a deal అన్నది ఆ వార్తలో లేకపోయినా వాట్సాప్‌లో చక్కర్లు కొడుతూనే ఉంది. అది : అమెరికా ఎందుకు భారత్‌పై కోపంగా ఉంది? నిజం ఇదే : భారత్ అమెరికా వాణిజ్య లక్ష్యం : 2030 నాటికి 500 బిలియన్ల డాలర్స్‌కి చేరుకోవాలనే కల : ఆ కల వెనుక ఒక షరతు : అది : జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) విత్తనాలు/పంటలు : భారత్ వద్దు అంది అమెరికా సంతకం చేయమంది. భారత్ ఎప్పటికీ చేయనంది. ఈ విత్తనాల వ్యాపార ఒప్పందం వలన భారత రైతాంగం పూర్తిగా కోలుకోలేని విధంగా నష్టపోతుంది. అదీ గాక ఈ విత్తనాల వలన రకరకాల వ్యాధులు సంక్రమించి భారత్ ని ఓ అనారోగ్య దేశంగా మార్చేస్తుంది.

పైన చెప్పబడిన అమెరికా అధికార వర్గం వారం రోజులు పాటు విరామం లేకుండా అవే నిందా వాక్యాలు పేలుతూనే ఉన్నారు. అసలు అంతటి అవమానకరమైన వ్యాఖ్యలు ఓ దేశం మరో సార్వభౌమాధికారం కలిగిన దేశంపై చేయడం సమంజసమేనా ? అంతటి పెడసరం ఎలాగొచ్చింది ఆ దేశానికి. వ్యాపారం పేరుతో అంతటి నీతిమాలిన తనానికి దిగజారడమేనా? పైపెచ్చు నియంతలతో చేయి కలుపుతున్నావని భారతదేశాన్నీ తిట్టిపోస్తూ, యుద్ధకాపరి అమెరికాయే ఓ నియంతలా, నియంతృత్వపు పోకడలతో వాణిజ్య యుద్ధాలకి తెర లేపుతుంది. దుష్ట సామ్రాజ్యవాద చర్యలతో ప్రపంచ దేశాల అస్థిత్వాలకి ఎసరు పెడుతుంది. ఆర్థిక అసమానతలను పెంచి పోస్తుంది. ఆకలి రాజ్యాలను పాదు కొలుపుతుంది. యుద్ధ వ్యాపారం మీద జీవనం సాగిస్తుంది. ఏది ఏమైనా భారత దేశానికి ఓ తలవంపుగా తోస్తున్నాయి పైన చెప్పిన అమెరికా అధికార వర్గపు నిర్హేతుక నిందా వ్యాఖ్యలు.

ఇంకా ఈ ప్రపంచ వాణిజ్య భూతం ఈ నేల మీద ఆవహించి, మొన్న కరెంట్, నిన్న రవాణా, నేడు భాషల జుట్టు పట్టుకొని ఉసురు తీస్తుంది. రేపు, మర్నాడు, మున్ముందు, మనం, మన బాబాయిలు, కాకాలు, దాద లు ముఖాలు లేని మొండాలుగానే మిగిలిపోతామని అనిపిస్తుంది. వెయ్యి సంవత్సరాల భారతం ఓ దాస్య దృశ్యమైపోయింది. ఆ దృశ్యం తరువాత స్వతంత్ర దృశ్యాన్ని ఆవిష్కరించుకుంది. అయినా దానికి బాలారిష్టాలు తప్పడం లేదు. పర తంత్రం పీడ తప్పడం లేదు.

పరాయి దేశాలు మూకుమ్మడిగా కన్ను గీటి కుట్రలకు పూనుకుంటున్నాయి. అసలు భారతీయ సంస్కృతిలో అంతర్లీనంగా దాగున్న విశ్వకళ్యాణ భావన వలన అందరికీ అలుసుగా తయారవుతుందేమో ఈ దేశం.

మళ్ళీ అమెరికా దాష్టీకపు వ్యాఖ్యలు, వాణిజ్య యుద్ధాల వైఖరి నేపథ్యం లో దేశాల సంస్కృతీ సార్వభౌమత్వాలకి ఎలా ముప్పు ఏర్పడుతుందో మచ్చుకి ఓ ఉదాహరణ:

ప్రపంచీకరణ పూర్వరంగంలో తమ సరకులతో వర్ధమాన దేశాల మార్కెట్లను నింపి, స్థానిక ప్రజల వస్తూత్పత్తులను దెబ్బతీసి సంతలపై సంపూర్ణ ఆధిపత్యం నెలకొల్పడానికి ముందు ప్రపంచ సమాచార వ్యవస్థను అదుపులోకి తెచ్చుకోవాలని అమెరికా, ప్రపంచ బ్యాంక్, ఐ.ఎమ్.ఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలకు ఆదేశాలిచ్చింది. ఈ విషయాన్ని సుప్రసిద్ధ అమెరికన్ మీడియా నిపుణులైన ఎడ్వర్డ్స్, మెక్ సినేలు వెల్లడించారు. ఈ నిర్ణయం 1980–90 మధ్య జరిగింది. దీని పర్యవసానంగానే, ఈ పూర్వరంగంలోనే మాతృభాషల స్థానే ఇంగ్లిష్ ను సర్వత్రా ప్రాథమిక విద్యాదశ నుంచి బోధనా భాషగా, మల్టీ నేషనల్ గుత్త కంపెనీల వ్యాపార వ్యవహా ర లావాదేవీల ప్రయోజనాలు సాధించిపెట్టడం కోసం అమలులోకి తేవాలన్న నిర్ణయం జరిగింది. ఏ.బి.కే. ప్రసాద్, పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు , నూర్ భాషా రహం తుల్లా గారు రాసిన 'తెలుగు అధికార భాష కావాలంటే...' అన్న పుస్తకానికి ముందు మాటలో.

లోగుట్టు పెరుమాళ్ల కెరుక అన్నట్టు, అసలు హంతకులైన అంతర్జాతీయ వాణిజ్య సంస్థలని వొదిలేసి, వాటికి ఎర్ర తివాచీలు పరచి, మన రాజకీయ ఏలిక వర్గం ఉపాధి నెపంతో, బూచితో ప్రజలకి ఇంగ్లిష్ ఒక్కటే ఆరాధ్య దైవం అంటూ, మాతృ భాషలకి తీరని ద్రోహం చేస్తున్నారు. వలసలని ప్రోత్సహిస్తున్నారు. నేల తల్లిని స్థానికులకి దూరం చేస్తున్నారు. ఏ మీడియా సమావేశం లో నైనా ప్రజల అసలైన అవసరాల గురించి గానీ, సంస్కృతి సాంప్రదాయ ఆరోగ్యాల గురించి కాకుండా, రాజకీయుల అక్రమ సంపాదన, బంధు వైరాల గురించి, ప్రత్యర్థి హత్యల గురించి, కుట్రల గురించే ఎక్కువగా మాట్లాడడం జరుగుతుంది. ఇది మనందరి నిత్య అనుభవం. నూతన ఉపాధి మార్గాలు ఆలోచించి వలసలు అరికట్టడం, స్థానిక వనరులతో వినూత్న ఉత్పత్తులు గావిం చి స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడం గాని నేటి రాజకీయాల్లో చూడమ్ గాక చూడమ్.

diversification, not substitution, is the real currEncy of sovereignty. అన్న ఓ వ్యాసకర్త వాక్యం కూడా గమనించదగ్గది.

అమెరికా పోయే నలుగురి కోసం అంతా ఇంగ్లిష్ చదవాలా? అన్న మన అనుభవజ్ఞులైన పెద్దల మాటలని గౌరవించాలి. తల్లి తెలుగుని రక్షించుకుంటూ భాషా సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ, దేశ సార్వభౌమత్వాన్ని కూడా కాపాడుకోవలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది. దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని నిఘా కళ్ళతో నిత్యం సంరక్షించుకోవాలి.

ఒబ్బిని సన్యాసిరావు
9849558842

# బడి అంటే విద్యార్థికి భయమెందుకు?

ఒక పాఠశాలలో మంచి వాతావరణం అనగా గాలి వెలుతురు ఉండాలంటే ఆ పాఠశాలను శాస్త్రీయంగా నిర్మించాలి అనగా పాఠశాలను C, H, I, L, O, U అనే ఇంగ్లీషు అక్షరాల ఆకారంలో మాత్ర మే నిర్మించాలి. అటువంటి ఆకారంలో నిర్మించినప్పుడే పాఠశాలకు మంచి గాలి, వెలుతురు సమృద్ధిగా దొరుకుతుంది. అలా ప్రకృతి ప్రసాదించిన గాలి, వెలుతురు పిల్లలకు లభించినప్పుడే వారికి పాఠశాలలో అలసట అనేది ఉండదు. అలాగే ప్రతి పాఠశాలకు విధిగా ఆట స్థలాలు ఉండాలి. ఇలా ఆట స్థలాలు మరియు C, H, I, L, O, U ఆకారంలో నిర్మితమైన పాఠశాలలు గతంలో ప్రతి గ్రామంలో, కొన్ని పట్టణాలలో ఉండేవి. అందుకే గడిచిన రోజులలో పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే ఉత్సాహం చూపేవారు, నేనంటే నేను ముందుగా పాఠశాలకు చేరుకొనాలని పిల్లల మధ్య పోటీతత్వం ఆ రోజులలో ఉండేది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల లో అటువంటి పాఠశాలలు చాలా ఉన్నాయి. కానీ అందులో విద్యార్థులు ఉండడం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలు బ్రతుకుతెరువు కోసం పట్టణాల కు వలస వెళ్లడం మూలంగా ఈనాడు పట్టణ ప్రాంతాల్లో వేలకొలది పాఠశాలలు వెలసినవి. ఆ పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మారి అందు లో పాఠశాల వాతావరణం అసలు కనిపించదు, ఆ పాఠశాలను వ్యాపార సముదాయాల్లో, చిన్న చిన్న ఇరుకు సందుల్లో, అపార్టుమెంట్‌లలో ఇలా ఎవరికి నచ్చిన ప్రాంతంలో వారు పాఠశాలలను ఏర్పాటు చేసుకొని 'కాకులు దూరని కారడివి' సామెత మాదిరిగా గాలి, వెలుతురు లేని పాఠశాలలు నిర్మించి విద్యను వ్యాపారం చేస్తున్నారు. అటువంటి పాఠశాలలకు విద్యార్థులు సూర్యుడు ఉదయించక ముందే ఇంటి నుండి బయలుదేరి సూర్యుడు అస్తమించిన తర్వాత మాత్రమే తమ స్కూలు వ్యానుల్లో ఇంటికి చేరుతున్నారు. అంటే సూర్య చంద్రులు ఎలా ఉంటారో కూడా చూడలేని విద్యార్థులు పట్టణ ప్రాంతాలతో పాటుగా చివరికి గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉన్నారు. గాలి, వెలుతురు అవసరం లేదనే విధంగా ఇటు తల్లిదండ్రు లు, అటు పాఠశాల యాజమాన్యాలు కోరుకుంటున్నాయి. మా పిల్లలు ఇంటి నుండి AC బస్సు లో వెళుతున్నారు, పాఠశాలలో కూడా తరగతి గదుల్లో AC ఉంటుంది, లైట్లు ఉంటాయి. ఇంకా గాలి, వెలుతురు మా పిల్లలకి అవసరం లేదు అనే విధంగా తల్లిదండ్రులు తయారైనారు. కానీ గాలి వెలుతురు పిల్లలకు లేకపోవడం వలన వారికి విటమిన్ డి లోపం ఏర్పడి వారిలో పెరుగుదలను,



చురుకుదనాన్ని నివారిస్తుంది. శారీరకంగా దృఢంగా ఉండడానికి ఆటలు ఆడాలంటే ఏ పాఠశాలలో కూడా ఆటస్థలాలు ఉండవు. ఆటస్థలాలు ఉన్న పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉండరు, అన్నీ ఉన్నా కొన్ని పాఠశాలల్లో చదువు ర్యాంకులు మాత్రమే కొలమానం అనే విధంగా చూస్తున్నారు. గాలి, వెలుతురు లేక, ఆటలు ఆడ క, పాఠశాలలో రోజంతా చదువు పైన మాత్రమే దృష్టి కేంద్రీకరించడం, ఇంటికి వెళ్లిన తర్వాత హోం వర్క్ అంటూ, ట్యూషన్లు అంటూ 15 గంట లు వారిని మరయంత్రాలుగా మార్చడం వలన వారు పాఠశాలకు వెళ్లాలంటే నిరుత్సాహం చూప డం, నిరాసక్తతను వ్యక్తపరచడం చేస్తున్నారు. తల్లిదండ్రులు మాత్రం మా పిల్లలు AC బస్సులో వెళ్లాలి, AC తరగతి గదిలో చదువుకోవాలి, మంచి ర్యాంకులు సాధించాలి అని సోషల్ స్టేటస్ కోణంలో మాత్రమే చూస్తున్నారు. అటు పాఠశాల ల యాజమాన్యాలు కూడా తల్లిదండ్రుల అత్యుత్సాహం, అత్యాశను ఆసరాగా చేసుకొని సామాజిక బాధ్యత పట్ల ఏమాత్రం అవగాహన లేకుండా వారిని నీలిమబ్బులలో విహరింపజేసి వ్యాపారం చేస్తున్నారు. కానీ పిల్లలు చిన్న వయసు లోనే ఆరోగ్య సమస్యలు, కళ్ళకు అద్దాలులో మానసికంగా దృఢమైన ఆలోచన లేకపోవడం వల్ల వారు ఒక చక్రబంధంలో ఇరుక్కుంటున్నారు అనే ఆలోచన తల్లిదండ్రులు కానీ పాఠశాల యాజమాన్యాలు గాని ఆలోచన చేయడం లేదు. విద్య కోసం ఎన్ని విద్యా కమిటీలు వేసినా, ఎన్ని కమిషన్లు సిఫార్సు లు చేసిన అవి ఆచరణకు అమలుకు నోచుకోవడం లేదు.

అందుకే పాఠశాలలు వాటి పరిసరాల పరిస్థితులను మార్చాలి. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలల్లో కల్పించాలి. పరీక్షలపై సంస్కరణలు తీసుకురావాలి, విద్యార్థి చదువుకునే సిలబస్ ను అతని నిజ జీవితానికి మరియు భవిష్యత్తులో అతడు ఎదగడానికి ఉపయోగపడే విధంగా సంస్కరణలు తీసుకురావాలి. పాఠశాలల మధ్య విద్యార్థుల మధ్య ర్యాంకుల పోటీతత్వం నివారించాలి. కూలి పని చేసే తల్లిదండ్రుల పిల్లల నుండి ఉన్నత స్థానంలో ఉన్న తల్లిదండ్రుల పిల్లల వరకు అందరికీ ఒకే విధమైన విద్యా విధానం అనగా 'కామన్ స్కూల్ విద్యా విధానం' తీసుకురావడానికి పాలకులు, ప్రభుత్వాలు సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



యాసాని కరుణాకర్ రెడ్డి,
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ
స్టేట్ (STUTS)

## ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు

### డబ్బులు పోయాక బాధపడడం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్త పడండి : ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** విలాసవంతమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రకరకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి, ప్రజల నుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగోస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్‌లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారని, ఇలాంటి నూతన స్కీంల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, సైబర్ నేరాలకు ప్రజలు గురైతున్న విధానం,సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్త పడాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు.

## ప్రజలను గూడ్స్ వాహనాల్లో తరలిస్తే కఠిన చర్యలు : ఎస్సై

**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ కేంద్రంలో ఎస్సై విజయ్‌కుమార్ బుధవారం ఉదయం వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలను, కూలీలను, చిన్న పిల్లలను గూడ్స్ వాహనాలలో రవాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రవాణా చట్టప్రకారం గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలి వాటిలో వ్యక్తులను, కూలీలను, చిన్న పిల్లలను రవాణా చేయడం నేరమని తెలిపారు. వాహనాదారులు, డ్రైవర్లు గూడ్స్ వాహనాల్లో వ్యక్తులను తీసుకెళ్లినట్లు గుర్తించిన పక్షంలో సంబందిత వాహనంపై చర్యలు తీసుకొని వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ప్రాణాలను ముప్పుగా మారే ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుసరించరాదని కోరారు. ప్రతి ఒక్కరు రవాణా నియామాలు గౌరవించి సురక్షిత రవాణా కోసం బస్సులు, ఆటోలు, టాక్సిల వంటివి వాడాలి అని, మీ ప్రాణాలు మీ చేతిలో ఉన్నాయి అని గుర్తించుకొని ప్రయాణం చేయాలని ఎస్సై తెలిపారు.

## అదుపుతప్పి కారు బోల్తా




**ప్రజాపక్షం/అచ్చంపేట :** హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతున్న కారు వటువర్లపల్లి సమీపంలో రాసమల్లబావి దగ్గర అదుపు తప్పడంతో నలుగురికి గాయాలయ్యాయని ఈగలపెంట ఎస్ఐ తెలిపారు. వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కుమార్(51) అప్పారావు(63), వాణి అపర్ణ(32), లాస్యవి(6) వీరు బుధవారం హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళుతుండగా కారు అదుపు తప్పడంతో గాయాలయ్యాయని తెలిపారు. కారు నెంబర్ 38జిఎ5865 అనే వాహనంలో వారు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సేవా కార్యక్రమాలు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల వాసవి క్లబ్, వనిత క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ పర్యటన సందర్భంగా జడ్చర్ల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విశేషమైన సేవా కార్యక్రమాలు భాగంగా ఉదయం శ్రీ వాసవి కన్యకా అమ్మవారిని దర్శించుకుని శ్రీ సత్యనారాయణ స్వామి మందిరంలో విద్యుత్ దీపాల (ఫ్లడ్ లైట్స్) ఏర్పాటు, శ్రీ సత్యేశ్వర సేవా ఆశ్రమంలో దుప్పట్లు, బియ్యం అందజేశారు. జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి వారం శాశ్వత అల్పాహారం ఏర్పాటు, గంగాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్, కుర్చీల అందజేత, గంగాపూర్ మలయాళ స్వామి వృద్ధుల ఆశ్రమంలో 50 కుర్చీల అందజేత. గత 8 సంవత్సరాలుగా ఎప్పుడు మన జడ్చర్ల వాసవి క్లబ్ సందర్శనకు ఎప్పుడు మన జడ్చర్ల వాసవి క్లబ్ సందర్శనకు రాని ఇంటర్నేషనల్ అధ్యక్షుడిని ప్రస్తుత అధ్యక్షులు చిత్తనూరి రామకృష్ణ, వారి సభ్యులు ఇక్కడ సందర్శన చేయించి ఇన్ని విశేష కార్యక్రమాలు చేపట్టడం పట్ల కుల ప్రముఖులు, అధ్యక్షులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు చిత్తనూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి నవీన్, ఇంటర్నేషనల్ ఆఫీసర్ మేడిశెట్టి రామకృష్ణ, గవర్నర్ రాధ కృష్ణ, కాబినెట్ సెక్రెటరీ కండె కృష్ణ, వనిత వాసవి క్లబ్ అధ్యక్షురాలు చిత్తనూరి జ్యోతి, ప్రధాన కార్యదర్శురాలు చిగుళ్లపల్లి వసుధ, కోశాధికారి శ్రీ లక్ష్మి, రీజినల్ చైర్మన్ ఆనంద్ రాజ్, జోన్ చైర్మన్ లాగిశెట్టి శేఖర్, మాజీ అధ్యక్షులు సత్యమ్ శెట్టి, రాచమళ్ల ఆనంద్, కొండూరు వెంకటేష్, జి.పి ప్రవీణ్, మంచన గణేష్, శ్రీధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో విద్యార్థినులకు కాంస్య పతకం



**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నేతి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 6 నుండి 10 వరకు పెద్దపల్లి జిల్లా కేంద్రం గవర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన 58 వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో ఛాంపియన్షిప్ క్రీడల్లో మక్తల్ మండలం, కర్ని గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వై.శశిరేఖ, రోషిని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మహిళ జట్టు తరపున ఆడి, అసమాన క్రీడా నైపుణ్యత ప్రదర్శించి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు గెలుపునకు కృషి చేసి, కాంస్య పతకాన్ని, మెరిట్ సర్టిఫికెట్లు పొందినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రూప తెలిపారు. అలాగే బాలుర జట్టులో డి.అరవింద్ పాల్గొని ఐదవ స్థానం పొందినట్లు బి.రూప తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్, ఖో ఖో కోచ్ బి.రూప మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో క్రీడల్లో శశిరేఖ, రోషిని కాంస్య పతకాన్ని సాధించడం ఆశామాసి కాదని సంతోషన్ని వ్యక్తపరుస్తూ, నిత్యం ఉదయం, సాయంత్రం ఖోఖో క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇవ్వడం వలన మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో క్రీడల్లో రాణించి బ్రాంచ్ మెడల్ సాధించిన శశిరేఖ, రోషిని, అరవింద (ఐదోస్థానం)లను, అందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ బి.రూపను, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణమూర్తి, అడ్వైజర్ బి.గోపాలం, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం, పాఠశాల జిహెచ్ఎం వెంకటయ్య గౌడ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు.

## మహాసభ కరపత్రాలు ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మాగనూర్:** ఈనెల 23న హైదరాబాదులోని సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్‌లో తలపెట్టిన మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు నారాయణపేట జిల్లాఅధ్యక్షులు నారాయణ కోరారు. బుధవారం మాగనూరు మండల కేంద్రంలో సంఘం సభ్యులతో కలిసి సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత జనాభా లెక్కలు లేకుండా, ఎలాంటి ఎంపరికల్ డేటా తీసుకోకుండా సుప్రీంకోర్టు సూచనలను పాటించకుండా 2011 జనాభా లెక్కలతో వర్గీకరణ జరిగిందన్నారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపు లోను మాలలకు తీవ్ర నష్టం జరిగేలా సబ్ కమిటీ సభ్యులు కుట్రపూరితంగా చేశారని మండిపడ్డారు. 5శాతం కేటాయించిన గ్రూప్ 3 లోని మాలలకు, 19 శాతం ఉన్న గ్రూప్ 1 లోని వారికంటే తక్కువ ఉద్యోగాలు వస్తున్నాయంటే 1 శాతం కంటే తక్కువ రిజర్వేషన్‌ను మాలలకు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా 2011 జనాభా లెక్కలతో సరైన ఎంపెరికల్ డేటా లేకుండా కులాల వారిగా చేసిన ఎస్సీ వర్గీకరణ ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పున:సమీక్షించి జీవో 99 ని సవరించి మాలలతో పాటు గ్రూప్ త్రీలో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు మధు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సగరం రమేష్, మహేష్, రాఘవేందర్, అర్జున్, అనిల్, రవి, శంకర్, వాసు, నరేష్, మహేష్, ఐలప్ప తదితరులు పాల్గొన్నారు.



# భక్తుల సౌకర్యాల కోసం తగిన చర్యలు

### శ్రీశైలం క్రూయిజ్ లాంచీని సందర్శించిన పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** శ్రీశైలం వెళ్ళే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు అందించాలంటూ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి సోమశీల గ్రామంలో పర్యటించి, అక్కడి నుంచి సోమశీల, శ్రీశైలం క్రూయిజ్ లాంచీని స్వయంగా సందర్శించారు. లాంచీ సర్వీసులు, భద్రతా ఏర్పాట్లు, భక్తులకు అందించే సౌకర్యాలు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం యాత్రకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి. లాంచీ సర్వీసులు నిరంతరంగా నడుస్తూ ఉండేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. లాంచీ నిర్వహణలో లోపాలు లేకుండా, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహకు మంత్రి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. శ్రీశైలం మార్గంలో ప్రయాణించే భక్తులకు పానీయ జలాలు, వైద్య సదుపాయాలు, వసతి సదుపాయాలు లభ్యమయ్యేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి అని చెప్పారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ, సోమశీల,శ్రీశైలం క్రూయిజ్ ద్వారా పర్యాటక రంగం మరింత అభివృద్ధి చేందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త ఊపిరి వస్తుందని ఆయన తెలిపారు. పర్యటనలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పర్యాటక శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి పథకం వరం

### ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



**ప్రజాపక్షం/కొత్తకోట :** దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి బుధవారం కొత్తకోట ఎంపిడిఓ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 103 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి ఫ్రీ బస్, ఉచిత కరెంటు, ఫ్రీ సిలిండర్, రేషన్ కార్డులు, సన్నబియ్యం, బోనస్, రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకొని ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. అనంతరం ముందుగా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో న్యాయవాదుల రక్షణ చట్టం కొరకై అలంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలంపూర్ నుండి హైదరాబాద్ వరకు చేపట్టిన ఛలో హైదరాబాద్ మహా పాదయాత్రలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి తదనంతరం ప్రభుత్వం తరుపున న్యాయవాదుల అండగా ఉండేందుకు గతంలోనే కరీంనగర్‌లో న్యాయవాదుల దంపతుల హత్య జరిగినప్పుడు, నారాయణ పేట జిల్లాలో న్యాయవాదులు అందరూ కలిసి నిరసన వ్యక్తం చేస్తున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, ఈ సందర్భంగా న్యాయవాదుల కోసం ఒక్క చట్టం తీసుకురావాలని ఆ రోజుల్లోనే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. న్యాయవాదుల రక్షణ హక్కు చట్టానికి సంబంధించి డ్రాఫ్ట్ బిల్లుపై ముఖ్యమంత్రి తో చర్చించి, రాబోయే అసెంబ్లీ శీతకాల సమావేశాలలో అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ పెట్టించి, బిల్లును ఆమోదింప చేసేందుకు నా వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారుల, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేలా చర్యలు



అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** బుధవారం చిన్నంబావి మండల కేంద్రంలో మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. మండలంలో ఎన్ని ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారని వ్యవసాయ అధికారులను ఆరా తీయగా 9500 ఎకరాల్లో సాగు చేసినట్లు బదులిచ్చారు. అనంతరం ఓ రైతు తెచ్చిన మొక్కజొన్న పంట ధాన్యంలో తేమను స్వయంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పలువురు రైతులు మాట్లాడుతూ తమకు మొక్కజొన్న పంటను విక్రయించేందుకు చిన్నంబావిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం దూరం అయిందని, అయ్యవారిపల్లిలో మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతుల విజ్ఞప్తిని సంబంధిత మార్క్ఫెడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైతే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

**కంప్యూటర్ ద్వారా బోధించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలి**

వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం చేసేందుకు ప్రారంభించిన కంప్యూటర్ తరగతుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం చిన్నంబావి మండల పరిధిలోని వెలుగొండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పీఎంశ్రీ కింద చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

**భూభారతి రెవెన్యూ దరఖాస్తుపై క్షేత్రస్థాయి విచారణలో కలెక్టర్**

చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారూర్ గ్రామానికి చెందిన 10 మంది రైతులు రెవెన్యూ రికార్డులో భూమి తమ పేరిట ఎక్కలేదని భూభారతి రెవెన్యూ సదస్సులో అర్జీ పెట్టుకున్నారు. 201 సర్వే నెంబర్‌లో 7 ఎకరాల 26 గుంటల భూమికి సంబంధించి వారు పెట్టుకున్న అర్జీకి సంబంధించి కలెక్టర్ బుధవారం క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన కలెక్టర్‌కు వెల్టూరు గ్రామ ప్రజలు తమ గ్రామంలో మద్యపానం నిషేధం కొరకు తీర్మానం చేసినట్లు కలెక్టర్‌కు తెలియజేశారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ కే.శ్రీనివాస్, స్థానిక మండల నాయకులు కళ్యాణ్ రావు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# కళలను ప్రోత్సహించడం ద్వారా మరింత అవకాశాలు

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా కవులకు కళాకారులకు కళలకు, మరియు సంస్కృతికి పుట్టినిల్లు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అనేక మంది కవులు, కళాకారులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని, యువత తమ ప్రతిభను మరింత పదును పెట్టుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి అని ఆయన పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు కళలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే మీడియా ప్రతినిధులను ఉద్దేశించి, ఇలాంటి సామాజిక కార్యక్రమాలను, ప్రతిభను వెలికితీసే ఇలాంటి వేదికలను సామాజిక బాధ్యతగా భావించి సేవా భావంతో ప్రచారం చేయాలని ఆయన సూచించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, అధికారులు, యువజన శాఖ ప్రతినిధులు, కళల విభాగ గురువులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలో ఈనెల 12 నుంచి 19 వరకు నిర్వహించే వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి వయో వృద్ధుల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 12 నుంచి 19 వారం రోజుల పాటు వారోత్సవాలు కొనసాగుతాయని ఆమె తెలిపారు. జిల్లాలోని వయోవృద్ధులు వారోత్సవాలలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌వో రషీద్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శైలజ, ఎఫ్ఆర్ఓ సాయి, డిసిపివో కరిష్మా పాల్గొన్నారు. 19న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహణతో వారోత్సవాలు ముగుస్తాయని ఎఫ్ఆర్ఓ సాయి తెలిపారు.

**పిఎం కేర్ చిల్డ్రన్స్ తో కలెక్టర్ సమీక్ష**

కోవిడ్ 19 కారణంగా తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన పిల్లలకు పిఎం కేర్స్ కింద ప్రతి మూడు నెలలకు ఒక సారి నిర్వహించే సమీక్షలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి నారాయణపేట జిల్లాలో పీఎం కేర్‌లో ఉన్న ఇద్దరు పిల్లలకు సంబంధించిన సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లల ఆరోగ్యం, విద్య, రక్షణకు సంబంధించిన అంశాలపై స్వయంగా ఆ పిల్లలనే అడిగి తెలుసుకున్నారు. వారి యోగ క్షేమాల గురించి అడిగారు. అలాగే పి.ఎం. కేర్స్ కింద పిల్లలకు వస్తున్న బెనిఫిట్స్‌కి సంబంధించి జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్‌లో గల జిల్లా కలెక్టర్, చైల్డ్ పేర్లపై ఉన్న ఉమ్మడి ఖాతాలను ఒకసారి చెక్ చేయమని, పిల్లల తండ్రి పేరు మీద ఉన్న పట్టా భూమిని పిల్లల పేర్లపై పట్టా అయ్యేలా చూడమని, స్పాన్సర్షిప్ యొక్క గైడ్‌లైన్స్‌ను అనుసరించి పిల్లలకు డీసీపీ వో కరిష్మాకు సూచించారు. స్పాన్సర్షిప్ ఇచ్చే అవకాశాలు ఉంటే చూడాలని, తరచుగా పిల్లల రక్షణకు సంబంధించి ఫాలో అప్ చేస్తూ పిల్లల స్టేటస్‌ను అప్‌డేట్ చేయాలని డి.సి.పి.ఓ. ను ఆదేశించారు.



## దివ్యాంగులు, వృద్ధుల సమస్యలపై ప్రత్యేక ప్రజావాణి

### దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** వృద్ధులు, దివ్యాంగులు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో గతంలో వచ్చిన పెండింగ్ దరఖాస్తుల వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన రెండవ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి ఆమె వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను శ్రద్ధగా విని, ఫిర్యాదులను స్వీకరించి, మొదటి ప్రాధాన్యతగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా 20 మంది దివ్యాంగులు ఏడుగురు వృద్ధులు తమ సమస్యల వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని వారం రోజులు నిర్వహించే కార్యక్రమాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, నాగభూషణం, రాజసింహుడు, శివ్వన్న, పంతులు, ఆంజయ్యాచారి, పాండురంగం, నాగేంద్రస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సిఐ సహకారంతో రోడ్డు మరమ్మతులు



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** వనపర్తి జిల్లా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సమీపంలో రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బంది కలగడం, వాహనదారులకు ప్రమాదాలు జరగడంతో ఆత్మకూరు సిఐ శివకుమార్ స్పందించి బుధవారం కంకరతో గుంతలను పూడ్చడం, మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు నందిమల్ల ఎక్స్ రోడ్డు నుండి, రేవులపల్లి వరకు రోడ్డు దెబ్బ తినడం జరిగిందని, ఈ రహదారికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, గద్వాల నారాయణపేట ప్రాంతాల నుండి చాలా వాహనదారులు ప్రయాణించడం వలన రోడ్డు దెబ్బతిన్నదని, రోడ్డు ఇలా ఉండటం వలన ప్రమాదం నా కళ్ళముందే జరిగిందని చలించిపోయి, ఈ మరమ్మత్తులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రహదారి మరమ్మత్తులకు ప్రభుత్వం 30 లక్షలు మంజూరు చేసిందని త్వరలోనే పూర్తిస్థాయి మరమ్మత్తులు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. వాహనదారులు సిఐకి అభినందనలు తెలిపారు.

## క్షుద్రపూజలు చేస్తానని నమ్మించి అమాయకులకు వల




ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాకేంద్రంలో ఇద్దరు మహిళలు పథకం ప్రకారం పూజ స్టోర్ నుంచి నకిలీ నాణాలు, బంగారు పూత పూసిన బిల్లలు, తావీదులు సేకరించి మాకు పూనకం వస్తుంది, మైసమ్మ పూజలు, క్షుద్రపూజలు చేస్తామని అమాయక ప్రజలను బురిడి కొట్టించి నమ్మించి మోసంచేశారని జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ జిల్లాకేంద్రంలోని ఎస్‌పి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడూరు మండలం అంతారం గ్రామానికి చెందిన అలివేల (36) గత మూడు సంవత్సరాలక్రితం అంతారం గ్రామంనుండి నాగర్‌కర్నూల్‌కి వచ్చి స్థిరపడి, నాకు దైవశక్తులు ఉన్నాయి. నాకు పూనకం వస్తుందని, మైసమ్మపూజలు, క్షుద్రపూజలు చేస్తానని ప్రజలను నమ్మబలికించి, ఆరోగ్యంబాగాలేనివారిని, ఇతర సమస్యలతో ఉన్నవారిని టార్గెట్‌చేసి తనను ఆశ్రయించిన వ్యక్తులకు పూజలుచేసి వారిని ఆరోగ్యపరుస్తానని నమ్మబలికేది. వారి ఇళ్లల్లో, పొలాల్లో బంగారునిధులు ఉన్నాయని దాన్ని తీసివేస్తే అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని తెలుపుతుండేది. అందుకు పూజలకోసం డబ్బులు చెల్లించాలని నమ్మించేది. ఇదేక్రమంలో తనవద్దకు పూజలకోసం వచ్చిన మరో నిందితురాలు వికారాబాద్ నుండి వచ్చిన అనిత(33) అలివేలకు పరిచయం కావడంతో ఇద్దరు కలిసి ప్రజలను పూజల పేరుతో మోసం చేయాలని నిర్ణయించుకొని వారు ముందుగా అనుకున్న ప్రణాళిక ప్రకారం డబ్బులు ఇచ్చిన బాధితులను నమ్మించడానికి బంగారు పూత పూసిన నకిలీ నాణాలు, బిళ్లలు, పూజస్టోర్‌లో నుంచి కొనుగోలు చేసి బాధితులవద్ద డబ్బులు తీసుకొని ఈ నకిలీ నాణాలను వారికి సంబంధించిన ప్రాంతాలలో ముందుగానే పాతిపెట్టి పూజలు చేసినట్లు నటించి బాధితులను మోసం చేసి డబ్బులు దండుకున్నారు. మోసాలలో భాగంగానే నేరస్తురాలు అలివేల, అనితలు కలిసి నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన శ్రీరామ్ సాగర్ నుండి రూ.4లక్షలు, శ్రీపురం గ్రామానికి చెందిన నిరంజన్ నుండి రూ.2లక్షల 50వేలు, వీరితోపాటు ఇంకొంతమంది బాధితుల నుండి డబ్బులు వసూలు చేశారన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై నిఘా ఉంచి పట్టుకున్న అనంతరం వారి ఇళ్లనుసోదా చేయగా నిందితురాళ్ల దగ్గర నకిలీ బంగారుపూత పూసిన నాణాలు, 1160బిళ్లలు (ఒకవైపు లక్ష్మి దేవి బొమ్మ మరొకవైపు శ్రీచక్రం ఉన్నవి) దొరికాయి. తాయెత్తులు 2ప్యాకెట్లు, కొన్ని ఎర్రబట్టలు, ఒకకుండ, రూ.7లక్షల 50వేలు స్వాధీనం చేసుకొని రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఇలాంటి మోసాలను నమ్మవద్దని, క్షుద్రపూజలవెనక ఆర్థికమోసందాగి ఉంటుందని, అత్యాశకు పోయి గుప్తనిధుల ద్వారా బంగారం తీస్తామని చెప్పి మోసంచేసేవారి మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని హెచ్చరించారు.

## మంచి ప్రవర్తన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : సమాజంలో మంచి ప్రవర్తన కలిగి ఉండాలని డీసీపీ అక్షాంశ్ యాదవ్ రౌడీషీటర్లకు సూచించారు. ప్రతినెల రౌడీషీటర్లకు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో బుధవారం జిల్లాలోని రౌడీషీటర్లకు మంచి ప్రవర్తన పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ రౌడీ షీటర్ తన ప్రవర్తన మార్చుకొని ప్రజలతో మమేకంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే సేవలు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో పాల్గొన్న కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి రాహుల్ రెడ్డి, పట్టణ సీఐ రమేష్, చంద్రబాబు, అర్జునయ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రూప మృతి కాంగ్రెస్‌కి తీరని లోటు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే దుబ్బ రూప అకాల మృతి బాధాకరమని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇటీవల మృతి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప చిత్రపటానికి బుధవారం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బ రూప కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సేవలో అహర్నిశలు కృషి చేశారని మంత్రి గుర్తుచేశారు.ఆమె మృతి పార్టీకి, ఆమె కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ గౌడ్ ఉన్నారు.



## సిఐటియు నుండి ఎఐటియుసిలోకి చేరికలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (మఠంపల్లి)** : మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో పలువురు కార్మిక నాయకులు సిఐటియు జిల్లా కమిటి సభ్యులు సయ్యద్ రనుమియా సిఐటియు నుండి ఏఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ వారిని సాధరంగా ఆహ్వానించి ఏఐటియుసి కండువాలను కప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పైన నిరంతరం పోరాటం చేయాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. స్థానిక సిమెంట్ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ కార్మికులు, హమాలీ సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయితీ కార్మికులకు కనీస వేతన సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటియుసి మండల అధ్యక్షులు సన్నగండ్ల చిన్నజాను నాయకత్వంలో గ్రామ పంచాయితీ కార్మికులు కందుకూరు నాగమణి, కందుకూరి వెంకటేశ్వర్లు, సామేలు, పూల సంఘం నాయకులు కందుకూరి మోష, కాటేపల్లి యేసు, కోటయ్య, విశ్వరాజుల రంగరాజు, గోపిశెట్టి చెంచయ్య తదితరులు ఏఐటియుసిలో చేరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉప్పతల నాగయ్య, పొందుగల జాన్సు, చనగండ్ల పెద్దజాను, పొందుగల చందు, బూసినేటి సాంబశివ, పాల సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

## కెజిబివిలో విద్యుత్ నిర్లక్ష్యం...



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : మండలంలోని కంచనపల్లి గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో గత మూడు రోజులుగా కరెంటు లేక వాటర్ రాకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాలను సందర్శించి ఎస్ఓతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం లేకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే డీఈవోకి, ఎంఈఓకి ఫోన్లో మాట్లాడడానికి ప్రయత్నం చేస్తే ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపైన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఓ లోపటికి వెళ్లడానికి పర్మిషన్ ఇవ్వలేదని ఇప్పటివరకు తాత్కాలికంగా కరెంట్ పనులు పూర్తి జరిగాయని ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, జిల్లా నాయకులు తరుణ్, మండల నాయకులు చేరుకు నాని, సాయి, బన్నీ పాల్గొన్నారు.

## మాల ధారణ తీసేసి బడికి రావాలే

### పలివెల పాఠశాలలో ఆంజనేయ స్వామి మాల ధారణ బాలుడికి అవమానం



**ప్రజాపక్షం/మునుగోడు:** ఆంజనేయస్వామి మాలధరించిన 10వ తరగతి విద్యార్థిని ఆంజనేయస్వామి మాల బట్టలు ఇంటిదగ్గర పెట్టి స్కూల్ యూనిఫామ్ వేసుకొని రావాలని తెలుగు ఉపాధ్యాయుడు ఆంజనేయ స్వామి మాల ధరించిన బాలుని అవమానించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పలివెల ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మాల ధరించిన బాలుడిని మాల బట్టలు తీసేసి స్కూలు యూనిఫామ్ వేసుకొని రావాలని చెప్పడంతో ఆ గ్రామంలో మాల ధరించిన అంజనేయ స్వాములు స్కూల్ ఆవరణంలో హిందూ మతాన్ని హేళన చేసి హిందూ ధర్మాన్ని అవమానపరిచేలా మాట్లాడిన ఉపాధ్యాయుని పై చర్యలు తీసుకోవాలని క్షమాపణ చెప్పాలని ఆంజనేయస్వామి భక్తులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఆంజనేయ స్వామి భక్తులతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడి సర్ది చెప్పి క్షమాపణ చెప్పారు.

## బిఆర్ఎస్‌ను తిట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏం చేస్తోంది?

### ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం/నల్లగొండ:** బిఆర్ఎస్ పాలన బాగాలేదని తాము అధికారం లోకి వస్తే మంచి పాలన అందిస్తామని బిఆర్ఎస్ ను తిట్టి తిట్టి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం చేస్తుందని తెలంగాణ జాగృతి అధ్య క్షురాలు,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించింది. తెలంగాణ వచ్చాక మన నీళ్లు మనకు వస్తాయని అందరం అనుకున్నాం.కానీ నల్లగొండ జిల్లాకు కృష్ణా నీళ్లు పూర్తి స్థాయిలో వచ్చాయో లేదో అందరం ఆలోచించాలన్నారు. బుధవారం నల్లగొండలోని మనోరమ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడుతూఎస్ఎల్ బీసీ,నక్కలగండి,డిండి ప్రాజెక్ట్ లతో జిల్లాకు నీళ్లు రావాలి కానీ జిల్లాకు నీళ్లు అంటే కృష్ణానది మీదనే ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితి మరి బిఆర్ఎస్ పదేళ్లు,కాంగ్రెస్ రెండేళ్లు పన్నెండేళ్లలో కృష్ణానది నీళ్లు తెచ్చుకున్నామా ఆలోచన పరులు ఆలోచించాలన్నారు. బిఆర్ఎస్‌ను ఇదే అంశంలో విమర్శించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు పనులు చేయటం లేదు అని ప్రశ్నించారు.ఇప్పటికైన కృష్ణా నది నీళ్లు తేవటంలో సీఎం రేవంత్ రెడి ఇలాగే అలసత్వం వహిస్తే నిర్వాసితులతో కలిసి ఆయన ఇంటి ముందు ధర్నా చేస్తాం అని హెచ్చరించారు. నల్లగొండ జిల్లా అంటేనే ఎంతో చరిత్ర కలిగిన జిల్లా అని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలు,ప్రజాఉద్యమాలు, విప్లవాత్మక ఆలోచనలు కలిగిన ప్రాంతమన్నారు. ఈ సందర్భంగా నల్లగొండప్రభుత్వసుపత్రిలో ప్రసూతి వార్డ్‌కు వెళ్లడం జరిగిందని అక్కడ ఒక్కో బెడ్ మీద ఇద్దరు పేషెంట్లను,పిల్లలను పడుకోబెట్టారని డాక్టర్లు, నర్సుల ఓపికకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని సౌకర్యాలు లేకపోయినా వారు పని చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/గరిడేపల్లి** : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల మేలుకోరి పేదవారు కడుపు నిండా తినేలా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి నూతనరేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందజేస్తున్నామని వివరించారు. గరిడేపల్లి మండలంలో పలు రోడ్ల నిర్మాణాలకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. గడ్డిపల్లి గ్రామంలో గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల వరకు రూ. 8.28 కోట్లతో బిటి డబల్ రోడ్డు నిర్మాణ పనులకు, పొనుగోడు గ్రామంలో పొనుగోడు పాతబస్టాండ్ నుండి మెయిన్ రోడ్డు వరకు రూ. 50 లక్షలతో నిర్మించే 700 మీటర్ల రోడ్డుకు, పొనుగోడు గ్రామం నుండి అప్పన్నపేట వరకు రూ.3.15 కోట్లతో 4.5 కి.మీ.ల బిటి రోడ్డు నిర్మాణానికి, మల్లయ్యగూడెం గ్రామంలో మల్లయ్యగూడెం నుండి పాత నేరేడుచర్ల వరకు రూ.70లక్షలతో నిర్మించే బిడి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గరిడేపల్లి మండల కేంద్రంలో గరిడేపల్లి నుండి అలింగాపురం వరకు 15.5 కి.మీ. దూరాన్ని రూ.30కోట్లతో నిర్మించిన డబుల్ బిటి రోడ్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఈ రోడ్డు కి.మీ.కు రూ.2కోట్ల చొప్పున మొత్తం రూ.30కోట్లతో నాణ్యతతో నిర్మించామని అన్నారు. రైతులు ట్రాక్టర్స్ కెజివీల్స్‌తో రోడ్డుపై వెళ్ళకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని కోరారు. గరిడేపల్లి మండలంలో రూ.200కోట్లతో గడ్డిపల్లిలో యంగ్ ఇండియా రెసిడెన్సీయల్ స్కూల్, కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిని, పలు రోడ్లు నిర్మించి గరిడేపల్లి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు పొనుగోడు చెరువులో ఉచిత చేపల పంపిణీ పథకాన్ని ప్రారంభించి చేప పిల్లలను చెరువులోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ, ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, పిఆర్ ఈఈ వెంకటయ్య, డిఈ రమేష్, మత్స్యశాఖ అధికారి నాగులు నాయక్ పాల్గొన్నారు.

### అన్నదాతలకు అండగా ఉంటాం

అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గరిడేపల్లి మండలం, గడ్డిపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. మొంథా తుఫాన్ వల్ల రాష్ట్రంలో అధిక వర్షాలు కురవడంతో ధాన్యం తడిచిందని, తడిచిన ధాన్యాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.



## 14 నుండి జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లా గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 14 నుండి 20 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 14న భారతదేశపు మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, 15న పుస్తకాల ప్రదర్శన, రీడింగ్ అవర్, 16న గ్రంథాలయ అవగాహన కార్యక్రమం, 17న ధ్యానం, వ్యక్తిత్వ వికాస, సైబర్ నేరాల నివారణ కార్యక్రమం, 18న చిత్రలేఖన పోటీలు, నా గ్రంథాలయం నాకు ప్రోత్సా హం, 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జ యంతి ఉత్సవాలు, ముగ్గుల పోటీలు, ఆటలు, 20న అక్షరాస్యత దినోత్సవం, వారోత్సవాల ము గింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదా నం తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపా రు. ఉత్సవాలకు విద్యార్థులు, పట్టణ పుర ప ముఖులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## పారదర్శకమైన పాలనకు సమాచార హక్కు చట్టం

### రాష్ట్ర సమాచార కమిషనర్ పోరెడ్డి అయోధ్య రెడ్డి




**ప్రజాపక్షం/యాదాద్రి** : సమాచార హక్కు చట్టం RTI2005ను పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు, సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం పై రాష్ట్ర సమాచార కమిషనర్ల ఆధ్వర్యంలో పీఐవో, అపిలెట్ అధికారులకు చట్టం పట్ల నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు దేశాల భూపాల్, పి.వి శ్రీనివాస్ రావు, మోసినా పర్వీన్, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిసిపి అక్షాంక్ష్ యాదవ్, ఏసిపి రాహుల్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా RTI కమిషనర్ అయోధ్య రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద సమాచారం అడిగిన వాళ్లను దోషిగా చూడాలని లేదన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన సమాచారం తప్పకుండా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగే హక్కు ఉందన్నారు. పాలనలో పారదర్శకత కోసమే 2005లో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో 41బి చార్ట్‌ను తప్పనిసరిగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి ఏమీ లేని విధంగా చెయ్యాలనే ఉద్దేశంతో జిల్లాలో పర్యటిస్తున్నామని 15 జిల్లాలో పర్యటించి అప్పటికప్పుడే పరిష్కారం అయ్యే విధంగా చేస్తున్నామన్నారు. 6(1) కింద దరఖాసుదారుడు కోరిన సమాచారం అందించాలన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంత రావు మాట్లడుతూ సమాచార హక్కు చట్టం నిజాయితీగా, పారదర్శకంగా, నిక్పక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కమిషన్ పని చేస్తుందన్నారు. సమాచారం కోరిన వ్యక్తికి నిర్దేశిత వ్యవధిలో కాకుండా ముందుగానే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలోని అందరూ పీఐవో అధికారులు యాక్ట్ నిబంధనల ప్రకారం సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం కమిషనర్లను శాలువ, మెమొంటోలతో కలెక్టర్ సత్కరించారు. సమావేశ అనంతరం పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులపై విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు, దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఆర్డిఓ కృష్ణా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, వివిధ శాఖల పిఐఓలు, ఏపిఐఓలు, అప్పీలెట్ అధికారులు పాల్గొన్నారు.



## 17న డిండికి బస్సుజాత : పల్లా

**ప్రజాపక్షం/డిండి:** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ 100 ఏళ్ల ముగింపు బహిరంగ సభకు పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి అన్నారు. బుధవారం డిండి సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ సిపిఐ వందేళ్ళ ముగింపు బహిరంగ సభ ఖమ్మంలో జరగనుందని, రాష్ట్ర వ్యాప్తంగా 3 జాతలు బయలుదేరింది ఉన్నాయని నవంబర్ 15 నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతలు రాష్ట్ర వ్యాప్తంగా తిరగనున్నాయని నల్గొండ జిల్లాలో 17 నుండి ప్రవేశించనుందని ఈ జాతకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నర్సింహా, సిపిఐ ఎంఎల్‌సి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం ఆధ్వర్యంలో నవంబర్ 15న గద్వాల నుండి ప్రారంభమై 17న డిండి కి చేరనుందని తెలిపారు. గ్రామశాఖలో ప్రధానంగా మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థులు భాగస్వామ్యం అయ్యేలా కమిటిలను ఏర్పాటు చేయాలని సూచించారు.సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లే శైలేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి విజయేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, హుస్సేన్, కేశవులు, శ్రీనయ్య, వెంకటేశ్వర్లు, లచ్చయ్య, శాఖ కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, శివ, చక్రి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్ పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి అన్నారు. పట్టణంలోని 28వ వార్డు జెజె నగర్ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలకు తాత్కాలిక ఇబ్బందులు ఉంటాయని ఇందుకుగాను ప్రజలు సహకరించాలని కోరారు. అనుమతి లేకుండా ఎవరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరిస్తూ, డివియేషన్ లేకుండా నిర్మాణాలు జరపాలని సూచించారు. రోడ్లపై ర్యాంపులు నిర్మించడం చట్టవిరుద్ధమని, ఈ విషయంలో అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, శానటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డు ఆఫీసర్ నస్రత్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

## వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం 2025 వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ విసి చాంబర్లో బుధవారం మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవ వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించి సీనియర్ సిటిజన్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. నవంబర్ 12 నుండి 19 వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పోస్టర్లను ఆవిష్కరించడం, 2వ రోజు జిల్లా స్థాయిలో వృద్ధుల చట్టాలపై ఆరోగ్యం, చురుకైన వృద్ధాప్యం పై అవగాహన కార్యక్రమం చేపట్టాలన్నారు. 3వ రోజు వృద్ధాశ్రమాల్లో ఆటల పోటీలు వినోద కార్యక్రమాలు, 4వ రోజు వాకథాన్ సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. 5వ రోజు జిల్లా స్థాయిలో వయో వృద్ధుల చట్టం 2007 పై అవగాహన ఏర్పాటు చేయాలని, 6వ రోజు గ్రామస్థాయిలో సర్పంచ్, ఇతర ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు, ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, 7వ రోజు జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో వయోవృద్ధుల కొరకు ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించాలని సీనియర్ సిటిజన్ యాక్ట్‌పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. 1 నవంబర్ 2025 నుండి 31 జనవరి 2026 వరకు బాల్య వివాహాల నిర్మూలనకై 100 రోజుల ప్రచారోద్యమం గోడ పత్రికను ఆవిష్కరించారు. బాల్యవివాహాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే చైల్డ్‌లైన్ 1098కు తెలియజేయాలని విషయాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె నరసింహారావు, వయో వృద్ధుల కమిటి మెంబర్స్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, సభ్యులు, జి విద్యాసాగర్, ఎస్‌డి హమీద్‌ఖాన్, బోళ్ళ రాంబాబు, గజ్జల కృష్ణారెడ్డి, కిరణ్మయి, జావీద్‌ఖాన్, వినోద్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంకర్లు సహకరించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం స్వామిది సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రుణాల విషయంలో బ్యాంకర్లు సహకరించాలని మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.15వేలు రుణం అయిపోయిన తరువాత రూ.25వేలు ఆ తరువాత రూ.50వేల రుణాలు వీధి విక్రయదారులకు విడిగా సమయానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది బకాయిలో ఉన్న లోన్లు విషయాలు కూడా పూర్తిగా రికవరి చేయాలన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఉన్న వీది విక్రయదారులు అర్హత ఉండి ఇంకా అప్లయ్ చేసుకోని వారు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా సెక్షన్‌లో అప్లయ్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా కోఆర్డినేటర్ కె.శివాజీనాయక్, టీఎంసీ బక్కయ్య, సీవోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



# ఖరీదైన బైకులే లక్ష్యంగా దొంగతనాలు..

### ఇద్దరు నిందితులు అరెస్టు... 26 బైకులు స్వాధీనం..
### తప్పులు చేస్తే ఏనాటికైనా జైలు శిక్ష తప్పదు : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : జలసాలకు అలవాటు పడి డబ్బుల కోసం ఖరీదైన బైకులే లక్ష్యంగా దొంగతనాలు చేస్తున్న ఇద్దరి నిందితులను సూర్యాపేట 2వ పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 20లక్షల విలువైన 26 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్‌పి వెల్లడించారు. సూర్యాపేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖమ్మం ఎక్స్ రోడ్డులో బుధవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్ తన టీంతో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా వెళ్తుండగా, అతనిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. అతని ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్వర్క్ సిస్టం ద్వారా అతని యొక్క వేలిముద్రలు తనిఖీ చేయగా వేమూరి కృష్ణపై సుమారు 150 బైక్ దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా సూర్యాపేట పట్టణంతోపాటు ఖమ్మం, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా పరిధిలో, హైదరాబాద్, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని పలు ప్రాంతాలలో ఖరీదైన బైక్‌లే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేసినట్లు మొత్తం 26 మోటార్ సైకిళ్ళను దొంగలించినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. తనతోపాటు నకిరేకల్‌కు చెందిన శివకుమార్ అనే వ్యక్తితో కలిసి దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. శివకుమార్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో సెక్యూరిటి గార్డు పనిచేస్తూ, చుట్టు పక్కల వారికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వాహనాల రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నానని నమ్మించి ప్రజలను మభ్యపెడుతూ ఇతరులకు బైకులను అమ్మేవారని తెలిపారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 26 బైక్‌లు స్వాధీనం చేసుకొని కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారికైనా జైలు శిక్షలు తప్పవని చట్టం నుండి ఎవరు తప్పించుకోలేరని పౌరులు చట్టానికి లోబడి నేరాలకు పాల్పడకుండా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ సురేష్, పట్టణ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# క్రీడ

## భారత జట్టులో చోటు కావాలంటే
# దేశవాళీ క్రికెట్ ఆడండి!
### విరాట్, రోహిత్‌లకు బిసిసిఐ సందేశం



భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇద్దరు దిగ్గజ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు స్పష్టమైన సందేశాన్ని పంపింది. వన్డే జట్టులో కొనసాగాలనుకుంటే దేశీయ వన్డే టోర్నమెంట్లలో పాల్గొనాలని బోర్డు చెప్పింది. ఇద్దరు సీనియర్స్ టెస్ట్, టీ20 అంతర్జాతీయ ఫార్మాట్ల నుంచి రిటైర్ అయ్యారు. ఇద్దరు వన్డే జట్టులో మాత్రమే ఆడుతున్నారు. దాంతో బోర్డు, జట్టు టీమ్ మేనేజ్‌మెంట్ దేశీయ క్రికెట్‌లో ఫిట్‌నెస్, ఫామ్‌ను నిరూపించుకోవాలని చెప్పింది.

**విజయ్ హజారే ట్రోఫీతో..**

ఓ నివేదిక ప్రకారం.. ఈ దిశలో తొలి అడుగు డిసెంబర్ 24న విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ జరుగనున్నది. డిసెంబర్ 3 నుంచి 9 వరకు జరుగనున్న దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్, జనవరి 11న ప్రారంభమయ్యే న్యూజిలాండ్ సిరీస్ మధ్య దేశీయ క్యాలెండర్‌లో ఈ మ్యాచ్ పెద్దికి వన్డే. రోహిత్ శర్మ విజయ్ హజారే ట్రోఫీకి అందుబాటులో ఉంటానని ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కి తెలియజేసినట్లు సమాచారం. అయితే, విరాట్ కోహ్లీ విషయంలో మాత్రం స్పష్టత లేదు.

**జట్టులో కొనసాగేందుకు..**

ఓ సీనియర్ బిసిసిఐ అధికారి ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడుతూ.. భారత్ తరఫున ఆడాలనుకుంటే.. దేశీయ క్రికెట్‌లో ఆడాలని బోర్డు, జట్టు నిర్వహణ వారిద్దరికీ స్పష్టం చేసింది. రెండు ఫార్మాట్ల నుంచి రిటైర్ అయినందున.. ఫిట్‌నెస్, లయను కాపాడుకోవడానికి ఇది చాలా అవసరమని చెప్పారు. గత నెలలో సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ సైతం ఆటగాళ్లు దేశీయ క్రికెట్‌లో పాల్గొనాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆటగాళ్లు అందుబాటులో ఉన్నప్పుడల్లా దేశీయ క్రికెట్ ఆడాలని ముందే స్పష్టం చేశామన్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ క్రికెట్ నుంచి సుదీర్ఘ విరామం ఉన్నప్పుడు.. మిమ్మల్ని మీరు ఫామ్‌ను ప్రదర్శించేందుకు ఇదే మార్గమన్నారు.

**సన్నాహాలు మొదలుపెట్టిన రోహిత్..**

ఈ నెల 26న మొదలుకానున్న ముష్తాక్ అలీ టీ20 టోర్నీలో రోహిత్ పాల్గొనే అవకాశం ఉంది. ఇందు కోసం ముంబయిలోని శరద్ పవార్ ఇండోర్ అకాడమీలో ప్రాక్టీస్ మొదలుపెడుతున్నాడు. ప్రస్తుతం కోహ్లీ లండన్‌లో ఉన్నాడు. త్వరలో దేశీయ సర్క్యూట్‌లో ఆడాలని బోర్డు ఆశిస్తోంది. ఇద్దరు గత సీజన్‌లో ఇద్దరూ ఒక్కో రంజీ మ్యాచ్‌లో ఆడిన విషయం తెలిసిందే. జనవరిలో కోహ్లీ 12 సంవత్సరాల తర్వాత ఢిల్లీ తరఫున, రోహిత్ పది సంవత్సరాల తర్వాత ముంబయి తరఫున ఆడారు. ఆ సమయంలో రోహిత్ మాట్లాడుతూ టెస్ట్ క్రికెట్‌ను క్రమం తప్పకుండా ఆడడం ప్రారంభించిన 2019 నుంచి దేశీయ క్రికెట్‌లో ఆడేందుకు చాలా తక్కువ సమయం మాత్రమే దొరికిందని.. ఏదైనా పోటీవున్నా ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడిన తర్వాత కొంత విశ్రాంతి అవసరమన్నాడు. కానీ, ప్రస్తుతం ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు చెప్పాడు.

**2027 ప్రపంచ కప్ కోసం..**

టయర్స్‌లో కోహ్లీ, రోహిత్ పేర్లు పరిశీలనలో లేవని సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశారు. ఇద్దరు ఆటగాళ్లు ట్రోఫీల్లోనే కాదని.. పరుగుల్లో కూడా భారత క్రికెట్ కోసం చాలా చేశారన్నారు. రాబోయే ప్రపంచకప్ (2027) వరకు ఇంకా చాలా దూరం ఉందని.. వారు ఓ ఫార్మాట్‌లో ఆడుతూ సుదీర్ఘ విరామం తర్వాత దేశీయ మ్యాచ్‌లు ఆడుతూ ఉంటే వారి పరిస్థితిని అంచనా వేస్తూనే ఉంటామన్నారు. 2027 నాటికి అనేక మార్పులు సాధ్యమేనని, అది కోహ్లీ, రోహిత్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని, అప్పటికి చాలా మంది యువ ఆటగాళ్ల పరిస్థితి కూడా మారవచ్చని అగార్కర్ స్పష్టం చేశారు.

అనుభవం, ఫామ్ మధ్య సమతుల్యత కోరుకుంటూ బీసీసీఐ ఈ చొరవ, బోర్డు ప్రస్తుతం అనుభవం, ప్రదర్శన మధ్య సమతుల్యత బోర్డు భావిస్తుంది. దేశీయ క్రికెట్‌లో పాల్గొనడం వల్ల ఆటగాళ్ల ఫిట్‌నెస్, టెక్నిక్ పరీక్షిస్తుంది.. అయితే ఇది యువ ఆటగాళ్లకు పేర్లు, ప్రదర్శనలు, మీ స్థానాన్ని నిర్ణయిస్తాయని సందేశాన్ని పంపుతుందని బిసిసిఐ భావిస్తుంది. కోహ్లీ, రోహిత్‌కు, దేశీయ క్రికెట్‌కు తిరిగి కేవలం లాంఛనప్రాయం కాకుండా.. ఇది వారి ఫామ్, భవిష్యత్తుకు కీలకంగా మారే అవకాశం ఉంది.

## అండర్-19 టోర్నీకి
# ఇద్దరు హైదరాబాదీలు
### జట్లను ప్రకటించిన బిసిసిఐ






బిసిసిఐ త్వరలో ప్రారంభం కానున్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అండర్-19 ముక్కోణపు సిరీస్ కోసం ఇండియా-ఎ, ఇండియా-బీ జట్లను ప్రకటించింది. ఈ టోర్నీ నవంబర్ 17 నుంచి 30 వరకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగనున్నది. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్ అండర్-19 జట్టు కూడా పాల్గొంటుంది. వచ్చే ఏడాది జరుగనున్న ఐసీసీ అండర్19 ప్రపంచ కప్ సెలక్షన్‌కు ముందు యువ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఈ టోర్నీ వేదిక కానున్నది.

పంజాబ్ బ్యాటర్ విహాన్ మల్హోత్రాను ఏ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు.. ముంబయికి చెందిన అభిజ్ఞాన్ కుందును వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. బీ జట్టుకు హైదరాబాద్‌కు చెందిన ఆరోన్ జార్జ్ కెప్టెన్‌గా, గుజరాత్‌కు చెందిన వేదాంత్ త్రివేది వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. టీమిండియా మాజీ హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ తనయుడు అన్వే ద్రవిడ్‌కు సైతం బీ జట్టులోకి చోటు దక్కింది. ఏ జట్టులో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ మాలిక్‌కు చోటు దక్కింది. నాంపల్లి మల్లెపల్లికి చెందిన ఈ యువ ఆటగాడు వినూ మన్కడ్ ట్రోఫీలో తన ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన ఆటగాడిగా నిలిచాడు.

ఈ అద్భుత ప్రదర్శనతో మాలిక్‌కు అండర్-19 ఏ జట్టులో చోటు దక్కింది. ఈ సందర్భంగా మహ్మద్ మాలిక్ మాట్లాడుతూ అండర్-19 జట్టుకు ఎంపిక వడం గౌరవంగా ఉందని.. భవిష్యత్తులో భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని మాలిక్ తెలిపాడు. మాలిక్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అతను భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మహ్మద్ మాలిక్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

**అండర్-19ఎ జట్టు :** విహాన్ మల్హోత్రా (కెప్టెన్), అభిజ్ఞాన్ కుందు (వైస్ కెప్టెన్), వాఫీ కచ్చి, వంశ్ ఆచార్య, వినీత్ వీకే, లక్ష్య రాయ్‌చందానీ, ఏ రాహిల్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ ఎ పటేల్, అన్మోల్‌జీత్ సింగ్, హెనిల్ పటేల్, ఆశుతోష్ మహీదా, ఆదిత్య రావత్, మహమ్మద్ మాలిక్.


**అండర్-19 బి జట్టు :** ఆరోన్ జార్జ్ (కెప్టెన్), వేదాంత్ త్రివేది (వైస్ కెప్టెన్), యువరాజ్ గోహిల్, మౌల్యరాజ్‌సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, హర్వాన్ష్ సింగ్, అన్వే ద్రవిడ్ ఆర్ఎస్ అంబరీష్, బీకే కిషోర్, నమన్ పుష్పక్, హేమ్చుదేశన్ జె, ఉదవ్ మోహన్, ఇషాన్ సూద్, డీ దీపేష్, రోహిత్ కుమార్ దాస్.

# ఫోకస్




## నాలుగు సామ్రాజ్యాలు.. నాలుగు అంతస్థులు..

ఇస్తాంబుల్‌లోని ఫతీ జిల్లాలో ఉన్న ఓ నాలుగు అంతస్థుల భవనం ప్రపంచంలో మరే ఇతర భవనాలకు లేని ప్రత్యేకతను కలిగి ఉంది. అరుదైన గుర్తింపును సంపాదించింది. దీనిని 'నాలుగు అంతస్థుల చారిత్రక భవనం'గా పేర్కొంటారు. రోమన్, బైజెంటైన్ ఒట్టోమన్, టర్కిష్ గణతంత్రం అనే నాలుగు చారిత్రిక కాలాలకు చెందిన నిర్మాణ శైలులను ప్రతిబింబిస్తుంది. అంతేగాక, అనేక సామ్రాజ్యాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ నాలుగు అంతస్థుల భవనంలో మొత్తం 19 గదులు ఉన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌కు రోమన్ సామ్రాజ్యం కాలంలో నిర్మించిన ఓ సిస్టర్న్‌కు 1,800 సంవత్సరాల చరిత్ర ఉంది. దానిపైన ఉన్న అంతస్థు బైజెంటైన్ కాలం నాటి నిర్మాణం. ఆపైన ఒట్టోమన్ సామ్రాజ్య కాలంలో (పురాతన నిర్మాణ శైలి). చివరిగా టర్కిష్ గణతంత్రం కాలంలో (నూతన నిర్మాణ శైలి) ప్రతిబింబిస్తుంది. వివిధ సామ్రాజ్య కాలాలను ఒకచోట నిలిపే ఈ నిర్మాణాన్ని చూసేందుకు పర్యాటకులు భారీగా తరలి వస్తుంటారు. సాధారణంగా, ఇలాంటి చారిత్రిక 'లేయర్' లేదా 'హోయుక్' రూపంలో ఉంటాయి. కానీ, ఇక్కడ అది భవనంగా కనిపిస్తుంది. అందుకే దీనిని పొరపాటుగా ప్రసిద్ధి చెందిన భవనంగా కొంతమంది అభివర్ణిస్తుంటారు. అయితే, ఈ విమర్శలను, అనుమానాలను పట్టించుకోని పర్యాటకులు ఇస్తాంబుల్ వస్తూనే ఉన్నారు. ఈ భవనాన్ని చూస్తూనే ఉన్నారు.



## 'కాహోకియా'లో గొప్ప వైద్యం!



అమెరికాలోని ఆధునిక సెయింట్ లూయిస్, మిసోరి సమీపంలోని కాహోకియా అనే పెద్ద నగరం క్రీస్తు శకం 1050 నుండి 1200 మధ్యకాలంలో ఉండేది. చరిత్రకారుల అధ్యయనాల ప్రకారం ఇక్కడ వేలాది మంది జనం నివసించేవారు. ఇక్కడి పెద్ద ఎత్తైన మట్టి టెంట్లు, విస్తారమైన వేదికల మధ్య, వైద్యులు ఉండేవారు. చాలా సందర్భాలలో వీరు బయటకు కనిపించేవారు కాదు. ఈ వైద్యులు వివిధ మొక్కలపై, ప్రత్యేకించి మొక్కజొన్నలపై విస్తారమైన పరిశోధనలు చేసి, అద్భుత పరిజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. స్థానిక మొక్కలలోని సుమారు 200 రకాల వైద్య లక్షణాలను గుర్తించారు. వాటిని ఉపయోగించి చికిత్సలు అందించారు. పురావస్తు ఆధారాలు, పురాతన పరికరాలపై మిగిలిన అవశేషాలు, వీరి ఉపయోగంలో వయిలోలు చర్మం (సలిసిలిక్ ఆమ్లం సహజ మూలం), కాన్‌ఫ్లవర్ (ఇచినాసియా) వంటి మొక్కలులను వైరస్ వ్యాధుల చికిత్సకు వినియోగించినట్టు తెలుస్తోంది. ఆ కాలంలో వైద్యులు కేవలం మందులు ఇవ్వడమే గాక, చిన్నచిన్న శస్త్రచికిత్సలు కూడా చేసేవారని అక్కడ లభించిన గుర్తులు స్పష్టం చేస్తున్నాయి. వీరు భౌతిక చికిత్సలతో పాటు ఆధ్యాత్మిక శ్రద్ధలు, విధులు నిర్వహించి, మిస్సిసిపియన్ సంస్కృతుల్లో సాధారణమైన ఆధ్యాత్మిక, శారీరక ఆరోగ్యం సమన్వయాన్ని సాధించారు. ఈ వైద్యులు కాహోకియా నగరంలో ప్రజారోగ్యాన్ని నిలుపుకునేందుకు ముఖ్యమైన పాత్ర పోషించారని, అటువంటి ఒక పరిణత వైద్య వ్యవస్థ యూరోపియన్ సంపర్కానికి ముందుగా ఉందని, వ్యాధులు, గాయాలను ఎదుర్కొనే సృజనాత్మకత, విచక్షణలో ప్రావీణ్యాన్ని చూపించేవారని రుజువు చేసే సాక్ష్యాలు ఇక్కడ లభించాయి.



# ఆకలి విలువ..



చరిత్ర మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఆహారాన్ని విచక్షణా రహితంగా పారవేసేవారికి ఈ ఫొటో కనువిప్పు కావాలి. 1931లో ఏర్పడిన మహామాంద్యం కారణంగా అమెరికా ఆకలితో అల్లాడిపోయింది. న్యూయార్క్ నగరంలో ఒక చిన్న బ్రెడ్డు.. కప్పు పాల కోసం స్త్రీపురుష భేదం లేకుండా క్యూలో బారులు తీరి, తమ వంతు కోసం ఎదురుచూస్తున్న అన్నార్తులు వీరు. అక్కడ మంచుగాలి గుసగులాడుతుంటే, ఆకలితో కడుపు నకనకలాడుతున్న దృశ్యం కనిపిస్తుంది. ఒకప్పుడు ఎన్నో కలలు.. మరెన్నో ఆశలతో పరుగులు తీసిన కాళ్లు ఒక్కసారిగా 'బ్రెడ్‌లైన్స్'వైపు పరుగులు తీశాయి. ఒకరికొకరు తెలిసినా, తెలియకపోయినా, ఆకలి మాత్రం అందరినీ ఒకేలా పట్టిపీడించింది. అహం... గౌరవం.. ఆత్మాభిమానం వంటి పదాలకు అక్కడ అర్థం లేదు. సంపదల సింహాసనాలు కూలిపోయాయి. ఆకలి, బాధ కలగలసి, ఒకే క్యూలో నిలిచాయి. ఒక రొట్టె కోసం పడే తపన, జీవించాలనే వారి కోరికను వ్యక్తపరుస్తుంది. అందరిలోనూ ఆవేదన, అదే సమయంలో, భవిష్యత్తు మెరుగుపడుతుందనే ఓ చిన్ని ఆశ. ఈ క్యూలలో ప్రతి ముఖం ఒక గాథ. ప్రతి చూపు ఒక వ్యథ. ప్రతి వరుస, బతుకు పోరాటం. అంతటి కష్టంలోనూ, మనం ఒంటరివాళ్లం కాదని, ఆకలి అందరినీ ఒక్కటి చేసిందనే సంతృప్తి. ఒకరికోసం ఒకరు నిలబడి.. ఆకలి పంచుకున్న హృదయాలు అక్కడ ఆవిష్కృతమవుతున్నాయి. నాటి బాధను, ప్రజల కష్టాలను గుర్తు చేసుకుంటే, ఆహారం వృథా ఎంత ఘోరమో తెలుస్తుంది. నాటి పరిస్థితి నేటి సమాజానికి పాఠం నేర్పుతుంది.



## జోడేఘాట్ నుంచి బస్సు యాత్ర
### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** జోడేఘాట్ నుంచి కొమురంభీం స్ఫూర్తితో ఈ నెల 15న సిపిఐ బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బస్సు యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో, రాష్ట్ర సాధనలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం పార్టీ సాగించిన ఉద్యమాలను, భూస్వాముల నుండి లక్షల ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిన చరిత్రను ప్రస్తావించారు. ఈ నెల 15న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్ నుంచి బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బస్సుయాత్ర ముగింపు సభను డిసెంబర్ 26న ఖమ్మంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముడుపు నళిని రెడ్డి, నాయకులు కుంటాల రాములు, కుమార్, బహబూబ్‌ఖాన్, సలీం, రమేష్, మెస్రం భీంరావు, సురేష్, ఎస్ అరుణ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, కర్షక, బడుగుల ఆశాజ్యోతి సిపిఐ : సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కార్మిక, కర్షకుల, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సిపిఐ పార్టీ అని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం శతాబ్ది ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించి అనంతరం సదానందం మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో బడుగు, బలహీనవర్గాల జీవన విధానం మరింత క్లిష్టతరంగా మారిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో మైనార్టీలు, క్రిస్టియన్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచడానికి సిపిఐ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ఉత్సవాలకు పెద్దపెల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పూసాల రమేష్, పట్టణ కార్యదర్శి కల్లపల్లి నవీన్ కుమార్, చంద్రగిరి ఉదయ్, పేర్క సతీష్, మాచర్ల అంజి, తగరం నరేష్, సురేష్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడుతున్న రైస్‌మిల్లర్లపై చర్యలు

### సిపిఐ డిమాండ్
### కలెక్టరేట్ ఎదుట ధర్నా






**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలో రైస్ మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని, అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ రైస్ మిల్లర్లు రైతులను తరుగు, తాలు, రవాణా పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సంవత్సర కాలం నుంచి సిఎంఆర్ పెట్టకుండా అట్టి ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లులను నెలకోసారి పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామా ల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తరుగులేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులకు గన్నీ బ్యాగులను అవసరం మేరకు అందించాలని, సరిపడా లారీలను ఏర్పా టు చేసి రవాణా సమస్య రాకుండా చూడాలని, మొంథా వర్షాలకు దెబ్బతిన్న ధాన్యాన్ని కొను గోలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పార్టీ నాయకులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, మద్దెల ఎల్లేశ్, ఎదునూరి వెంకటరాజం, నేదునూరి రాజమౌళి, కర్రె లక్ష్మ ణ్, కొట్టేపాక రవి,మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, యేషబోయిన శ్రీనివాస్, అలువాల రాజు, రాజేందర్, దొమ్మాటి ప్రవీణ్, జూకంటి పద్మ, కొట్టె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడం బాధాకరం

**భువనగిరి రూరల్ :** నెలలు గడుస్తున్నా పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం రైతు సంఘం యాదాద్రి జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం నాయకులు జక్కా దయాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అయన మాట్లాడుతూ ఇప్పటికైనా మదర్ డైరీ విజయ డైరీ 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు చెల్లించాలని, లేనియెడల పాడి రైతులను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వరి ధాన్యాన్ని కేంద్రాలలో పోసి నెల గడిచిన తూకం వేయకపోవడంతో కల్లాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికీ 25 శా తం కూడా ధాన్యాన్ని తరలించలేదన్నారు. వర్షాలకు కల్లాల వద్ద ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని, కొనుగోలు కేంద్రాలలో కాంటా లు వేగవంతం చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఎలగందుల అంజయ్య, పేర బోయిన బంగారు, తెడ్డు ఆంజనేయులు, పల్లె మల్లారెడ్డి, సంఘం గణేష్, భీమగాని గాలయ్య, దాసరి లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి
### ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో
### ఉగ్రవాదుల దిష్టిబొమ్మ బొమ్మ దహనం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉగ్రవాదాన్ని కూకటి వెళ్లతో అంతమొందించాలని, ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్ర హోం మంత్రిత్వశాఖ నియంత్రణ లో ఉన్నాయని చెప్పిన అమిత్‌షా ఇంతటి ఘోరం జరుగుతున్నా ఇంటిలిజెన్స్, నేషనల్ ఇంలిజెన్స్ ఏజెన్సీ తదితర విభాగాలు నిద్రావస్థలో ఉండటం శోచనీయమన్నారు.ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ. 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పోటు పూర్ణ చందర్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, గోపి, ఉపేందర్, చరణ్ సాయి, ప్రణయ్, కుమార్, సలీం, ఇస్మాయిల్, అబీద్, సుమంత్, జాఫర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



## వందేండ్ల వేడుకను ఉత్సాహభరితంగా జరుపుకుందాం
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు
### బాగం హేమంతరావు పిలుపు




**ప్రజాపక్షం/పాల్వంచ :** ఖమ్మం కేంద్రంగా డిసెంబర్ 26న జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ను ఉత్సాహపూరిత, ఉల్లాస భరిత వాతావరణంలో జరుపుకొందామని, ఇందుకు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణ పరిధి దివ్యాంగుల కాలనీలోని లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానికి ముందే కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) దేశ స్వతంత్ర సంగ్రామంలో తనదైన పాత్ర పోషించిందన్నారు. నాటి నుండి నేటి వరకు పేదలు, బడుగుబలహీన వర్గాలకు ఎర్రజెండా అండగా ఉందన్నారు. భారతగడ్డపై వందేండ్లు పూర్తి చేసుకున్న పార్టీ కేవలం భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు చేసే పార్టీలను ఎన్నేండ్ల వరకైనా ప్రజలు ఆదరిస్తారని అందుకు సిపిఐ పార్టీయే నిదర్శనమన్నారు. ఖమ్మం కేంద్రంగా జరిగే శతవసంతాల ముగింపు సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు తరలిరానున్నారని, కవులు, కళాకారులు, మేధావులు ఈ వేడుకల్లో పాల్పంచుకొంటున్నారని తెలిపారు. జిల్లా నుండి 3000 మంది రెడ్‌షర్ట్ వలంటీర్లను కవాతు కోసం సిద్ధం చేస్తున్నామని, దీనికోసం జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాలలో శిక్షణా శిభిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా మాట్లాడుతూ పార్టీ శాతాబ్ది వేడుకల ముగింపు సంధర్భంగా ఐదులక్షల మందితో భారీ జనసభ జరుగనుందని చెప్పారు. ముగింపు కార్యక్రమాన్ని పురష్కరించుకొని జిల్లావ్యాప్తంగా జీపు జాతాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. సిపిఐ చరిత్ర, పోరాటాలను తెలిపే విధంగా ఇంటింటి ప్రచారం, నిధి సమీకరణ సాగుతుందన్నారు. బహిరంగసభకు కార్మికులు, కర్షకులు, మేధావులు, వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్యా దస్రు, కమటం వెంకటేశ్వర్లు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మువ్వా వెంకటేశ్వర్లు, అడ్డగర్ల తాతాజీ, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## ఆలయ ప్రహరీగోడ నిర్మాణానికి 2.50 లక్షలు అందజేత



ప్రజాపక్షం/చర్లపల్లి: చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబిక దేవి సమేత మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రహరీగోడ నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 2 లక్షల 50 వేల రూపాయలు విరాళాన్ని కమిటీ సభ్యులకు బిఆర్‌ఎస్ నాయకులు మహేష్‌గౌడ్ అందజేశారు.ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, లక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## 14న జరిగే మానవహారం కార్యక్రమానికి సహకరించాలి

### గంజాయి వ్యతిరేక కమిటీ నాయకులు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : గంజాయి వ్యతిరేక కమిటీ నాయకులు బుధవారం జగద్గిరిగుట్ట పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేష్‌ను కలిసి ఈ నెల 14న జరిగే మానవహారం కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ అధికారులు, స్థానిక బస్తీ కమిటీల ఆధ్వర్యంలో అన్ని బస్తీలలో గంజాయి వ్యతిరేక సమావేశాలు నిర్వహించాలని, అదేవిధంగా ఈ నెల బాలల దినోత్సవం సందర్భంగా అన్ని బస్తీల కమిటీల నాయకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, విద్యార్థులతో కలిసి మానవహారాన్ని నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని అందరికి ఐక్య సందేశం ఇవ్వాలని కోరారు. సిఐ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, కాంగ్రెస్ నాయకులు సాయి పంతులు, బిఆర్ఎస్ నాయకుడు సాజిద్, జనసేన నాయకులు సతీష్, లెనిన్ నగర్ నాయకులు సదానందం, సాయిలు, రాజు, రవీందర్, శ్రీనివాస్ నగర్ ఖయూమ్, మైసమ్మ నగర్ బ్రహ్మానంద చారీ, ప్రజానాట్య మండలి బాబు, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ చారి, బీరప్ప నగర్ చారీ దేవమ్మ బస్తీ వంశీ, తదితరులు పాల్గొన్నారు.



## బొంగునూరి కిషోర్ రెడ్డిని కలిసిన అంబేద్కర్ సంఘం నాయకులు

ప్రజాపక్షం/దుండిగల్ : కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగు నూరి కిషోర్ రెడ్డిని రాష్ట్ర అంబేద్కర్ సంఘం అధ్యక్షులు డి.రాములు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులు డి.రాములు మాట్లాడుతూ, గండి మైసమ్మ చౌరస్తా వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ స్థాపన కోసం గతం నుంచి ప్రతిపాదన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చి చర్చించి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అంబేద్కర్ సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఇందారపు ఎల్లయ్య, ఉపాధ్యక్షులు ఆంధ్ర రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద శ్రీనివాస్, దుండిగల్ మండల అధ్యక్షులు కావాలి మల్లేష్, ప్రచార కార్యదర్శి కట్ట దాసు, దుండిగల్ అధ్యక్షులు బిక్షపతి, డి. పోచంపల్లి బిసి విభాగం బోయిని కృష్ణ యాదవ్, రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు డి.పోచంపల్లిలోని ఆయన కార్యాలయం వద్ద అంగరంగ వైభవంగా అభిమానులు నాయకులు కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి. మహేష్, వై.ఉమామహేశ్వర్, సమీర్ తేజ, అరవింద్, వెంకట్, నరేష్, కరీం, హరీష్, హరిదాస్, నూర్, తదితరులు పాల్గొన్నారు.



## రేస్‌వాక్ ఈవెంట్‌కు ఎండి మస్తాన్ ఎంపిక

ప్రజాపక్షం/శామీర్‌పేట:తెలంగాణ మైనార్టి జూనియర్ కళాశాల మేడ్చల్ బాయ్స్ అండర్ 19 విభాగంలో 5 వేల మీటర్ల రేస్‌వాక్ ఈవెంట్‌కు బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎండి మస్తాన్ ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఎండి మస్తాన్‌ను కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజుబుద్దిన్, జడ్పి సిఇవొ కాంతమ్మలు అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ కృష్ణ మాట్లాడుతూ నవంబర్ 26న హర్యానాలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో ఎండి మస్తాన్ పాల్గొంటారని చెప్పారు. అలాగే ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న బి. జశ్వంత్ అండర్ 17 విభాగంలో జింఖాన గ్రౌండ్స్‌లో ఎస్‌జిఎఫ్ఐ రాష్ట్రస్థాయిలో నిర్వహించే 5వేల మీటర్స్ రేస్‌వాక్ ఈవెంట్‌లో నవంబర్ 15వ తేదీన జరిగే క్రీడల్లో పాల్గొంటారని అన్నారు. కోఆర్డినేటర్ నర్సారెడ్డి, పాఠశాల పిడి. సురేందర్, పిఇటి వెంకటేష్, పాఠశాల కోఆర్డినేటర్ రాజు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ముజుబుద్దిన్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు.

## ఇద్దరు గుర్తు తెలియని వృద్ధులు మృతి

ప్రజాపక్షం/చర్లపల్లి: గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహలక్ష్మి నగర్ బస్టాప్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(85) కొంతకాలంగా యాచిస్తూ బతుకుతున్నాడని, సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. అదే విధంగా చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో మరో వృద్ధుడు(75)బుధవారం మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



# రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

సి.ఎస్. రామకృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి హైదరాబాద్ నగర పర్యటనల నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించారు. ఈ రెండు కార్యక్రమాలలో అన్ని సంబంధిత శాఖల అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా ప్రతి ఏర్పాటును స్వయంగా పర్యవేక్షించాలని, ప్రస్తుత పరిస్థితులల్లో భద్రతాపరంగా మరింత శ్రద్ధతో ఏర్పాట్లు చేయాలని సిఎస్ కోరారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో కార్యక్రమ నిర్వహణకు సంబంధిత నిర్వహకులు ఉప రాష్ట్రపతి కార్యాలయం అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. రాజ్‌భవన్‌లో ఏర్పా ట్లు, సన్నద్ధతపై అవసరమైన చర్యలు తీసుకోవాలని రాజ్‌భవన్ జాయింట్ సెక్రెటరీని కోరారు. మిలటరీ, ఎయిర్‌పోర్టు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరా రు. రెండు కార్యక్రమాలలో ప్రోటోకాల్, భద్రత ఏర్పాట్లు సజావుగా ఉండాలని, కార్యక్రమానికి ముందు రోజున ఎఎస్ఎల్, ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించాలని అధికారులను కోరారు.

ఈ సమీక్షా సమావేశంలో డిజిపి శివధర్‌రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, అదనపు డిజిపిలు విజయ్ కుమార్, మహేష్ భగవత్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సిహెచ్.ప్రియాంక, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, ప్రోటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య, రామోజీ ఫిల్మ్ సిటీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటన వివరాలు**

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ఈ నెల 16న మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. రాజ్ భవన్‌లో స్వల్ప విశ్రాంతి అనంతరం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు.

రాత్రి 8 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి న్యూఢిల్లీకి వెళతారు. రాష్ట్రపతి ఈ నెల 21న మధ్యాహ్నం బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. రాజ్ భవన్ లో స్వల్ప విరామం అనంత రం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రాత్రి రాజ్‌భవన్‌లో బస చేసి 22న ఉదయం పుట్టపర్తి పర్యటనకు వెళతారని అధికారులు వివరించారు.

## హైడ్రా వచ్చినా ఆగని అక్రమ కట్టడాలు

* దర్గాగా సారెగూడెం గంగన్న ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు
* జాడలేని ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు



ప్రజాపక్షం/దుండిగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం చెరువులు కుంటలు కట్టు కాలువలు నాలా లు కబ్జాలకు గురి కాకుండా చెరువులను రక్షించుకోవాలని హైడ్రాను ప్రభుత్వం తీసుకొచ్చిన కొందరు కేటు గాళ్లు చెరువులను కుంటలను చెరబడుతున్నారు. వివరాల్లోకి వెళితే దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని సారెగూడెం గంగన్న కుంట ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. చెరువులు, కుంటలు కబ్జాలు జరుగుతున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. చెరువులు, కుంటలలో నిర్మాణాలు చేపట్టకూడదని ప్రభుత్వం, హైడ్రా అదే విధంగా సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసి న అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారు లు నిర్లక్ష్యానికి విలువైన భూములు కనుమరుగై పోతున్నాయి. సర్వేనెంబర్ 276 కుంట విస్తీర్ణ రెండు ఎకరాల10 ఉండడంతో, కొందరు 100 గజాలు ప్లాట్లు చేసి 25 లక్షల నుంచి 20 లక్షల వరకు అమ్ముతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం లేదు ఇప్పటికైనా హైడ్రా ఉన్నతాధికారులు గంగన్న కుంటపై దృష్టి సారించి కబ్జాల గురి కాకుండా కాపాడాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు.

## సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

### రైతు స్వరాజ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలతో రైతుకు తీవ్రంగా జరుగుతున్న నష్టాలతో పాటు మార్కెటింగ్ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని రైతు స్వరాజ్య వేదిక డిమాండ్ చేసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్రంలోని పలు జిల్లాల రైతు సంఘాల నేతలతో పాటు రైతులు పాల్గొని తమ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో వేల ఎకరాల్లో పంట నష్టపోతున్న రైతులకు కనీస సహాయ సహకారాలు అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతు స్వరాజ్య వేదిక నాయకులు మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలు, కరువు కారణంగా ప్రతి ఏటా రైతులు దాదాపు రూ.4.5 వేల కోట్లు నష్టపోతున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు తెలంగాణ రైతులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా దాదాపు రూ.37 వేల కోట్లు నష్టపోయారని వివరించారు. రైతు ప్రతినిధి కనుగంటి రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్ధతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీలకు వందల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు రైతులను మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు.

పండించిన పంటను విక్రయించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ కా పాస్ యాప్ లాంటివి సాంకేతికంగా రైతులను ఇబ్బం ది పెట్టడానికే ఉందని, ప్రయోజనం లేని పనులు మానుకుని వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో పంటలను కొనుగోలు చేయాలని కోరారు.

## నేటి నుండి 19 వరకు వృద్ధులకు ప్రోత్సాహక కార్యక్రమాలు

ప్రజాపక్షం/చర్లపల్లి: మేడ్చల్ జిల్లాలో వృద్ధులను చైతన్య పర్చుటకు అవగాహన కార్యక్ర మం 13వ తేదీ నుండి 19వ తేదీ నుండి వారం రోజులు దివ్యాంగుల,ట్రాన్స్‌జెండర్స్,సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆవిష్కరించారు.వారం రోజులపాటు వృద్ధులకోసం అవగాహన వారిని చైతన్య పర్చుటకు, ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, వృద్ధులు చురుకుగా పాల్గొని వారి అనుభవాలను పంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, జిల్లా సంక్షేమ అధికారి శారద, సీనియర్ సిటిజన్స్, తదితరులు పాల్గొన్నారు.





## కాలనీ అభివృద్ధిలో నా సహాయ సహకారాలు ఎల్లప్పడు ఉంటాయి

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: కాలనీ అభివృద్ధిలో నా సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. బుధవారం 128 చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానందని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యు లు కలిసికట్టుగా ఉంటూ కాలనీలోని సమస్యలను పరిష్కరించుకుంటూ కాలనీ ప్రగతివైపుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రషీదా మహమ్మద్ రఫీ, నూతన అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, బిసు వెంకటేష్, రామకృష్ణ, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, నాగభూషణం, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు


ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపాలిటి లక్ష్మాపూర్‌లోని శ్రీమరకత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే శివుడికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి తమ్మలి నాగరాజు, పండితుడు నందగిరి ఉపేందర్‌రావు, తమ్మలి రమేష్‌లు సత్యనారాయణ వ్రతాలను గణపతి పూజతో మొదలుపెట్టి సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో జరిపించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సింగం సంజీవ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ క్యాతం రవి, శ్రీరాముల గుట్ట ప్రధాన కార్యదర్శి లగిశెట్టి అరుణ్ పటేల్, భక్తులు పాల్గొన్నారు.



## అనంతపద్మనాభ స్వామిని దర్శించుకున్న కలెక్టర్

ప్రజాపక్షం/వికారాబాద్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామిని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌లతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు పూర్ణ కుంభంతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకొని తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ మంగీలాల్, ఆర్‌డిఒ వాసుచంద్ర తహసీల్దార్ లక్ష్మి నారాయణ, అలయ ఇఒ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం... విద్యార్థికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/వికారాబాద్ : వికారాబాద్ మున్సిపల్‌లోని గంగారం ప్రభుత్వప్రాథమిక పాఠశాల బయట ఎలాంటి రక్షణ కంచ లేకుండా 33కెవి ట్రాన్స్‌ఫారం పాఠశాల ప్రహరీ గోడకు అనుకొని ఉండటంతో ఈ పాఠశాలలో చదువుతున్నా 3వ తరగతి విద్యార్థి వంశీ మధ్యాహ్నం ప్రభుత్వ పాఠశాల గోడకు ఆనుకొని ఉన్న 33ట్రాన్స్‌ఫారం వైర్లు అనుకోకుండా తగిలి చేతులు కాళ్లు కాలడమే కాకుండా తలకు గాయాలయ్యాయి. ముక్కనుండి రక్తం కారుతుండగా పాఠశాల సిబ్బంది, స్థానికులు వెంటనే స్పందించి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ డాక్టర్లు లేకపోవడంతో, చిన్నపిల్లలకు సంబంధించిన సదుపాయాలు ఆస్పత్రిలో లేకపోవడంతో జిల్లా మండల అధికారితో మాట్లాడి స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంలో మెరుగైన వైద్యం అందించాలని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి తల్లిదండ్రులు లేరు నానమ్మ ఉన్నా వయస్సు మీదపడటంతో ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంది. ఈ విద్యార్థికి ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు.ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ప్రజాపక్షం/శామీర్‌పేట: రైతులకు ఎస్‌ఎంఎఎం పథకం ద్వార సబ్సిడీపై పనిముట్లు అందుబాటులో ఉన్నాయని శామీర్‌పేట మండ ల వ్యవసాయాధికారి రమేష్ అన్నారు. బుధవారం ఆయన ఓ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ రోటేవేటర్ 36 బ్లేడ్స్ పూర్తి ధర రూ. 1,27,500 ఉండగా సబ్సిడీ రూ.46వేలు, రైతు ధర 81,500, 42 బ్లేడ్స్ 1,34,000 సబ్సిడీ ధర రూ. 50 వేలు, రైతు ధర 84,060, తైవాన్ స్ప్రేయర్స్ 24,370 సబ్సిడీ ధర రూ.10వేలు, రైతుధర రూ.14,370ఉంది. బ్యాటరి స్ప్రేయర్ రూ.4,210, సబ్సిడి 1వేయి, రైతు ధర 3,210 ఉందని చెప్పారు. పనిముట్లు కావాల్సిన రైతులు, పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సి జిరాక్స్ కాపీలతో వ్యవసాయాధికారిని లేదా ఎఇఒను సంప్రదించాలన్నారు.

## జైలులో కొట్టుకున్న రౌడీషీటర్లు

ప్రజాపక్షం/హైదరాబాద్:చంచల్‌గూడ సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరు రౌడీషీటర్లు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు రౌడీషీటర్లను వేరు వేరు ఆసుపత్రులకు తరలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒక కేసులో పాతబస్తీకి చెందిన రౌడీషీటర్ జాబ్రి మంగళవారం రిమాండ్‌పై చంచల్‌గూడ జైలుకు వచ్చాడు. అంతకుముందే ఇదే జైలులో మరో కేసులో పాతబస్తీకి చెందిన దస్తగిరి రిమాండ్‌పై వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం జాబ్రి జైలు ఆవరణలోని ఆసుపత్రిలో చికిత్స కోసం రాగా అక్కడే ఉన్న దస్తగిరి అతన్ని గమనించాడు. ఇద్దరి మధ్య గతంలో పాత కక్షలు ఉన్నాయి. దీంతో ఆవేశానికి గురైన దస్తగిరి, జాబ్రిపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. విషయం పసిగట్టిన జాబ్రి ఎదురు దాడికి దిగాడు. ఇద్దరు ఒకరిపై ఒకరు మధ్య పది నిముషాలు కొట్టుకున్నారు. సమాచారం అందుకున్న జైలు సిబ్బంది అక్కడికి చేరుకుని ఇద్దరిని విడిపించారు. అప్పటికే ఇద్దరికి రక్తస్రావం కావడంతో జాబ్రిని గాంధీఆసుపత్రికి, దస్తగిరిని ఉస్మానియా ఆసుపత్రికి వేరువేరుగా చికిత్స నిమిత్తం తరలించారు.ఈ విషయంపై జైలు వర్గాలను సంప్రదించగా గొడవపై ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.



## కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన పోలీసు అధికారుల సంఘం

ప్రజాపక్షం/హైదరాబాద్:తెలంగాణ డిజిపి బి.శివధర్‌రెడ్డిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను పోలీసు అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం సంఘం అధ్యక్షుడు వై.గోపిరెడ్డి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. కెటిఆర్ ఒక టివి ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డిజిపి ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అసభ్యకరంగా, అనుచితంగా, అనాగరికంగా ఉన్నాయని గోపిరెడ్డి పేర్కొన్నారు. డిజిపి నాయకత్వంలో ఎన్నడూ లేనంత అప్రమత్తతతో తెలంగాణ పోలీసు పని చేస్తున్న విషయం ప్రజలకు తెలుసున్నారు.తాము చట్టానికి, ప్రజలకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా పని చేస్తుందని, శాంతి భద్రతలు కాపాడడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పోలీసుల పనితీరులో ఆక్షేపించవలసింది ఏమీ లేదన్నారు. ఒకవేళ ప్రశ్నించవలసివచ్చినా సంస్కారయుతంగా, సభ్యతతో ప్రశ్నించాలని ఆయన అన్నారు.




## నవీన్ గెలుపునకు కమ్మ సంఘాల కృషి

ప్రజాపక్షం/హైదరాబాద్ : భవిష్యత్తులో కమ్మ సామాజిక వర్గానికి మంచి కార్యక్రమాలు చేపడుతూ వారికి అండగా ఉంటామని సిఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపునకు 60 సంఘాలు కలిసికట్టుగా పనిచేశాయని కమ్మ సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొడ్డుపల్లి రవిశంకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాఖ్య ప్రతినిధులు గంగవరపు రామకృష్ణ ప్రసాద్, ఉన్నం సుబ్బారావు, బొబ్బ రంగారావుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇకముందు జరగబోయే అభివృద్ధి కార్యక్రమాల్లో కమ్మ సంఘాలు ప్రభుత్వం వెన్నంటే ఉంటాయని తెలిపారు. 14న కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో తాము భాగస్వాములవుతామన్నారు.

# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు త్వరగా చేసుకోవాలి



ప్రజాపక్షం/యాచారం : లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపిడిఓ రాధారాణి కోరారు. బుధవారం మండల పరిధిలోని నందివనపర్తి, మంథన్ గౌరేల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. నందివనపర్తి గ్రామంలో నూతనంగా మంజూరు అయిన 10 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రోసిడింగ్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అమలౌతున్న ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## క్రీడలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి

ఎల్‌బినగర్ జోన్ ఏసిపి కృష్ణయ్యగౌడ్

ప్రజాపక్షం/ఎల్ బినగర్: క్రీడాస్ఫూర్తి విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని ఎల్‌బినగర్ జోనల్ ఏసిపి కృష్ణయ్య గౌడ్ అన్నారు. బుధవారం నారాయణ వనస్థలిపురం జోన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌పిఎల్ (నారాయణ ప్రీమియర్ లీగ్) క్రీడా పోటీలను ఏసిపి కృష్ణయ్యగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడం కోసం నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నారాయణ విద్యాసంస్థల తెలంగాణ జిఎం గోపాలరెడ్డి మాట్లుడుతూ క్రీడల్లో గెలుపొందడమే కాదు.. క్రీడల్లో పాల్గొనడం చాలా ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో వనస్థలిపురం జోన్ ఎజిఎం రవీంద్రబాబు, జోన్ పరిధిలో ఫలక్ నూమా స్కూల్ ప్రిన్సిపాల్ నౌషిన్ ఫాతిమా, మీర్పేట్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ బాజ్జీ, జల్పల్లి ప్రిన్సిపాల్ రవికుమార్, కొత్తపేట్ ప్రిన్సిపాల్ మాధవి, వనస్థలిపురం ప్రిన్సిపాల్స్ భూపనేస్వరి, నాగరాణి, హయత్ నగర్ ప్రిన్సిపాల్స్ లావణ్య, మానసలతో పాటు, ఆయా బ్రాంచీల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఏసిపి కృష్ణయ్యగౌడ్ క్రీడాజ్యోతిని వెలిగించి, బెలూన్స్‌ని గాలిలోకి వదిలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన విద్యార్థుల మార్చ్ పాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.



## మూడేళ్ల చిన్నారిపై వీధి కుక్కల దాడి



ప్రజాపక్షం/షాద్‌నగర్: చిన్నారి బాలుడిపై వీధి కుక్కల గుంపు దాడి చేయడంతో ఎడమ కన్ను కోల్పోయిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం నాగులపల్లి గ్రామానికి చెందిన జ్యోతి, జనార్ధన్ దంపతుల కుమారుడు రీత్విక్ (3) అనే బాలుడు ఇంట్లో అడుకుంటూ బయటకు వచ్చిన నేపథ్యంలోనే వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో ఆ చిన్నారి రోదనలు మిన్నంటిపోయాయి. చుట్టు పక్కల వాళ్ళు చూసి వచ్చే సరికే బాలుడి ఎడమ కన్ను తీవ్రంగా గాయపడిందని వివరించారు. దాంతో హుటాహుటిన హైద్రాబాద్‌లోని సరోజిని కంటి ఆసుపత్రికి తీసుకువెళ్ళి వైద్యం చేయించగా ఎడమ కన్ను పూర్తిగా కంటిచూపు కోల్పోయిందని వైద్యులు చెప్పడంతో ఆ బాలుడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇతర ప్రాంతాల నుండి కుక్కలను తీసుకువచ్చి తమ ప్రాంతంలో వదలివెళ్లడంతోనే అవి మనుషులపై దాడి చేసేందుకు వస్తున్నాయని తల్లిదండ్రులు వివరించారు. వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. తమ బాలుడు మూడేళ్ల వయస్సులోనే కన్ను కోల్పోవడం దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలను హరించకముందే వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేనిపక్షంతో ఇలాంటి మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

ప్రజాపక్షం/యాచారం : రైతులు ధాన్యం కోనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకారసంఘం డిసిసిబి చైర్మేన్ కోత్తకుర్మ సత్తయ్య అన్నారు.బుధవారం యాచారం మండల పరిధిలోని యాచారం, నందివనపర్తి, చింతపట్ల, మంథనిగౌరేల్లి గ్రామాల్లో వరి ధాన్యం కోనుగోలు కేంద్రాలను అయన ప్రారంభించారు. ఈసందర్భంగా డిసిసిబి చైర్మేన్ సత్తయ్య మాట్లాడుతూ రైతులు అరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ధాన్యం కోనుగోలు కేందాల్లోనే విక్రయించాలన్నారు.దళారులకు ధాన్యం అమ్మి రైతులు మోస పోవద్దని తెలిపారు.వరి పంటకు క్వింటాలుకు ఎ గ్రేడ్ 2389 రూపాయలు, బిగ్రేడ్‌కు 2369 రూపాయలు చేల్లిస్తారన్నారు. క్వింటాల్ సన్నరకాలకు వడ్లకు బోనస్ 5 రూపాయలు చేల్లించడం జరుగుతుందని అన్నారు. వరిపంటను సేంటర్‌లో విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు చేల్లిస్తామన్నారు.డిసిఎంఎస్, ఐకెపి అధ్వర్యంలో ధాన్యం కోనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇబ్రహింపట్నం మార్కేట్ కమిటి చైర్మేన్ గురునాథ్‌రెడ్డి, ఎంపిడిఓ రాథరాణి, వ్యవసాయాధికారి అర్ రవినాథ్,మార్కేట్ కమిటి డైరెక్టర్ మస్కు నర్సింహ్మా,ఐకెపి ఎపిఎం రవింధర్, నాయకులు బిలకంటిశేఖర్‌రెడ్డి, జోగిరెడ్డి,ఐకెపి సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులకు అందాలు అద్దడం అభివృద్ధి కాదు...

# పూర్తి స్థాయి పునరుద్ధరణ జరగాలి


హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : చెరువుల అభివృద్ధి అంటే అందాలు అద్దడం ఒక్కటే కాదని, దాని అవసరాలు నెరవేరే విధంగా వాటిని తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఎ.విరంగనాథ్ అన్నారు. సకల జీవకోటికీ ప్రాణాధారంగా వాటిని రూపొందించాలన్నారు. చెరువుల్లో ఆక్రమణలను, పోసిన మట్టితో పాటు, కొన్నేళ్లుగా పేరుకుపోయిన పూడికను, దుర్గంధాన్నితొలగించిన తర్వాత మిగతా ఆకర్షణలపై దృష్టి పెట్టాలన్నారు. సిఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటీ) కింద చెరువులను అభివృద్ధి చేస్తున్న వారు ఈ విషయాలపై దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం బుధవారం సౌత్ ఇండియా సిఎస్ఆర్ సమ్మిట్ నిర్వహించింది. ఈ సందర్భంగా చెరువుల పునరుద్ధరణను హైడ్రా ఎలా చేపట్టిందనే విషయమై రంగనాథ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటతో పాటు నగరంలో మొదటి విడతగా చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణ గురించి వివరించారు. సిఎస్ఆర్ నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగమయ్యేలా ఆయా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల్లో వరద నీరు నిలిచేలా లోతు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గొలుసుకట్టు చెరువులకు ప్రాణాధారమైన నాలాలను కూడా పరిరక్షించుకోవాల్సినవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ అన్నారు. అప్పడే నగరంలో వరదలను నివారించగలమన్నారు. సిఎస్ఆర్ సమ్మిట్ ముఖ్య ఉద్దేశాలను ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ వివరించారు. హైడ్రాకు తమవంతు సహకారం అందిస్తామని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఖైరతాబాద్ ఛైర్మన్ ప్రొఫెసర్ డా.రమణ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల క్రీడలు విజయవంతంగా నిర్వహించాలి

హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న వయోవృద్ధుల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వృద్ధాశ్రమాలలో వృద్ధులకు సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల క్రీడా పోటీల నిర్వహించనున్నామన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని 19 వ తేదీన రవీంద్ర భారతి లో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి వయోవృద్ధులందరూ తప్పక హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు రాజేందర్, కమిటీ సభ్యులు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ గురునాథ్ చెరువుకు కొత్త శోభ

ప్రజాపక్షం/హైదరాబాద్: అతిపెద్ద రిటైల్ రియల్ ఎస్టేట్ ప్లాట్‌ఫారమ్ నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ తన ప్రధాన ఇఎస్‌జి కార్యక్రమం 'లేక్స్ ఆఫ్ హ్యాపినెస్' కింద 10వ చెరువు అయిన మియాపూర్ గురునాథ్ చెరువుకు కొత్త శోభను కలిగించారు. ఈ చెరువు పునరుద్ధరణను విజయవంతంగా పూర్తి చేసి స్థానికులకు అప్పగించారు. ఈ సందర్భంగా నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ సిఇఒ దలీప్ సేఫుల్ మాట్లాడుతూ 2022లో ప్రారంభమైన ఈ కార్యక్రమం కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న నీటి వనరులను సామూహిక భాగస్వామ్యంతో పునరుద్ధరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలోపు 15 చెరువులను దత్తత తీసుకుని పునరుద్ధరించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో మొత్తం 10 చెరువులు పునరుద్ధరించామన్నారు. వీటి వల్ల 100కు పైగా గ్రామాలలో లక్షమందికి పైగా ప్రజలు లాభం పొందారన్నారు. హైదరాబాద్ ఈ కార్యక్రమంలో ప్రధాన మైలురాయిగా నిలిచిందన్నారు. మియాపూర్‌లోని 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గురునాథ్ చెరువు పూర్తిగా పునరుద్ధరించబడిందన్నారు. వినోదం, సామాజిక కార్యక్రమాల కోసం అధికారికంగా అప్పగించామన్నారు. ఈసందర్భంగా నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ జయేన్‌నాయిక్ మాట్లాడుతూ పునరుద్ధరించిన ప్రతిచెరువు మళ్లీ తన సమాజానికి ఉపయోగకరంగా మారిందన్నారు.

## మత్స్యకారులను ఆర్థికాభివృద్ధి చేసేందుకే చేపపిల్లల పంపిణీ



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/కొత్తూరు: మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా ప్రజా పాలన ప్రభుత్వం పని చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని సాయిరెడ్డి చెరువులో 30వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అంధిస్తుందని వివరించారు.



పేదల సొంతింటి కల నేరవేర్చడమే లక్ష్యం

పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పులిచర్ళకుంట తండా సమీపంలోని కర్ణకుంట తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులు కవిత మోహన్‌లకు నూతన వస్త్రాలను అందజేసి అభినంధించారు. కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, నర్సింలు, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇద్దరి కార్మికుల మధ్య ఘర్షణ తాపి మేస్త్రీ హత్య

ప్రజాపక్షం/కొత్తూరు: ఓ వెంచర్‌లో పనిచేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య ఘర్షణే తాపిమేస్త్రీ హత్యకు కారణమైందని కొత్తూరు సిఐ నర్సయ్య వివరించారు. బుధవారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ నర్సయ్య మాట్లాడుతూ మండల పరిధిలోని ఓ వెంచర్‌లో టైల్స్ వర్కర్‌గా బిహార్ రాష్ట్రానికి చెందిన ఎండి శంసూల్ (31), ప్లాస్టరింగ్ వర్కర్‌గా ఛతీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన గంగాప్రసాద్ పని చేస్తున్నారని తెలిపారు. ఇద్దరు కార్మికుల మధ్య గొడవ ఏర్పడటమే కాకుండా గంగాప్రసాద్ భార్యపై శంసూల్ అనుమానాస్పదంగా చూస్తున్నాడనే నేపథ్యంలోనే గంగాప్రసాద్ ఈ దారుణానికి పాల్పడినట్లు సిఐ తెలిపారు. మంగళవారం శంసూల్ కిచెన్ రూపంలో నిద్రిస్తున్న సమయంలో గంగాప్రసాద్ మద్యం సేవించి వచ్చి గ్రానేట్ రాయితో తలపై మోది హత్య చేసినట్లు వివరించారు. బుధవారం పెంజర్ల రోడ్డులో అనుమాన్పాదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా ఈ హత్య తానే చేశాయనని ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ కేసును వేగంగా చేధించినందుకు ఎస్ఐలు గోపాలకృష్ణ , సత్యశీలారెడ్డి, సిబ్బంది కుమార్, రవికుమార్, మహిపాల్, హరిష్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినంధించారు.

## 14న కలెక్టరేట్‌లో 'మీ డబ్బు – మీ హక్కు' కార్యక్రమం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: వివిధ కారణాలతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం ప్రభుత్వం కల్పించిన మూడు నెలల ప్రత్యేక కార్యక్రమం "మీ డబ్బు– మీ హక్కు"లో భాగంగా నవంబర్ 14న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి శిబిరం నిర్వహించతలపెట్టినట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా "మీడబ్బు– మీహక్కు" అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థిక పరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థికమంత్రి 2025 అక్టోబర్ 4న గుజరాత్ లోని గాంధీనగర్ లో జాతీయస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇది 2025 అక్టోబర్ 01 నుంచి 2025 డిసెంబర్ 31 వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని చెప్పారు. క్లెయిమ్ చేసుకొని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్ లు, మ్యూచువల్ఫండ్స్, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ఉమ్మడి శిబిరం జరుగుతుంది. క్లెయిమ్ చేసుకొని ఆర్థికపరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు.. బ్యాంకు శాఖ,భీమాసంస్థ, మ్యూచువల్ ఫండ్స్ సంస్థ , శిభిరంలోని స్టాక్రోకరేజీ సంస్థ, ఆన్లైన్ ద్వారా స్టాక్రోకర్లలో దేనినైనా సంప్రదించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చున్నారు. అదేవిధంగా బ్యాంకుల్లో 10సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకొని డిపాజిట్ల వివరాలు ఆర్‌బిఐ ఉద్గమ్ వెబ్సైట్(https:// udgam.rbi.org. in) ద్వారా పొందొచ్చునని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

## జలాశయాల గణన అత్యంత ప్రాధాన్యం





అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ప్రజాపక్షం/రంగారెడ్డి: చిన్న నీటి వనరులు, జలాశయాల గణన ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశమని అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం 7వ చిన్న నీటి వనరుల గణన, 2023–24 గణన అమలుకు సంబంధించిన జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధ్యక్ష కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి, సంబంధిత విభాగాధికారులు, జిల్లా రెవిన్యూ అధికారి, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, విద్యుత్, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్, డిస్ట్రిక్ట్ పంచాయతీ, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సంబంధిత జిల్లా అధికారులు, ఫీల్డ్ సిబ్బంది సమన్వయంతో పని చేసి ఈ గణనను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సంగీత, సిపిఓ సౌమ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, డిఆర్‌డిఎపిడి ఎల్ శ్రీలత, డిపిఓ సురేష్ మోహన్, గ్రౌండ్ వాటర్ అధికారి మాధవరావ్, విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సమష్టిగా అవగాహన కార్యక్రమాలు

జిల్లాలోని అన్ని శాఖలు సమష్టిగా అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల, వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 12 నుండి 19వరకు "అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలతతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వయోవృద్ధుల ప్రపంచ కార్యాచరణను నడిపించే మార్గదర్శకులు, మనం, ఆకాంక్షలు, మన శ్రేయస్సు, మన హక్కులు" అనే నినాదంతో జిల్లాలోని అన్ని శాఖలు సమిష్టిగా అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. ప్రతి మండల స్థాయిలో వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, ఆరోగ్యంపై కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

# శత వసంతాల ఉత్సవ సభకు భారీగా తరలుదాం

సిపిఐ నేత పుస్తకాల నర్సింగ్‌రావు





ప్రజాపక్షం/రంగారెడ్డి: డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో రావాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి, రాజేందర్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుస్తకాల నర్సింగ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశం రాజేంద్రనగర్ సిపిఐ (ఎఆర్ దేవరాజ్ భవన్) కార్యాలయంలో స్థానిక నాయకుడు ఎంఎ రియాజ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యులు పానగంటి పర్వతాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ శత వసంతాల ఉత్సవాల ముగింపు బహిరంగ సభ విజయవంతం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రజాసంఘాల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఎక్కడైతే మనం పోటీ చేయదలుచుకున్నాము అక్కడ కార్యకర్తలు అందుబాటులో ఉండి ఇప్పటి నుంచే అభ్యర్థులు గెలిచే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలన్నారు కార్యక్రమంలో సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు కన్యగారి నర్సింహారెడ్డి, యాదగిరి, గండిపేట్ మండల కార్యదర్శి మల్లేష్, శంషాబాద్ మండల కార్యదర్శి నరగిరి, బి సి హక్కుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి యాదయ్య, జిల్లా సమితి సభ్యులు సామి, బిసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మన్నె ప్రభు, సిపిఐ నాయకులు శంకరయ్య, బాబురావు, జి.సత్యం, కాజామియా, పాండు, రాజు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : ఖమ్మంలో డిసెంబర్ 26న నిర్వహించబోయే బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయంవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర ప్రజా సంఘాల సబ్ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ న్యూ నాగోల్ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్ఎ డాంగే భవన్‌లో ఉప్పల్ మండల కౌన్సిల్ సభ్యులు ఉడుతల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి కృష్ణ ముఖ్యఅతిధిగా హాజరై ఖమ్మం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.గోపాల్, ఎస్.సైదారావు, పి.మల్లేష్, బి.రాము, కె.జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## '12ఎ రైల్వే కాలనీ' ట్రైలర్ లాంచ్

అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12ఎ రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పోలిమేర సిరీస్‌తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. తాజాగా లాంచ్ చేసిన 12ఎ రైల్వే కాలనీ ట్రైలర్ సినిమా టోన్, మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. మిస్టరీ మర్డర్స్ సిరీస్ చుట్టూ తిరిగే కథలో ప్రతి పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తుంది. ఈ ట్రైలర్ సస్పెన్స్‌ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది. మూఢనమ్మకాలు, హీరోకి ఎదురైన భయానక అనుభవాలతో పాటు వాస్తవం – మానసిక భ్రమలు మరింత థ్రిల్ ని క్రియేట్ చేశాయి. దర్శకుడు నాని కాసరగడ్డ, డా.విశ్వనాథ్ రాసిన థ్రిల్లింగ్ కథను తెరపై సస్పెన్స్‌తో ప్రజెంట్ చేశారు. 21న విడుదల కానున్న ఈ సినిమా ఆడియన్స్ కి థ్రిల్లింగ్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.

అల్లరి నరేష్ మాట్లాడుతూ..అందరికి నమస్కారం. నా సామి రంగ సక్సెస్ తర్వాత నిర్మాత శ్రీనివాస్ గారు నాతో మరో సినిమా చేయాలని అన్నారు. నచ్చిన కథ ఉంటే చూడమని చెప్పారు. తర్వాత మేము చాలా రకాల కథలు విన్నాము. తర్వాత అనిల్ దగ్గర మంచి కథ ఉందని చెప్పారు. నేను ఇప్పుడు వరకు చాలా జానర్స్ చేశాను కానీ ఇలాంటి థ్రిల్లర్స్ ఎప్పుడు చేయలేదు. ఫస్ట్ టైం ఇలాంటి జానర్ ట్రై చేస్తే బాగుంటుందనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ కామాక్షి, డైరెక్టర్ నాని, అనిల్, సంగీత దర్శకుడు భీమ్స్ పాల్గొన్నారు.

## 'మరి మరి' పాట ఆవిష్కరణ



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే అందించారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి 'మరి మరి..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఉమా వంగూరి లిరిక్స్ అందించిన ఈ పాటను సునీల్ కశ్యప్ కంపోజ్ చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే ' మరి మరి నిన్ను వెతికేలా, మరవదు ఓ క్షణమైనా, మనసంతా నీ తలపులే, ప్రతి చోటా నీ గురుతులే, వేచా గడిచిన నిన్నల్లో, వెతికా నడిచిన దారుల్లో, వెలుగే విడిచిన నీడల్లో, వదిలి వెళ్లిన జాడల్లో...'అంటూ ఎమోషనల్‌గా సాగుతుందీ పాట.



## 'కొదమసింహం' రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్

చిరంజీవి నటించిన కౌబాయ్ సినిమా ఇది. 1990, ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సాధించిన 'కొదమ సింహం' సినిమాను ఈ నెల 21వ తేదీన 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా రమా ఫిలింస్ అధినేత కైకాల నాగేశ్వర రావు రీ రిలీజ్ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా 'కొదమసింహం' రీ రిలీజ్ ట్రైలర్ లాంఛ్ చేశారు.

## 'గోపి గాళ్ళ గోవా ట్రిప్' ప్రీ రిలీజ్



రోహిత్, శశి దర్శకత్వం వహించిన గోపిగాళ్ల గోవా ట్రిప్. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న తరుణంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్కి డైరెక్టర్ రోహిత్ మమ, శశి, మ్యూజిక్ డైరెక్టర్ రవి నిడిమర్తి, ప్రొడ్యూసర్, నటుడు సాయికుమార్, రాజు శివరాత్రి, అజిత్ మోహన్, సాయి కుమార్, పవన్ రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రోహిత్ అండ్ శశి మాట్లాడుతూ.. ఈ సినిమాకి మొత్తం ముగ్గురు ప్రొడ్యూసర్లు. ఐడియా చెప్పిన 15 రోజు షూటింగ్‌లో ఉన్నాం. గద్వాల్ డిస్ట్రిక్ట్ లోని ఒక రిమోట్ విలేజ్‌లో ఈ షూటింగ్ స్టార్ట్ అయింది. ఇది ఒక రకమైన రూట్ ఫిలిం. హైవే మీద ట్రావెల్ చేస్తూ గోవా దాకా రీచ్ మధ్యలో షూటింగ్ చేసాం ఎక్కడ పర్మిషన్ లు కూడా లేవు. సినిమా తొంభై శాతం సినిమా అవుట్ డోర్ లోనే ఉంటుంది. ఇది చాలా మెమొరబుల్ షూట్ చేశామని అన్నారు.

## ప్రభాస్ @23

### రాజాసాబ్ కొత్త పోస్టర్ విడుదల



భారతీయ సినిమా కీర్తిని కొత్త శిఖరాలకు చేరుస్తున్న రెబల్ స్టార్ ప్రభాస్ నట ప్రస్థానం నేటికి 23 ఏళ్లకు చేరుకుంది. ఈశ్వర్ సినిమాతో మొదలైన ప్రభాస్ సిల్వర్ స్క్రీన్ జర్నీ బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ సక్సెస్ ఫుల్ గా కొనసాగుతోంది. 'ఈశ్వర్' తర్వాత వరుసగా 'రాఘవేంద్ర', 'వర్షం', 'అడవిరాముడు', 'చక్రం', 'ఛత్రపతి', 'పౌర్ణమి', 'యోగి', 'మున్నా', 'బుజ్జిగాడు' 'బిల్లా', 'ఏక్‌నిరంజన్', 'డార్లింగ్', 'మిస్టర్ పర్‌ఫెక్ట్', 'రెబెల్', 'మిర్చి' వరకు ప్రభాస్ జర్నీ ఒక ఫేజ్ అయితే బాహుబలితో ఆయన పాన్ ఇండియా జర్నీ బిగిన్ అయ్యింది. బాహుబలి రెండు చిత్రాల తర్వాత సాహో, సలార్, కల్కి 2898AD సినిమాలతో దిగ్విజయంగా వరుస బ్లాక్ బస్టర్స్ అందుకుంటున్నాడు. ప్రభాస్ రెండు పార్టుల(బాహుబలి 2, కల్కి 2898 ఏడి) వెయ్యి కోట్ల రూపాయల గ్రాస్ సినిమాలను ఖాతాలో వేసుకోవడం ఒక రేర్ రికార్డ్ ఓవర్సీస్ మార్కెట్‌లో పది మిలియన్ డాలర్లపైగా వసూళ్లను సాధించిన తొలి హీరోగా ప్రభాస్ నిలిచారు. ప్రభాస్ తొలి సినిమా ఈశ్వర్ 2002, నవంబర్ 11న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ రోజును రెబల్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్‌కు స్పెషల్ డేగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. రెబల్ స్టార్ నట ప్రస్థానం 23 ఏళ్లకు చేరుకున్న సందర్భాన్ని సెలబ్రేట్ చేస్తూ ఆయన కొత్త సినిమా రాజా సాబ్ నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో అల్ట్రా స్టైలిష్ లుక్‌లో సరికొత్త మేకోవర్‌లో ప్రభాస్ ఆకట్టుకుంటున్నారు. ప్రభాస్ కెరీర్‌లో మరో ప్రెస్టీజియస్ మూవీగా తెరకెక్కుతున్న రాజా సాబ్ సినిమా వచ్చే సంక్రాంతి పండుగకు జనవరి 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మరోవైపు రెబల్ స్టార్ ప్రభాస్ భారీ పాన్ ఇండియా సినిమాలు లైనప్ చేసుకున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ నిర్మిస్తున్న సలార్ 2, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో టీ సిరీస్ నిర్మిస్తున్న స్పిరిట్, హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఫౌజీ ప్రభాస్ చేస్తున్న హ్యూజ్ ప్రాజెక్ట్స్. వీటితో పాటు వైజయంతీ మూవీస్ నిర్మాణంలో దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందించనున్న కల్కి 2 కూడా ప్రభాస్ లైనప్ లో ఉంది. ప్రభాస్ చేస్తున్న ఈ సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర సరికొత్త సంచలనాలు సృష్టించబోతున్నాయి.

## అది నా అదృష్టం

### భాగ్యశ్రీ బోర్సే



దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన పీరియాడికల్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. రానా, సముద్రఖని కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా భాగ్యశ్రీ బోర్సే మీడియాతో చిట్ చాట్ చేశారు. కాంత నాకు చాలా స్పెషల్ ఫిల్మ్. ఫుల్ పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉన్న క్యారెక్టర్. చాలా ఎక్సైటెడ్‌గా ఫీల్ అయ్యాను. న్యూ కమ్మర్‌కి ఇలాంటి క్యారెక్టర్ దొరకడం అదృష్టం. ఒక ఛాలెంజ్‌గా ఈ క్యారెక్టర్ ని తీసుకున్నాను. కుమారి క్యారెక్టర్‌కి ఏం కావాలో గ్రౌండ్ వర్క్ చేశాను. 1960 టైమ్స్‌ని రీక్రియేట్ చేయాలి. అది చాలా టఫ్ జాబ్. ఈ సినిమా కోసం పాత తెలుగు తమిళ్ సినిమాలు చూశాను. శ్రీదేవి, సావిత్రి నటన గమనించాను. వాటన్నిటినీ ఇన్స్పిరేషన్ గా తీసుకుని కుమారిని కొత్తగా రీక్రియేట్ చేయడం జరిగింది.కుమారి క్యారెక్టర్ చాలా అద్భుతంగా వచ్చింది. నేను ఫస్ట్ కాంత కథనే విన్నాను. అయితే కొన్ని కారణాలవల్ల ఈ సినిమా కాస్త ఆలస్యంగా మొదలైంది. ఆ గ్యాప్‌లో వేరే రెండు సినిమాలు చేయడం జరిగింది. టెక్నికల్‌గా నేను ఫస్ట్ సైన్స్ చేసిన కథ. ఇది నేను 2023లో విన్న కథ అప్పటి నుంచి మాకు జర్నీ ఉంది. డైరెక్టర్ సెల్వ కుమారి క్యారెక్టర్‌ని ఆయన రాసుకున్న విధానం నన్ను ఆశ్చర్యపరిచింది. చాలా అద్భుతంగా ఉంటుంది. కాంత, ఆంధ్ర కింగ్ వరుసగా వస్తున్నాయి. చాలా ఎక్సయిటింగ్‌గా వుంది. నాకు యాక్షన్ రొమాన్స్ అన్ని జోన్స్ ఇష్టమే. అన్ని రకాల పాత్రలు చేయాలనే ఉంటుంది. ఒక ఆర్టిస్ట్‌కి లాంగ్వేజ్ బ్యారియర్ ఉండదు. మంచి స్క్రిప్ట్స్ ఉంటే చేస్తాను. అయితే నా ఫస్ట్ ప్రిఫరెన్స్ తెలుగు సినిమాకే. తెలుగు సినిమాలు, అలాగే హిందీ సినిమాలు ఉన్నాయి. కాంతలో సినిమాలో ఉంటుంది. ఆంధ్ర కింగ్ ఒక ఫ్యాన్ బయోపిక్. ఈ రెండు కూడా దేనికవే డిఫరెంట్ సినిమాలు. కాంతలో కుమారి క్యారెక్టర్‌కి ఆంధ్ర కింగ్‌లో మహాలక్ష్మి క్యారెక్టర్‌కి అసలు పోలికే ఉండదు. దేనికవే ప్రత్యేకమైన సినిమాలు అని భాగ్యశ్రీ పేర్కొంది.

## 'రోలుగుంట సూరి' ప్రీ రిలీజ్



విలేజ్ బాక్‌డ్రాప్‌లో రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిన మూవీ 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరోహీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ హైదరాబాద్ తెలుగు ఫిలించాంబర్‌లో ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భాంగా దర్శకుడు అనిల్ కుమార్ పల్లా మాట్లాడుతూ.. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ సినిమాపై ప్రశంసలు కురిపించారు. రియల్ స్టిక్ విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో సినిమాను అద్భుతంగా చేశారని అభినందించడం మా చిత్ర యూనిట్‌కు కొత్త ఎనర్జీ వచ్చింది. మ్యూజిక్ పై కూడా ఆయన ప్రశంసలు కురిపించారు. అలాగే ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ లాంచ్ చేసిన మా సినిమాలోని పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. అనూప్ రూబెన్స్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము. మా కృషిని, మా టీం టాలెంట్ను ఆయన ప్రత్యేకంగా అభినందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఖుషి డైరెక్టర్ శివ నిర్వాణ మా సినిమా టీమ్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

వరల్డ్ వైడ్‌గా సిల్వర్ స్క్రీన్ పై సెన్సేషనల్ క్రియేట్ చేసి, 2024 ఆస్కార్ అవార్డులకు నామినేట్ అయిన 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్లెస్'. మూవీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ట్రై లైట్ క్రియేషన్స్ నిర్మించిన ఈ మూవీని దివ్య వాణి సోషల్ కమ్యూనికేషన్స్ మద్దతుతో ఈ మూవీ నవంబర్

## 21న తెలుగులో 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్లెస్'

21న తెలుగు వెర్షన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ తెలుగు ఫిలింఛాంబర్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకప్పటి హీరో రాజా మాట్లాడుతూ ఒకప్పుడు నటుడుగా ఈ ఫిలిమ్ ఛాంబర్ కు వచ్చాను. ఇప్పుడు ఒక పాస్టర్‌గా వచ్చాను. క్షమాపణ అనేది అందరి వల్ల అయ్యేది కాదు. క్షమాపణ అనేది గొప్పది. రాణి మారియా త్యాగం గురించి సినిమా ఉంటుంది. ఈ సినిమా ను ప్రతీ ఒక్కరూ ప్రమోట్ చేయాలి. 123 అవార్డులు పొందిన సినిమా ఇది. ఆస్కార్‌కు కూడా ఎంట్రీ వచ్చిన సినిమా. నవంబర్ 21న విడుదలయ్యే ఈ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.




# పర్యాటక ప్రదేశాలను దత్తత తీసుకోండి

## కార్పొరేట్ సంస్థలకు మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్: పర్యాటకం కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదని.. వారసత్వం, ప్రాచీన సంస్కృతిని మన ముందు ఆవిష్కరిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక ప్రదేశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కార్పొరేట్ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. శిల్పకళావేదికలో బుధవారం నిర్వహించిన దక్షిణ భారత అతి పెద్ద సిఎస్ఆర్ సమ్మిట్ రెండో ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు మన రాష్ట్రానికి వస్తున్నారు. మన సంప్రదాయాలు, పండుగలు, హస్తకళలు, వంటకాలు ప్రపంచవ్యాప్తంగా పేరుపొందాయి. పర్యాటకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతోంది. స్థానిక కళాకారులు, నేయకారులు, చిన్న వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు అని చెప్పారు. కార్పొరేట్ విజయాన్ని సామాజిక ప్రగతితో కలిపే వారధి సిఎస్ఆర్. వారసత్వ కట్టడాల సంరక్షణ, యువత నైపుణ్యాభివృద్ధి, సంప్రదాయ కళల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ఇది కీలకంగా నిలుస్తుంది అని వివరించారు.అన్ని సంస్థలు ఒక్కో పర్యాటక ప్రదేశాన్ని దత్తత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఆర్థిక సహకారం కాదు. బాధ్యతతో కూడిన భాగస్వామ్యం. ప్రభుత్వం కూడా దత్తత తీసుకున్న సంస్థలకు తగిన గుర్తింపు ఇస్తుంది అని చెప్పారు. ఈ సమ్మిట్‌లో 300కు పైగా కార్పొరేట్ సంస్థలు, 100 ఎన్‌జీఓలు పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వినిల్ రెడ్డి నాయకత్వాన్ని ఆయన అభినందించారు. అలాగే 'బచ్పన్ బచావో' సంస్థను కమ్యూనిటీ పార్ట్‌నర్‌గా ఎంపిక చేసినందుకు ప్రశంసించారు.



# 14న ఎల్‌బి స్టేడియంలో 'అరైవ్ అలైవ్'

## పోస్టర్లను విడుదల చేసిన డిజిపి



ప్రజాపక్షం/హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఈనెల 14న ఎల్‌బిస్టేడియంలో భారీ స్థాయిలో 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి వెల్లడించారు. డిజిపి కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిజిపి మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ అరైవ్ అలైవ్ పేరులో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని హైదరాబాద్ లోని ఎల్‌బిస్టేడియంలో నిర్వహించనున్నామని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు జాగ్రత్తలు తెలియచెప్పేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ పట్ల అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేనున్నామన్నారు. దాదాపు పదివేలమంది హాజరుకానున్న ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధితులు సినీ పరిశ్రమకు చెందినవారు, ప్రజా ప్రతినిధులు కార్యక్రములో పాల్గొంటారని పేర్కొన్నాడు. డిసెంబర్, జనవరి నెలలో ఈ రకమైన ప్రజా చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని తద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తామన్నారు. త్వరలో పూర్తిస్థాయి కార్యావరణను రూపొందిస్తామని అన్ని వర్గాల ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా 'ఆరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా పోస్టర్లను డిజిపి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, పోలీస్ కమిషనర్లు ఎ.సి. సజ్జనార్, అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్, మల్టిజోన్1 ఐజి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, రోడ్ సేఫ్టీ విభాగం ఎస్‌పిలు జి. సుదీష్, మనోహర్, వలంటీర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పొరపాటు చేయను

(మొదటి పేజీ తరువాయి)

విచారించిందని, దీంట్లో తన భాగస్వామ్యం లేదని చెప్పినట్లు ప్రకాశ్‌రాజ్ తెలిపారు. 2016లో ఇంకా బెట్టింగ్ మొదలు కాలేదని, ఓ గేమింగ్ యాప్ గురించి ప్రకటనలో మాత్రమే పాల్గొన్నట్లు చెప్పారు. ఆ తర్వాత బెట్టింగ్ అని తెలిసి ఆ యాడ్ నుంచి తప్పుకున్నానని గుర్తుచేశారు. అప్పుడే తన ఒప్పందాన్ని సైతం రద్దు చేసుకున్నట్లు చెప్పారు. తాను ఎలాంటి పేమెంట్ తీసుకోలేదని సిట్ అధికారులకు చెప్పినట్లు ప్రకాశ్‌రాజ్ మీడియాకు తెలిపారు. ఈ బెట్టింగ్ యాప్ కేసులో పలువురు ఫిర్యాదు చేయడంతో సిఐడి విచారణ కూడా జరిగిందని, 2017లోనే బెట్టింగ్ యాప్ బ్యాన్ జరిగిందని వెల్లడించారు. 2016లో ఇంకా బెట్టింగ్ మొదలు కాలేదని, గేమ్ అనుకుని యాడ్ చేశామని చెప్పానని తెలిపారు. ఆ తర్వాత బెట్టింగ్ యాప్‌గా రూపాంతరం చెందిందని తెలిసి ఆ యాడ్ కొనసాగించలేదని స్పష్టం చేశారు.

**క్షమాపణ కోరిన ప్రకాశ్‌రాజ్ :**

ఇతర బెట్టింగ్ యాప్‌లకు ఏమైనా చేశారా? అని సిట్ అధికారులు అడిగితే లేదని చెప్పినట్లు ప్రకాశ్‌రాజ్ తెలిపారు. బెట్టింగ్ యాప్‌నకు సంబంధించి వివరాలు కూడా సమర్పించానని, బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చిన దాంట్లో ఏమీ లేదని అన్నారు. బెట్టింగ్ యాప్ వల్ల యువత జీవితాలు పాడై పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పే అవుతుందని, అందుకే దీనిపై క్షమాపణ కోరుతున్నట్లు అభ్యర్థించారు. ఈ విషయంలో తనను క్షమించాలని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు చేయబోనని స్పష్టం చేశారు.

# కొండా సురేఖ క్షమాపణలు (మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలం క్రితం బిఆర్ఎస్ నేత కెటిఆర్‌ను విమర్శించే క్రమంలో కొండా సురేఖ... అక్కినేని నాగార్జున కుటుంబంపై, ముఖ్యంగా నాగచైతన్య, సమంత విడాకుల అంశంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. కొండా సురేఖ వ్యాఖ్యలపై నటుడు నాగార్జున తీవ్రంగా స్పందించారు. ఆమెపై పరువు నష్టం దావా కూడా వేశారు. మరోవైపు నాగచైతన్య, సమంత సైతం తమ విడాకులు పరస్పర అంగీకారంతో తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని, తమ పేర్లను అనవసరంగా రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ వెనక్కి తగ్గి క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది.

# నిరసన ప్రదర్శనలు (మొదటి పేజీ తరువాయి)

పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో కోరింది. ''కులపరమైన అసమానతలతో కొట్టుమిట్టాడుతున్న మన సమాజంలో సామాజిక న్యాయాన్ని సాధించాల్సిన బాధ్యత పాలకులదేనని భారత రాజ్యాంగం చాలా స్పష్టంగా చెప్పింది, అదేవిధంగా దళితులు, మైనారిటీలకు వ్యతిరేకంగా జరిగే అక్రమాలను కూడా పాలకులే నివారించాలని పేర్కొంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాలలో ఈ మధ్య దళితులకు వ్యతిరేకంగా అఘాయిత్యాలు జరిగాయి. ఉత్తర ప్రదేశ్‌లో భారత కమ్యూనిస్టుపార్టీ ఈ ఏడాది అక్టోబరు 16వ తేదీన ఒక నిరసన దినం కూడా పాటించింది. ఇలా జరుగుతున్న అఘాయిత్య సంఘటనలను పార్టీ జాతీయ కార్యదర్శివర్గం చాలా తీవ్రంగా పరిగణించింది. అందువల్ల నవంబరు 18వ తేదీ అంటే వచ్చే మంగళవారం దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ దినంగా పాటించాలి. నిరుద్యోగం, సామాజిక న్యాయ స్ఫూర్తికి విరుద్ధంగా పెరుగుతున్న ప్రైవేటీకరణ కారణంగా అణగారిన వర్గాలకు తగ్గిపోతున్న రిజర్వు ఉద్యోగాలు, కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలవల్ల పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిరసన ప్రదర్శనల సందర్భంగా ప్రధానంగా ప్రజల ముందుకు తెచ్చి వివరించాలి'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది.

# ప్రతిభావంతులు లేరు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమన్న విషయాన్ని ఒప్పుకుంటూ కొన్ని రకాలైన నైపుణ్యం అమెరికాలో లేదని, అలాంటి నైపుణ్యాన్ని ప్రపంచం నలుమూలల నుండీ తెచ్చుకోవాల్సిందేననీ అంగీకరించారు. అదేసమయంలో అమెరికన్ నిరుద్యోగులు తమ నైపుణ్యం పెంచుకోవాలని, విదేశీ నైపుణ్యాన్ని వంటపట్టించుకునేందుకు వారి అనుభవ జ్ఞానం సంపాదించాలన్నారు. ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్–1బి వీసాలపై అడిగిన ప్రశ్నకు ట్రంప్ పైవిధంగా స్పందించారు. ''నిజమే, నేను అంగీకరిస్తాను, కానీ మీరు కూడా నైపుణ్యం గలవారినే తీసుకురావాలి'' అన్నారు. హెచ్–1 బి వీసాల జారీ మీ పాలనాయంత్రాంగానికి పెద్ద సమస్య కాకపోయినా, దేశీయంగా అమెరికన్లకు వేతనాలు పెంచాలంటే లక్షలాదిమంది విదేశీ కార్మికులతో దేశం నిండిపోకూడదని మీ ఉద్దేశమా? అని ఫాక్స్‌న్యూస్ ప్రతినిధి లారా ఇన్‌గ్రాహమ్ ప్రశ్నించినప్పుడు, ''లేదు, అలా కాదు, మన దగ్గర కొన్ని రకాల నైపుణ్యం లేదు, మన అమెరికన్లు ఆ నైపుణ్యాన్ని నేర్చుకోవాలి, నిరుద్యోగులుగా ఉన్నారు కదా అని ఎలాంటి శిక్షణా లేకపోయినా వారిని ఉద్యోగాల్లోకి తీసుకోలేం, నేను మిమ్మల్ని తీసుకెళ్ళి ఒక కర్మాగారంలో ఉద్యోగానికి పెడతాను, మనం క్షిపణులను తయారు చేయాలనుకుంటాం, కానీ ఆ నిరుద్యోగికి ఎలాంటి శిక్షణా లేనప్పుడు వారు అక్కడ ఎలా పనిచేయగలరు?'' అని ట్రంప్ ప్రశ్నించారు. జార్జియాలో ఒక కర్మాగారంలో పని విధానాన్ని ఆయన ఉదహరించారు. అక్కడ వారు అక్రమ వలస కార్మికులను పనిలో పెట్టుకున్నారు, వారంతా దక్షిణ కొరియా నుండి వచ్చారు, అక్రమ వలస కార్మికులే కావాలని వారు కోరుకున్నారు. ఎందుకంటే అక్కడ బ్యాటరీలు తయారు చేస్తున్నారు, జీవితాంతం వారు బ్యాటరీలనే తయారు చేస్తారు, మీకు తెలుసా, బ్యాటరీలు తయారు చేయడం చాలా కష్టమైన పని, అదంత సులభం కాదు, అది చాలా ప్రమాదకరం కూడా, చాలా పేలుళ్ళు జరుగుతాయి, చాలా చాలా సమస్యలుంటాయి, అవన్నీ ఎదుర్కోవాలి'' అన్నారు. వారంతా 500–600 మంది ఉంటారు, చిన్న ఉద్యోగులు, కానీ టెక్నాలజీ తెలిసినవారు ఆ పనులు ఎలా చేయ గలుగుతారు? కానీ వారు దేశం నుండి వెళ్ళిపోవాలనుకున్నారు, మనకూ అదే కావాలి, కానీ ఈ విషయంలో మనం ఏకీభవించం' అన్నారు.

ఏదైనా ఒకదేశం ఇక్కడికి వచ్చి ఒక కర్మాగారం పెడితే లేని నిరుద్యోగులను వారికి సరఫరా చేయలేం కదా? అన్నారు. ట్రంప్ యంత్రాంగం ఇంతకుముందు హెచ్–1 బి వీసాలపై ఉక్కుపాదం మోపాలని చూసింది. కొత్తగా దేశంలోకి వచ్చేవారు ఏకమొత్తగా ఒకేసారి లక్ష డాలర్లు చెల్లించాలని నిబంధన విధించింది. ఈ వీసాలపై అమెరికా వెళ్ళేవారిలో భారతీయులే ఎక్కువగా ఉన్నారు. ఈ ఏడాద సెప్టెంబరులో ట్రంప్ ఈ వీసాల విషయంలో సంస్కరణలు తెచ్చారు. గతవారంలో కార్మికశాఖ హెచ్–1 బి వీసాలను దుర్వినియోగం చేశారనే పేరుతో 175 కేసులపై దర్యాప్తు చేపట్టింది.

# దూసుకెళ్ళిన ఆదివాసీలు

(మొదటి పేజీ తరువాయి)

తలకు రంగు రంగుల పింఛాలు ధరించి తలుపులు బద్దలు కొట్టుకుని, మెటల్ డిటెక్టర్లను ఛేధించుకుని దూసుకువెళ్ళారు. ఐక్యరాజ్యసమితి భద్రతా దళాలు ఎదురువెళ్ళి వారిని అడ్డుకోవడంతో మొదట తోపులాట జరిగింది.'మా అడవులు అమ్మకానికి సిద్ధంగా లేవు, మా అడవులను మీకు అమ్మేది లేదు.. అని రాసి ఉన్న బ్యానర్లను దేశీయ ఆదివాసీ జాతుల ప్రజలు ప్రదర్శించారు. మరికొంతమంది టీ–షర్టులు ధరించి వచ్చారు. వారి టీ–షర్టులపై ''జుంటాస్'' అని రాసి ఉంది. ఆదివాసీ ప్రజలు సదస్సు లోపలికి దూసుకువచ్చి మా అడవులు అమ్మకానికి సిద్ధంగా లేవంటూ నినాదాలు చేశారు. వారిని బలవంతంగా బయటకు గెంటుకుంటూ వెళ్ళారు. వారిని ఎవరు రెచ్చగొట్టి ఈ సదస్సు దగ్గరకు తీసుకువచ్చారన్న విషయం వెల్లడికాలేదు. ఐతే చాలాసేపు నిరసన ప్రదర్శన, నినాదాలు చేసిన తర్వాత మెల్లిగా వారిని భద్రతా సిబ్బంది అక్కడి నుండి బయటకు పంపేశారు. ఈ ఘర్షణలో ఇద్దరు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయని, సదస్సు ప్రాంగణానికి స్వల్పంగా నష్టం జరిగిందని ఐక్యరాజ్యసమితి వాతావరణ ప్రతినిధి ఒకరు చెప్పారు. వారిని ఎవరు ఈ విధంగా సదస్సులోకి వచ్చేట్లు చేశారు? దానికి బాధ్యులెవరనే విషయంపై తర్వాత అందరూ చర్చించారు. 'కనీసం ఇక్కడ ఇదైనా జరిగింది, స్థానిక జాతులవారు తమ అడవుల సంరక్షణ కోసం ఏదో రూపేణా ఇక్కడికి వచ్చారు' అని పనామా నుండి వచ్చిన వాతావరణ ప్రతినిధి జాన్ కార్లోస్ మాంటెర్రే గోమెజ్ అన్నారు. గ్లోబల్ యూత్ కొయిలేషన్‌కు చెందిన ప్రతినిధి అగస్టిన్ ఒకానా అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ.. 'మేం లేకుండా మా భవిష్యత్తును ఎవరూ నిర్దేశించలేరు'' అని వారు నినాదాలు చేశారని, వారికి ఈ సదస్సు గురించి మంచి సమాచారమే తెలిసిందని అన్నారు. ఆదివాసీలు, భద్రతా సిబ్బంది పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారని, కొందరికి రక్తం కారిందని ఆయన చెప్పారు. ''ఈ సదస్సు నిర్వహించడానికి ఎంతో ఖర్చు పెట్టి ఈ బెలాం కొత్త గ్రామాన్ని నిర్మించారు. భారీ ఎత్తున ఎంతో సామాగ్రి, ఎన్నో వనరులు సదస్సు ప్రాంగణానికి వస్తుంటే స్థానిక ఆదివాసీలు ఎందుకు చూస్తూ ఊరుకుంటారు? ఈ ధనాన్ని అంతా కూడవేస్తే వారి విద్యావైద్యాలకు ఖర్చు చేయడానికి వీలు పడుతుంది, అందుకే వారు సదస్సు ప్రాంగణంలోకి దూసుకువచ్చారు, దేశీ ఆదివాసీ ప్రజలు విసిగిపోయి ఉన్నారు, వారికి వనరులు, సదుపాయాలు లేవు, వారికేమీ తెలియదు, వారు అమెజాన్ నదీ తీరంలో ఉన్న తమ భూమిని కాపాడుకోవాలని భావించారు'' అని అగస్టిన్ ఒకానా అన్నారు.తర్వాత ఐక్యరాజ్యసమితి సభ్యుడు మాట్లాడుతూ... బ్రెజిల్, ఐక్యరాజ్యసమితి భద్రతా సిబ్బంది రక్షణ బాధ్యత వహించాలని, ఈ ఘటనపై దర్యాప్తు చేయాలన్నారు.

**ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీలకు నియంత్రించాల్సిందే**

గతంవలే కాకుండా ఈసారి బ్రెజిల్ ప్రభుత్వం వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేసేవారిని, పౌర సమాజాన్ని కూడా ఈ కాప్ –30 సదస్సులో క్రియాశీల పాత్ర పోషించాలంటూ ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రోత్సాహం కారణంగా సదస్సు ప్రాంగణంలో రోజుకు నాలుగు రకాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక రేపు వంద పడవలలో అనేకమంది దేశీయ జాతులకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు రానున్నారు. 200 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో జరిగే చర్చల్లో పాల్గొంటున్నారు. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన సదస్సు సమావేశాలు 21వ తేదీ వరకూ కొనసాగుతాయి. పారిస్‌లో దేశాలమధ్య ఒప్పందం కుదిరిన పది సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతున్నది. ఈసారి కార్యాచరణకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, భూమి ఉష్ణోగ్రతలను 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ తగ్గించేందుకు ప్రతి దేశం ఆచరణాత్మక చర్యలు తీసుకునేట్టు అందరూ పూనుకోవాలనే పట్టుదల బ్రెజిల్ ప్రదర్శిస్తున్నది. మొదటిసారి బ్రెజిల్‌లోని అమెజాన్ రెయిన్ ఫారెస్టు ప్రాంతంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 3000 మంది దేశీయ జాతుల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని బ్రెజిల్ మంత్రి సోనియా గుజజారా చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com